www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మా చమురు కొనకపోతే పోండి

మేం ఎవరినీ ఒత్తిడి పెట్టడం లేదు

మా రైతులు, వ్యాపారులే మాకు ముఖ్యం

అమెరికా, యూరప్ బయ్యర్లకు తేల్చిచెప్పిన విదేశాంగ మంత్రి జైశంకర్

రష్యా చమురు అంశంపై స్పష్టత.. అమెరికా వ్యాపారానికి జై కొడుతూ..

ఇతరులను తప్పుబట్టడం హాస్యాస్పదం.. చైనాకే ఎక్కువగా రష్యా చమురు

అయినా ప్రతీకార సుంకాలు వేయరు.. ఇది పూర్తిగా అన్యాయమన్న మంత్రి

14

అమెరికాకు పార్సిళ్లు బంద్

రేపటినుంచి తపాలాశాఖలు తీసుకోవు

లేఖలు, పత్రాలు, గిఫ్టలకు మినహాయింపు

ఆదివారం | 24-8-2025 | పేజీలు: 16 + 32 పేజీల వినాయక ప్రతకల్పం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 169 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం, తిథి: పాడ్యమి ఉ.11:49 తదుపరి విదియ, నక్షత్రం: పుబ్బ రా.2:06 తదుపరి ఉత్తర, వర్జ్యం: ఉ.9:18-10:59, దుర్ముహూర్తం: సా.4:51-5:41, అమృతఘడియలు: రా.7:23-9:03, రాహుకాలం: సా.4:30-6:00, సూర్యోదయం: 6:03, సూర్యాస్తమయం: 6:31 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


RAJENDRA NAGAR, HYDERABAD
RERA NO: P02400009910;
PERMIT NO. 0474/GHMC/SWBP/CHR1/2025
Live the indulgent life you were meant for with a 6-level palace-themed clubhouse.
6967 Sq. Mt. (75,000 Sq. Ft.) Clubhouse
Royal Arrival Experience
Plentiful Podium Amenities
Regally Curated Landscapes
Artist's impression for representation purpose only.
PREMIUM 2, 3 & 4 BHK HOMES STARTING AT ₹1.09 CR*
SCAN TO KNOW MORE
9986791598 / 9513443803
Godrej | PROPERTIES
RERA Registered. RERA No: P02400009910; Project: Godrej Regal Pavilion, Permit no. 0474/GHMC/SWBP/CHR1/2025; Survey No: 253/P, 254, 255, 256/P, 259/P at Gagan Pahad, Rajendranagar, Ranga Reddy, 500052; Website: https://rera.telangana.gov.in/
The images contain artist's impressions. No warranty is expressly or impliedly given that the completed development will comply in any degree with such artist's impression as depicted. The furniture, accessories, paintings, plantations, landscaping, items, electronic goods, additional fittings/fixtures, decorative items, false ceiling including finishing materials, specifications, shades, sizes and colour of the tiles, etc. shown in the image are only indicative in nature and are only for the purpose of illustrating/indicating a conceived layout and do not form part of the standard specifications/amenities/services to be provided in the unit and/or the Project. The Sale is subject to terms of Application Form and Agreement for Sale. All specifications of the unit shall be as per the final agreement between the Parties. Recipients are advised to apprise themselves of the necessary and relevant information of the project prior to making any purchase decisions. The official website of Godrej Properties Ltd. is www.godrejproperties.com. Please do not rely on the information provided on any other website. T&C Apply.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 24-8-2025 | Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | గుంటూరు సిటీ

ఆటోడ్రైవర్ కుమార్తె అద్భుతం

మూడు కేటగిరీల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్



విశాఖ నగర పరిధిలోని చినముషిడివాడకు చెందిన బోకం అనిత మూడు కేటగిరీలలో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకులు సాధించారు. స్కూల్ అసిస్టెంట్ బయాలజీలో 89.71 మార్కులు, టీజీటీ బయాలజీలో 84.95 మార్కులు, సైన్స్‌లో 77.9 మార్కులతో ప్రథమ ర్యాంకు సాధించి సత్తా చాటారు. అనిత భర్త గేదెల స్వామినాయుడు రైల్వేలో ట్రాక్‌మ్యాన్‌గా పనిచేస్తున్నారు. వీరికి మూడున్నరేళ్ల బాబు ఉన్నాడు. అనిత తండ్రి సత్యం ఆటో డ్రైవర్. మొదటి నుంచీ కుమార్తెను చదువులో ప్రోత్సహించారు. సోదరుడు మహేశ్ మర్చెంట్ నేవీలో ఉద్యోగం చేస్తున్నారు. వారందరి సహకారంతోనే మూడు ర్యాంకులు సాధించానని అనిత అన్నారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులో చేరనున్నట్టు తెలిపారు.



కూలీ బిడ్డ తడాఖా

ఐదు పోస్టులకు అర్హత

ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎర్రావారిపాలెం మండలం ఎల్లమంద గ్రామం ఓఎస్ గొల్లపల్లెకు చెందిన వ్యవసాయ కూలీ వెంకటరమణ కుమారుడు శేషాద్రి ఐదు ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. స్కూల్ అసిస్టెంట్ సోషల్, సెకండరీ గ్రేడ్ పోస్టు, టీజీటీ తెలుగు, టీజీటీ సోషల్, ఎస్ఏ తెలుగు పోస్టులకు అర్హత సాధించారు.

సార్లొచ్చారు!

16,347 మంది జీవితాల్లో వెలుగులు



రాష్ట్ర చరిత్రలో ఇదే అతిపెద్ద డీఎస్సీ

- నాలుగు నెలల్లోనే భర్తీ ప్రక్రియ పూర్తి
- నేడు మెరిట్ అభ్యర్థులకు కాల్ లెటర్లు
- రేపటినుంచి జిల్లాల్లో సర్టిఫికెట్ల పరిశీలన
- ఒక్కపోస్టూ భర్తీ చేయకుండా జగన్ వంచన

అమరావతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం అనేది ఓ కల. టీచర్ ఉద్యోగం సాధించడమనేది కొన్ని లక్షల మంది నిరుద్యోగుల జీవితాశయం. అలాంటి వారి లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం నెరవేర్చింది. విభజిత రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని స్థాయిలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసి ఒకేసారి 16,347 మంది జీవితాల్లో వెలుగులు నింపింది. సీఎం చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన తర్వాత మెగా డీఎస్సీ ఫైలుపైనే తొలి సంతకం చేశారు. ఎలాంటి న్యాయ వివాదాలకూ తావులేకుండా పరీక్షలు, ఫలితాల ప్రక్రియను పూర్తిచేసిన కూటమి ప్రభుత్వం ఆదివారం మెరిట్ అభ్యర్థులకు కాల్ లెటర్లు అందిస్తోంది. గత డీఎస్సీలు అంటే

మిగతా 12వ పేజీలో...

"రాష్ట్రంలో ఎక్కడా అర్హుల పింఛన్లు తొలగించలేదు. కానీ లక్ష పింఛన్లు తొలగించినట్లు వైసీపీ సోషల్ మీడియా తప్పుడు ప్రచారం చేస్తోంది. సంక్షేమ పథకాలపై చర్చ జరగరాదనే కుట్రతోనే ఇదంతా చేస్తున్నారు. అమరావతి మునిగిపోయింది, ప్రకాశం బ్యారేజీలో గేటు విరిగిపోయిందంటూ ఫేక్ ప్రచారాలు చేస్తున్నారు. వైసీపీ విధానాలను, కుట్రలను ఉదాహరణలతో చెబితే ప్రజలు అర్థం చేసుకుంటారు. మనం చేసిన మంచిని ప్రజలకు నిత్యం వివరించాలి. ప్రజలకు వాస్తవాలు చెబుతూనే ఉండాలి. 'గెలిచాం.. అధికారంలో ఉన్నాం కదా' అని తప్పుడు ప్రచారాలను ఉపేక్షిస్తే అది ప్రమాదకరంగా మారుతుంది."

- చంద్రబాబు

ప్రతిపక్షం కాదు.. విషవృక్షం



ఆ భూతాన్ని పాతాళంలోకి దించేశామనుకున్నాం కానీ, ఫేక్ ప్రచారాలతో మళ్లీ పైకొస్తోంది

- ఉపేక్షిస్తే రాష్ట్రానికి ప్రమాదకరం.. హత్యలు, దొంగతనాలు చేసేవారంతా వైసీపీలోనే
- జగన్‌లాంటి వ్యక్తికి పార్టీ పెట్టే అర్హతే లేదు.. మునిగింది అమరావతి కాదు, వైసీపీనే
- భూస్థాపితం కాబోయేది కూడా ఆ పార్టీయే.. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సభలో బాబు ధ్వజం
- పదేళ్ల పది వైసీపీ కుట్రలను వివరించిన సీఎం.. అందరి ఆలోచనలు మారితేనే స్వర్ణాంధ్ర
- 2019-2024లో వైకుంఠపాళి ఆటలా పైనుంచి కిందకు పడిపోయిన రాష్ట్రం
- మళ్లీ మనకు ఆ ఆట వద్దని ముఖ్యమంత్రి పిలుపు.. పెద్దాపురంలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ

కాకినాడ జిల్లా పెద్దాపురంలో మురుగు కాలువను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

బిలియనీర్ బాబు

దేశంలోని అత్యంత సంపన్న ముఖ్యమంత్రుల జాబితాలో అగ్రస్థానం

- కుటుంబ ఆస్తులు 931 కోట్లు.. 10 కోట్ల అప్పులు
- 30 కోట్ల ఆస్తులతో ఏడో స్థానంలో రేవంత్ రెడ్డి
- రూ.15 లక్షలతో చివరి స్థానంలో మమతా బెనర్జీ
- అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ నివేదిక

13

కాకినాడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రతిపక్షం కాదు.. విష వృక్షమని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. సోషల్ మీడియాలో మహిళలపై బూతులు, రౌడీ రాజకీయాలు, తప్పుడు విధానాలే జగన్ పార్టీ అజెండా అంటూ ఆగ్రహించారు. జగన్ పార్టీ నేరపూరిత రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో జగన్ అనే భూతాన్ని పాతాళంలోకి దించేశాం అని పెట్టుబడిదారులకు ధైర్యం చెప్పామని, కానీ ఫేక్ ప్రచారాలతో అరుంధతి సినిమాలో

మిగతా 13వ పేజీలో...



కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణంలోని మిరపకాయల వీధిలో చిన్నారులతో సీఎం సెల్ఫీ

కొత్త నేతలకు పార్టీ పదవులు

- క్లస్టర్ ఇన్‌చార్జులకు జిల్లా కమిటీల్లో చోటు
- కమిటీ నియామకంలో సోషల్ ఇంజనీరింగ్
- తప్పు చేస్తే రెండో అవకాశం కోల్పోతారు
- ప్రభుత్వ, పార్టీ స్థాయి పెంచేలా ఉండండి
- పార్టీ నేతలకు చంద్రబాబు హితవు
- 6న 'సూపర్ సిక్స్-సూపర్ హిట్'కు శ్రీకారం

ధర్మస్థలపై తొలగిన 'ముసుగు'!

- శవాల ఖననంపై నేను చెప్పినవన్నీ అబద్ధాలే
- కొంత మంది ఒత్తిడి చేసి ఫిర్యాదు చేయించారు
- సిట్ ఎదుట మాజీ పారిశుధ్య కార్మికుడి ఒప్పుకోలు
- చన్నయ్యను అరెస్టు చేసి, కస్టడీకి తీసుకున్న అధికారులు
- అనన్య భట్ తన కూతురు కాదన్న సుజాత భట్
- ఓ వ్యక్తి ఒత్తిడితో అబద్ధాలు చెప్పినట్లు అంగీకారం

14



చన్నయ్య

ఆ జడ్జీలంతా నక్సలైట్లేనా?

- 'సల్వాజుడుం' తీర్పు చదివి ఉంటే అమిత్‌షా అలా మాట్లాడేవారు కాదు!
- తీర్పులో నాతోపాటు మరో జడ్జీ ఉన్నారు
- ఇంకో ఇద్దరు జడ్జీలు రివ్యూ పిటిషన్‌ను కొట్టేశారు
- అమిత్‌షా వ్యాఖ్యలపై జస్టిస్ సుదర్శన్‌రెడ్డి



14

బెట్టింగ్ కేసులో కర్ణాటక ఎమ్మెల్యే అరెస్ట్

- 12 కోట్ల నగదు, 6 కోట్ల విలువైన బంగారం స్వాధీనం
- సిక్కింలో ఎమ్మెల్యే వీరేంద్రను అదుపులోకి తీసుకున్న ఈడీ
- క్యాసినో లీజు వ్యవహారంపై అక్కడికి వెళ్లిన ఎమ్మెల్యే



14

ఈడీ స్వాధీనం చేసుకున్న నగదు; ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ

వ్యవసాయ పంపుసెట్లు, ఫీడర్లకు

సోలార్ విద్యుత్తు

10

- 5842 ఎకరాల్లో సౌర విద్యుత్తు ప్లాంట్ల స్థాపన
- 'పీఎం కుసుమ్' లక్ష్యంపై డిస్కమ్‌లకు సీఎస్ ఆదేశాలు

మద్యం కొత్త బ్రాండ్లకు బ్రేక్!


- ఎక్సైజ్ శాఖ ప్రతిపాదనలకు సీఎం తిరస్కరణ
- ప్రస్తుతానికి కొత్తవి అవసరం లేదని నిర్ణయం

12

రేపు మరో అల్పపీడనం

26 నుంచి ఉత్తర కోస్తాలో వర్షాలు

11



అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని బొటానిక్ గార్డెన్

విశ్వవిద్యావనం

శ్రీకృష్ణదేవరాయ వర్సిటీలో 22 వేల మొక్కలు, చెట్లు

- 12 ఎకరాల్లో 900 జాతుల మొక్కలు
- బొటానిక్ గార్డెన్ పేరిట విస్తృతంగా పెంపకం
- ఇందులో ఔషధ, పూలు, పండ్ల మొక్కలు
- మియావాకి విధానంలో వృక్షజాతికి జీవం
- ఇతర ప్రాంతాలకూ మొక్కల పంపిణీ
- సత్ఫలితాలిస్తున్న ప్రొఫెసర్ల ప్రయోగం

విశ్వవిద్యాలయం ఏదైనా ఉన్నత బోధన, పరిశోధన కేంద్రాలు, లైబ్రరీ, హాస్టళ్లతో సందడి సందడిగా ఉంటుంది. క్యాంపస్‌లో ఏళ్ల నాటి చెట్లూ కనిపిస్తాయి. అనంతపురం జిల్లాలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మరింత ప్రత్యేకం. ఇక్కడి అధ్యాపకులు వర్సిటీలోనే ఓ అడవిని సృష్టించారు. అంతరించిపోతున్న అరుదైన వృక్షజాతికి జీవం పోస్తున్నారు. ప్రస్తుతం వర్సిటీ ప్రాంగణంలో మొక్కలు, చెట్లు కలిపి దాదాపు 22 వేలు ఉన్నాయి. ప్రొఫెసర్ల కృషితో వర్సిటీలోని 12 ఎకరాల్లో 900 రకాల వృక్ష జాతులు ప్రాణం పోసుకుంటున్నాయి. ప్రభుత్వ సహకారం, సంస్థల సౌజన్యంతో మియావాకి విధానంలో

మిగతా 9వ పేజీలో...



ఆదివారం అనుబంధం బదులుగా 'శ్రీ వినాయక పూజా విధానం' నేటి దినపత్రికతో ఉచితంగా అందుకోండి.

- మేనేజింగ్ డైరెక్టర్

నేడు సురవరం అంతిమ యాత్ర

- అధికార లాంఛనాలతో నిర్వహణకు టీ-సీఎం ఆదేశం
- నివాళులు అర్పించిన డి.రాజా, కూనంనేని
- చంద్రబాబు, స్టాలిన్ సహా ప్రముఖుల సంతాపం
- దేశ కమ్యూనిస్టు అత్యున్నత నేతల్లో ఒకరు: సీపీఐ

13



ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- దేశంలో అధికారంలో దొంగ ఓట్ల పార్టీ
- రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యం: నారాయణ
- ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు ప్రారంభం

9

ప్రజాగ్రహ గళం – ఉద్యమాల దళం

'ఆదర్శం ఆచరణల – సముచిత సమన్వయం/ కమ్యూనిజమే నిజమని – చెదరని విశ్వాసం'గా జీవితాంతం అరుణ పతాకం నీడ కింద జీవితాన్నీ, వ్యక్తిత్వాన్నీ తీర్చిదిద్దుకున్న ఆదర్శ కమ్యూనిస్టు సురవరం సుధాకరరెడ్డి.

1942 మార్చి 25న అప్పటి మహబూబ్‌నగర్ జిల్లా కొండ్రావుపల్లెలో సురవరం వెంకట్రామరెడ్డి–ఈశ్వరమ్మ దంపతులకు పుట్టిన సుధాకరరెడ్డి పెదనాన్న సురవరం ప్రతాపరెడ్డి. పెదనాన్న నుంచి సంక్రమించిన సాహిత్యాభినివేశం, తండ్రి నుంచి లభించిన స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో బాల్యం నుంచి ఉద్యమ లక్షణాలు పుణికి పుచ్చుకున్న సుధాకరరెడ్డి పువ్వుపుట్టగానే పరిమళిస్తుందన్నట్లు పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడే స్కూల్‌లో బ్లాక్‌బోర్డులు, చాక్‌పీసులు, పాఠ్యపుస్తకాలు కావాలంటూ 15 ఏళ్ళ ప్రాయంలోనే ఆందోళనకు నాయకత్వం వహించాడు. అది క్రమంగా జిల్లా వ్యాప్త ఆందోళనగా విస్తరించి, సమస్య పరిష్కారానికి దారితీసింది. విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు భావజాలం ఆయనను ఆకర్షించింది.

1950లో అఖిల భారత విద్యార్థి సమాఖ్య కర్నూలు పట్టణ కార్యదర్శిగా, తర్వాత జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించాడు. 1964లో కర్నూలు కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. 1967లో ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయకళాశాల విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర బాధ్యతలు చేపట్టాడు. 1970లో అఖిల భారత విద్యార్థి సమాఖ్యకు, 1972లో అఖిల భారత యువజన సమాఖ్యకు జాతీయ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించాడు. 2000లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి చరిత్రాత్మకమైన విద్యుత్ ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించాడు. 1988లో, 2004లో నల్లగొండ నియోజకవర్గం నుంచి పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికయ్యాడు. నల్లగొండలో ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి కృషి చేశాడు. కేరళ యువనేత సి.కె.చంద్రప్పన్‌తో కలిసి 18 ఏళ్ళకే ఓటుహక్కు కోసం లోక్‌సభలో గళమెత్తి, తమ డిమాండ్‌ను సాధించాడు.

ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పార్లమెంట్‌లో పీడిత ప్రజల పక్షాన, శ్రామిక జనం, రైతాంగం, మహిళల సమస్యలపై బలమైన గళగర్జనలు వినిపించాడు. ప్రజల న్యాయమైన హక్కుల సాధన కోసం అవిశ్రాంతంగా కృషి చేశాడు. ప్రభావవంతమైన వక్తగా మూడుతరాల విద్యార్థులను, యువజనులను, శ్రామికులను ప్రభావితం చేసిన సుధాకరరెడ్డి మూడు పర్యాయాలు (2012 నుంచి 2019 వరకు) సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాడు. చండ్ర రాజేశ్వరరావు తరువాత భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన రెండవ తెలుగు నేత సురవరం కావడం విశేషం.

సుధాకరరెడ్డి నేతృత్వంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ, జాతీయస్థాయిలోనూ అన్ని ప్రజాసంఘాలలో క్రియాశీలంగా పనిచేశాయి. వారి ప్రత్యక్ష పర్యవేక్షణలోనే 2003లో హైదరాబాద్ నగరంలో అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం జాతీయ మహాసభలు ఘనంగా జరిగాయి.

తెలంగాణ తొలిదశ ఉద్యమం (1969) సందర్భంగా 'సమైక్యాంధ్ర' నినాదం చేపట్టిన భారత కమ్యూనిస్టు పార్టీ, తెలంగాణ రాష్ట్ర సాధన తుదిదశ ఉద్యమ కాలంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు సంపూర్ణమైన మద్దతును ప్రకటించడం వెనుక సుధాకరరెడ్డి ప్రమేయం నిత్య స్మరణీయం.

జీవితంలోనూ, ఉద్యమ ప్రస్థానంలోనూ ఎన్నో ఒడిదుడుకులనూ, జయాపజయాలనూ ఎదుర్కొంటూనే తాను నమ్ముకున్న కమ్యూనిస్టు సిద్ధాంతాల కోసం అంకితమై పురోగమించిన సురవరం సుధాకరరెడ్డి జీవితం, వ్యక్తిత్వం, సిద్ధాంతం నేటితరానికీ, రానున్న తరాలకూ స్ఫూర్తిదాయకం, ఆదర్శప్రాయం.



○ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ
పూర్వ ఉపకులపతి, తెలుగు విశ్వవిద్యాలయం

సుధాకర దుర్గం

పాలమూరు నడిగడ్డన
ఇసుక ఎడారిలో పరిమళించిన మందారం
గుక్కెడు నీళ్ళులేని నేల
ప్రజా గొంతై ప్రతిధ్వనించిన మాటల మహానది
ప్రతాపరెడ్డి సాహిత్యపు గోలకొండ
సుధాకర్ రెడ్డి కమ్యూనిస్టు దుర్గం

బాల్యంలో
ఆకాశపు నక్షత్రాలమధ్య
ఎంతమందిలున్నా చందమామలా ఆయననే చూసేది
వెతికి వెతికి చూపిచ్చేది మా ఊరి పెద్దలు
వేదికలపై మా కలల రెక్కల్ని విప్పారు
మతోన్మాద ఫాసిస్ట్ విధానాలపై చలి మంటల విసుర్లు
సత్య ప్రపంచానికి సమిధయి ఎదురీదిన
మా చేగువేరా! మా ఫిడెల్ కాస్ట్రో!

అందుకోలేనంత ఎత్తులో మీ ప్రభ
వడగళ్ల సవ్వడిలా
అగ్నిజ్వాలలా ఉవ్వెత్తున ప్రసంగాలు
మహాకావ్యాలు చదివినంత సంతృప్తి
యువత గుండెల్లో విప్లవ నవతను ఆవిష్కరించారు
ప్రగతిశీల భావాల వేకువై
మీరు నడిచిన తొవ్వ ఆచరణీయం


రాచరికాల అరాచకాలు భూస్వామ్య క్రౌర్యాలెన్ని
ముసిరినా తలదించని ఎవరెస్టు

నవభారత నిర్మాణానికి సత్యాగ్రహమై విప్లవించావు
కమ్యూనిజమే అజేయమని అగ్నికణమై రగిలావు
ఎర్రజెండానే అంతిమ పతాకమని
సగర్వమై సాగావు

మహా నేత
విప్లవ యోధుడా! అరుణతార!!
మీ నిష్క్రమణ తీరని దుఃఖమైనా
మీ తాత్వికత ప్రాపంచిక దృక్పథం
రక్తప్రసారమై ప్రజ్వలిస్తున్నది

కార్మిక కర్షక తాడిత పీడిత హక్కులకు
ప్రజా చైతన్యపు బావుటై ఆదరించి
ఆచరించిన మార్గదర్శి
దారి చూపే మైలురాయే కాదు
తెగించి పోరాడే వారసత్వాన్ని నింపిన స్ఫూర్తి
సూర్యుడంత వెలుగు చంద్రుడంత వెన్నెల





– వనపట్ల సుబ్బయ్య

కాలం చెల్లిన 'జగన్ ఫార్మాట్'!

టెస్ట్ మ్యాచ్, వన్ డే మ్యాచ్, ట్వంటీ – ట్వంటీ మ్యాచ్ అంటూ క్రికెట్‌లో రకరకాల ఫార్మాట్లు ఉన్నట్టుగానే, రాజకీయాల్లో కూడా ఒక్కొక్క పార్టీ ఒక్కొక్క ఫార్మాట్‌తో ప్రజల ముందుకు వస్తుంటుంది.

కాంగ్రెస్ పార్టీలో అయితే, సోనియా... రాహుల్... ప్రియాంక.... నిత్య నామస్మరణ తప్పనిసరి. రోజుకోసారి అయినా ఆ పేర్లు స్మరించుకోకుండా కాంగ్రెస్ వాదులు రాజకీయాలలో మనలేరు. ఆ పార్టీ ఫార్మాట్ అది. బీజేపీలో ప్రధాని నరేంద్రమోదీ, అమిత్ షా కీర్తనలతో కూడిన బృందగానంతో నేతలు కథ నడిపిస్తుంటారు. తెలుగుదేశం పార్టీ 'సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు' అనే పునాది ట్యాగ్‌లైన్‌తో మొదలై; ఇప్పుడు ఎన్టీరామారావు స్మరణతో కార్యకర్తలకు పెద్దపీట అంటూ చంద్రబాబు, లోకేశ్ నేతృత్వంలో రాజకీయం సాగిస్తున్నది. ఇలా, ఎవరి ఫార్మాట్ వారిది.

ఇక, జగనే కర్త, కర్మ, క్రియగా సాగుతోంది వైసీపీ. ఈ పార్టీకి రాజకీయ సిద్ధాంతం ఏమీ ఉన్నట్టు కనపడదు. "తిట్టు.... కొట్టు... కనబడింది కనపడినట్టు బొక్కేయ్... తినేయ్... నొక్కగలిగినంత నొక్కేయ్... అడ్డం వస్తే లేపేయ్... కుమ్మేయ్... కుదరకపోతే లోపలేయించేయ్... ఇలాంటి బురద మొత్తం చంద్రబాబు నెత్తిమీద కుమ్మరించేయ్... లోకేశ్‌ను అపహాస్యం చేసేయ్" అనేది ఆ వైసీపీ రాజకీయ ఫార్మాటా అన్న అనుమానం కలగడం సహజం 2019–2024 మధ్య వారి రాజకీయ పోకళ్ళు చూస్తే. అప్పుడు వైసీపీ నిర్వాకం చూసిన జనానికి ఇంతకు మించిన ప్రపంచం దానికి ఉన్న భావన కలగలేదు.

కాకినాడలో అనంతబాబును, ఆయన రాజకీయ గురువు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని, గుడివాడ, ఏలూరు, బందరులో ముగ్గురు నానీలను, సత్తెనపల్లిలో అంబటి రాంబాబును, మాచర్లలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నెల్లూరులో కాకాణి గోవర్ధనరెడ్డిని, తిరుపతిలో చెవిరెడ్డి భాస్కరరెడ్డిని... వీళ్లందరికీ రాజగురువుతో సమానుడు, అత్యంత సౌమ్యంగా... వినయంగా మాట్లాడే విజయ సాయిరెడ్డిని చూసినా, ఇటువంటి వారు నియోజకవర్గానికి ఓ డజనుకు తక్కువ లేకుండా 'ప్రజా సేవ' చేస్తున్న వారి పనులను చూసినా... రాజకీయాలపై గానీ, రాజకీయ నాయకులపై గానీ గౌరవభావం కలగడం కష్టం. వీరందరూ ఉన్న వైసీపీ 'పొలిటికల్ ఫార్మాట్' ఇలా ఉంటుందని 2019 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్లకు తెలియదు. కలలో కూడా ఊహించలేదు.

రాష్ట్రంలో అసంఖ్యాక జనానికి అత్యంత ప్రీతిపాత్రుడైన వైఎస్ రాజశేఖరరెడ్డి అకాల మృత్యువుపాలు కావడంతో పాటు, సాక్షాత్తు ఆయన ఏకైక కుమారుడే ఈ వైసీపీకి అధినేత కావడంతో; వారి పట్ల ప్రజల సద్భావనలతో కూడిన అంచనాలు వైసీపీ పట్ల... శ్రీహరికోట ఇస్రోలో రాకెట్లు నింగిలోకి దూసుకుపోయినట్టు దూసుకుపోయాయి. రాజన్న తనయుడు తెలుగు ప్రజలకు 'సకల సద్గుణాభిరాముడు'లా కనిపించాడు. అసలు 2014 లోనే ఎందుకు ఆయనను గెలిపించుకోలేకపోయామా అని నాలిక్కరుచుకున్నారు. అందుకే 2014లో గెలిచిన చంద్రబాబు నాయుడు 2019 ఎన్నికలకు ముందు ఏమి చేసినా, ఏమి మాట్లాడినా తెలుగు ప్రజలకు ఘోరాపరాధంగా కనిపించింది.

2019 ఎన్నికలకు ముందు 'వైసీపీ ఫార్మాట్' ఏమిటో జనానికి తెలియకపోవడం కూడా చంద్రబాబుపై వ్యతిరేకత పెరగడానికి ఒక కారణం. అప్పుడే ఫ్రిజ్ లోంచి బయటకు తీసిన ఐస్‌క్రీమ్ లాగా ఫ్రెష్‌గా నిగనిగలాడుతూ జగన్ కనపడ్డారు. పచ్చని పైర్ల మీద వాలడానికి తరుముకు వచ్చే మిడతల దండు లాగా వస్తున్న వైసీపీని చంద్రబాబు తేలిగ్గా తీసుకోవడం కూడా ఒక కారణం. (ఇప్పుడూ అలాగే చూస్తున్నారన్న భావం ఉంది.) దానితో, 2019 ఎన్నికల తరువాత ఆంధ్రప్రదేశ్ అధికార పీఠంపై 'వైసీపీ ఫార్మాట్' పరివేష్టితమై; తన రంగు, రుచి, వాసనను ప్రజలకు రుచి చూపించడం మొదలుపెట్టింది. పొలం గట్ల కలుగుల్లో అచేతనంగా... తిండీ తిప్పలు లేక, ఎండిపోయి ఉన్న కప్పలు... ఒక భారీ వర్షానికి బెక బెక మంటూ వందలు, వేలుగా బయటకు వచ్చి జనాలను హడలెత్తించినట్టుగా... మొత్తం అరాచక, సంఘవ్యతిరేక శక్తులన్నీ ఒక్కటిగా రాష్ట్రం మీద, జనం మీద, ప్రకృతి వనరుల మీదా పడిపోయాయా? అన్న భావం ప్రజలకు కలిగేటట్టుగా వైసీపీలో అధికులు వ్యవహరించారు.

ఏ రాజకీయ పార్టీలో అయినా... ఎక్కడో, ఎవరో కొద్దిమంది చట్టాన్ని ఉల్లంఘించి, ఏదో కక్కుర్తిపడడం వేరు. కానీ, గ్రామస్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు వైసీపీ చక్రాంకితులైన వారిలో స్థానిక సంస్థల ప్రతినిధులా, శాసనసభ్యులా, మంత్రులా, ఎంపీలా అనే తేడా లేకుండా అధికులు సాగించిన, ఎక్కడ ఏది దొరికితే దానిని దోపిడీ చేసే తీరు చూసి, తెలుగు ప్రజలు భీతావహులైపోయారు. గత డెబ్బై ఏళ్ళలో ఈ తరహా రాజకీయాలను తెలుగు సమాజం కనీ, వినీ ఎరుగదు. వైసీపీలో అధికులు గుంటూరులో రౌడీ షీటర్‌గా ముద్రపడిన బోరుగడ్డ అనిల్‌కు ఒక బెత్తెడు అటూ ఇటూగా జనానికి తమ విశ్వరూపం చూపించారు.

దీంతో జింకను వేటాడే పులి వేచి ఉన్నట్టు పోలింగ్ తేదీ వరకు జనం ఓపిక పట్టి... ఈవీఎంలో బటన్ నొక్కవలసిన సమయం వచ్చినప్పుడు, బ్రహ్మకు సైతం ఉప్పు అందకుండా నొక్కేసి... నిశ్శబ్దంగా ఇళ్లకు వెళ్లిపోయారు.

వైసీపీ నేతలు – పై నుంచి కింది వరకు – చంద్రబాబు ప్రభుత్వం ఘోరాలు చేసేస్తున్నదంటూ పెడబొబ్బలు, శాపనార్థాలు, తిట్లు.... చూసేవారికి వారిపట్ల చీత్కార భావం కలిగేట్టుగా మాట్లాడడం చూస్తుంటే, 2019లో 151 సీట్లు ఇచ్చిన ప్రజలు 2024లో 11 సీట్లే ఎందుకు ఇచ్చారో ఆత్మావలోకనం చేసుకున్నట్టు కనపడదు. ఇక, ఆ 'మైండ్ సెట్'తో మరోసారి వైసీపీ అధికారంలోకి రాలేదు.

వైసీపీ హయాంలో స్థానిక సంస్థలకు 'ఎన్నికలు' నిర్వహించినట్టుగా పులివెందుల, ఒంటిమిట్టలో నిర్వహించుకోవడం కుదరలేదనే ఉక్రోషం వైసీపీ నేతల మాటల్లో, చేతల్లో వ్యక్తమైంది. హుందాతనం పూర్తిగా లోపించింది. వారి ప్రచార సాధనాల్లో, వారి ఆస్థాన విశ్లేషకాచార్యుల వ్యాఖ్యల్లో కూడా వైసీపీ మైండ్‌సెట్టే ప్రతిఫలించింది. దక్షిణ కొరియాపై, తన సరిహద్దు లౌడ్ స్పీకర్ల ద్వారా ఉత్తర కొరియా సాగించే దుష్ప్రచారం స్థాయిలో... కూటమి నేతలు, పోలీసులపై వైసీపీ గొంతులు దుమ్మెత్తిపోశాయి. పోలీసుల మీద చేయడానికి వీలున్న అన్ని ఆరోపణలూ చేశారు.

ప్రజా జీవితంలో కొనసాగాలని వైసీపీ భావిస్తున్నట్టయితే... అరాచకవాదులు, దౌర్జన్యకారులు, కబ్జాకోరులు, దోపిడీదారులు, హంతకులు, విధ్వంసకారులు, సంఘవ్యతిరేక శక్తులు అంటూ సమాజంలో ఉన్న బలమైన ముద్రను సంపూర్ణంగా తొలగించుకోవడానికి ఏమి చేయాలో... వైసీపీ అధినేత అది చేయాలి. ఆ పని చేయకుండా, తమ సర్వ అవలక్షణాలన్నింటినీ కూటమికి (అంటే చంద్రబాబు, లోకేశ్‌కు) ఆపాదిస్తూ దుమ్మెత్తి పోయడం, లేకి ప్రచార సాధనాలతో పోయించడం, పేటీఎం విశ్లేషకాచార్యులతో మాట్లాడించడం వంటి చర్యలు.... చెక్క గుర్రంపై కూర్చుని ఊగడం వంటివే. కూటమి ప్రభుత్వంపై జనంలో అసంతృప్తి ఎన్నికల నాటికి వ్యక్తమయ్యే పరిస్థితులు వస్తాయని వైసీపీ దింపుడు కళ్లెం ఆశలు పెట్టుకున్నప్పటికీ; ఇప్పటి మైండ్‌సెట్, ఇప్పటి ఫార్మాట్‌తో... ఆ పార్టీ వైపు ప్రజలు కన్నెత్తి చూడరు.

బలమైన కేసులు ఒక్కొక్క అడుగే ముందుకు జరుగుతూ జగన్ పరివారాన్ని మెల్లగా చుట్టుముడుతున్నాయి. వివేకా దారుణ హత్య ఘటనలో నిందితులకు ఉరిశిక్ష విధించే అవకాశం ఉన్నదని సీబీఐ న్యాయవాది సాక్షాత్తు సుప్రీంకోర్టులోనే అన్నారంటే... తాను, తన పరివారం ఏ స్థాయి నేరారోపణాల్లో ఇరుక్కుపోయి ఉన్నారో జగన్ గమనించాలి. లిక్కర్ కుంభకోణంలో అంతిమ లబ్ధిదారుడిగా అన్ని వేళ్లూ జగన్ వైపు చూస్తున్న వైనం ప్రజల్లోకి బలంగా వెళ్లిన విషయం కూడా వైసీపీయులు గమనించుకోవాలి.

'ప్రభుత్వం' పేరిట చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్ చేసే అవకతవకలు తమను 2019లో లాగా అధికారంలోకి తీసుకువస్తాయని పగటి కలలు కంటూ ఉంటే; వాటి అర్థం ఏమిటని ప్రవచనకారుల్ని అడిగితే... వారు బాగా విడమరచి చెబుతారు.

ఏ రాజకీయ పార్టీలో అయినా... ఎక్కడో, ఎవరో కొద్దిమంది చట్టాన్ని ఉల్లంఘించి, ఏదో కక్కుర్తిపడడం వేరు. కానీ, గ్రామస్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు వైసీపీ చక్రాంకితులైన వారిలో స్థానిక సంస్థల ప్రతినిధులా, శాసనసభ్యులా, మంత్రులా, ఎంపీలా అనే తేడా లేకుండా అధికులు సాగించిన, ఎక్కడ ఏది దొరికితే దానిని దోపిడీ చేసే తీరు చూసి, తెలుగు ప్రజలు భీతావహులైపోయారు. ఇప్పటి మైండ్‌సెట్, ఇప్పటి ఫార్మాట్‌తో... ఆ పార్టీ వైపు ప్రజలు కన్నెత్తి చూడరు.



• భోగాది వేంకటరాయుడు

ప్రజామేధావుల సంరక్షణ సమాజ బాధ్యత!

ప్రజాస్వామ్యం స్థిరంగా నిలవాలంటే అభిప్రాయ స్వేచ్ఛ తప్పనిసరి. ప్రశ్నించడం మేధావి ధర్మం. మేధావులపై దాడులు ప్రజాస్వామ్యానికి ప్రమాదం. మేధావులు రెండు విధాలు. మొదటి తరగతి సాంప్రదాయ మేధావులు తాము సమాజం నుంచి విడివడి ఉన్నట్లుగా భావిస్తారు. వీరు వీరికి తెలియకుండానే ఉన్న వర్గవ్యవస్థను బలపరచే పాత్ర వహిస్తారు. వీరికి భిన్నంగా ఆర్గానిక్ మేధావులు ఉంటారని ఆంటోనియో గ్రాంస్కీ అనే ఇటాలియన్ మార్క్సిస్టు మేధావి భావన. ఇలాంటి వారు వర్గచైతన్యాన్ని పెంచడానికి పనిచేస్తారు.

ప్రజామేధావి చైతన్యం పెంచే ప్రయత్నం చేస్తే అతనిపై దేశద్రోహి అనే ముద్ర వేస్తారు. చేయని నేరం మోపుతారు, వేటాడతారు. అవమానాల్ని, ఒత్తిడిని తట్టుకోవడం, సత్యం చెప్పడంలో వెనుకడుగు వేయకపోవడం, గెలుపు ఆలస్యం అయినా దారి మళ్లకుండా ఉండటం వంటి లక్షణాలు కలిగి, ఒకవైపు మేధస్సు, మరోవైపు నిబద్ధతతో ప్రజామేధావి నిరంతర పోరాటం చేస్తూ ఉండాలి.



గ్రాంస్కీ సిద్ధాంతంలో మరో ప్రధాన భావన సాంస్కృతిక ఆధిపత్యం. దీనర్థం పాలకవర్గాల భావాలు బలప్రయోగం ద్వారా కాక, ఎక్కువగా ప్రజల అంగీకారాన్ని పొందడం ద్వారా పనిచేస్తాయి. పాలకవర్గాలు తమ విలువలు, ఆచారాలు, ఆలోచనా విధానాలను సామాన్య ప్రజలలో చొప్పించేందుకు ప్రయత్నిస్తాయి. ప్రజలు ఈ విలువలను స్వీకరించి, వాటిని స్వచ్ఛందంగా నమ్ముతారు. వాళ్లను బలవంతం చేయాల్సిన అవసరం ఉండదు. సినిమాలు, పాఠశాలలు, మతం, మీడియా వంటివన్నీ పాలకవర్గాల భావజాలాన్ని విస్తరించే పనిలో ఉంటాయి.

వీరికి భిన్నంగా ఆర్గానిక్ మేధావులు ప్రజల అభ్యుదయానికి పనిచేస్తూ, ఆధిపత్యాన్ని ప్రశ్నించి, ప్రజల చైతన్యాన్ని పెంచుతారు. ప్రస్తుత కాలంలో సామాజిక మాధ్యమాలు, విద్యా వ్యవస్థ వంటివి ఉపయోగించి ఆధిపత్య వర్గాలు ప్రజల మనోభావాలను మలుస్తున్నారు. దీనిని అర్థం చేసుకొని, ప్రజలకు నిజమైన చైతన్యం కలిగించడమే ఆర్గానిక్ మేధావుల ప్రధాన పని. సాంస్కృతిక ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా ప్రజా సంస్కృతి ఎలా అభివృద్ధి చెందాలీ అన్నదే సమాజాభివృద్ధికి ప్రధానం. ప్రజా సంస్కృతి ప్రజల అనుభవాల కేంద్రంగా రూపొందుతుంది. ప్రజల దైనందిన జీవితం, వారి కష్టసుఖాలు, ఆశయాలు, ఆలోచనల వంటివన్నీ ప్రజా సంస్కృతిలో ప్రతిఫలిస్తాయి. ఆధిపత్య వర్గాల ఒప్పించబడిన భావజాలం కాకుండా, ప్రజల స్వతంత్ర అవగాహన మీద ఆధారపడి ఇది ఉంటుంది. రైతు కవితలు, కార్మికుల గేయాల వంటివి ప్రజా సంస్కృతి రూపాలే. స్థానిక భాషలు, కళలు, సాంప్రదాయాలు ఈ సంస్కృతిలో భాగంగా ఉంటాయి.

ఆధిపత్య వర్గాలు "సాంస్కృతిక ఏకీకరణ" జరిపి తమ విలువలను ప్రజలపై ప్రబలంగా ముద్రించడానికి ప్రయత్నిస్తాయి. నేడు మోదీ ప్రభుత్వం ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే జాతి వంటి నినాదాలివ్వడం ఇందులో భాగమే. దీనికి భిన్నంగా ప్రజా సంస్కృతి మాత్రం స్థానికత, వైవిధ్యత, భిన్నత్వాలను కాపాడుతుంది. ఆధిపత్య వర్గాలు చరిత్రను వక్రీకరిస్తాయి లేదా మరచిపోయేలా చేస్తాయి. నేడు పాఠ్యాంశాలలో చరిత్ర అంశాలను తొలగించడం ఇందులో భాగమే. ప్రజా సంస్కృతి ప్రజల అసలు చరిత్రను సజీవంగా ఉంచుతుంది. తమ గతాన్ని గుర్తించి, భవిష్యత్తును నిర్మించుకోవడంలో ప్రజలకు మార్గదర్శకత్వం చేస్తుంది.

సమాజ పరిణామాలను శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించిన వర్గ సిద్ధాంత రూపకర్త కార్ల్ మార్క్స్, వలసబాధిత దేశాల ప్రజలకు మేధో మార్గదర్శనం ఇచ్చిన ఫ్రెంచ్ మేధావి ఫ్రాంట్జ్ ఫానన్, కార్మిక వర్గానికి ప్రజా మేధావిగా మారిన గ్రాంస్కీ, భారతదేశ స్వాతంత్ర్యానికై మేధస్సును త్యాగం చేసిన మహాత్మాగాంధీ, అణగారిన ప్రజల విముక్తికై పోరాడిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహిళా విద్యకై విశేష కృషి చేసిన సావిత్రి బాయి పూలే, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి వారంతా ప్రజల గుండె చప్పుడు విన్న మేధావులు.

సమాజానికి ప్రజా మేధావులు కావాలి. అయితే నేటి సమాజంలో అలాంటి వారు మనుగడ సాగించడం అత్యంత కష్టతరం. ఎందుకంటే సాంస్కృతిక ఆధిపత్యం బలమైనది. అధికార వర్గాలు ప్రజల మనస్సుల్లో తమ భావజాలాన్ని గాఢంగా నాటుతాయి. ప్రజలు తమ దోపిడీని, కష్టాలను కూడా సహజంగానే భావించే స్థితిలో ఉంటారు. ప్రజలలో మార్పు సాధించాలంటే, మేధావి ఈ గాఢమైన 'సహజ జ్ఞానా'న్ని మార్చగలగాలి. "బానిస తన గొలుసును ఆభరణంగా భావించినప్పుడు విముక్తి కష్టం." పేద ప్రజలు ఆకలి, అనిశ్చితి, భయం వంటి దయనీయ పరిస్థితుల్లో ఉన్నపుడు వారిలో చైతన్యాన్ని సృష్టించడం సులభం కాదు. పాలక వర్గాలు మతం, జాతి, భాష, ప్రాంత భేదాల ఆధారంగా ప్రజలను చీల్చి, దారి మళ్లిస్తాయి. మేధావి ప్రజలను ఒకతాటిపై తీసుకురావాలంటే, ఈ విభజనల చీకటి మబ్బుల్ని తొలగించాలి.

ప్రజామేధావి చైతన్యం పెంచే ప్రయత్నం చేస్తే అతనిపై దేశద్రోహి అనే ముద్ర వేస్తారు. చేయని నేరం మోపుతారు, వేటాడతారు. అవమానాల్ని, ఒత్తిడిని తట్టుకోవడం, సత్యం చెప్పడంలో వెనుకడుగు వేయకపోవడం, గెలుపు ఆలస్యం అయినా దారి మళ్లకుండా ఉండటం వంటి లక్షణాలు కలిగి, ఒకవైపు మేధస్సు, మరోవైపు నిబద్ధతతో ప్రజామేధావి నిరంతర పోరాటం చేస్తూ ఉండాలి.

మోదీ ప్రభుత్వం ఒక పథకం ప్రకారమే ప్రజా మేధావి వర్గాన్ని, ప్రశ్నించే వారిని లక్ష్యంగా ఎంచుకుంది. గౌరీలంకేశ్, ప్రబీర్ పురకాయస్త, ప్రొఫెసర్ సాయిబాబా, ప్రొఫెసర్ అలీ ఖాన్, సుధా భారద్వాజ్, స్టాన్ స్వామి వంటి అనేకమందిపై హత్యాయత్నాలు, హత్యలు, అక్రమ అరెస్టులు జరిగాయి. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాటం చేసే పత్రికలూ నాయకులపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. మనుషుల్ని చంపగలరేమో గానీ, వారిచ్చిన జ్ఞానాన్ని చంపలేరు కదా!

ప్రజామేధావులు లేని ఏ సమాజమైనా సృజనాత్మకంగా ముందుకుపోవడంలో విఫలమవుతుంది. ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక వ్యవస్థల్లో అస్తవ్యస్థలు, వివక్షలు, పరిష్కారాలు లేకపోవడం వంటి అనేక నష్టాలను సమాజం ఎదుర్కొంటుంది. "తుఫానొస్తే కొండ మీద చెట్లు కదులుతాయి కానీ, కొండ కదలదు కదా!" అన్నారు రావి శాస్త్రి. అలాగే మన ప్రజాస్వామ్య వ్యవస్థ కూడా అనేక ఆటుపోట్లను ఎదుర్కొని స్థిరంగా, బలంగా నిలబడింది. అందులో ప్రజామేధావుల పాత్రను మరువలేం. అందుకే నేటి క్లిష్ట పరిస్థితుల్లో ఈ తరహా మేధావులను ప్రోత్సహించడం పౌర సమాజం బాధ్యత.

◆ ఎ. అజశర్మ
ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

కొత్త పొద్దులో తపాలాభారతి!

ఘన చరిత్ర కలిగిన తపాలా శాఖ ఎట్టకేలకు నిద్రావస్థను వీడి ప్రైవేట్ కొరియర్ సంస్థలతో పోటీకి దీటుగా డిజిటలైజేషన్ వైపు అడుగులు వేస్తోంది. దశలవారీగా దేశమంతటా పోస్టాఫీసుల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ ప్రక్రియ చేపట్టారు. నగదు రహిత ఆన్‌లైన్ చెల్లింపులకు మార్గం సుగమమైంది. మరోపక్క లాభసాటి కాదనుకుంటున్న రిజిస్టర్డ్ పోస్టు విత్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్ సర్వీసు ఈ నెలాఖరు నుంచి రద్దు చేస్తున్నారు. గతంలో రద్దు చేసిన రిజిస్టర్డ్ బుక్‌పోస్ట్ స్థానంలో ఈ ఏడాది మే 1 నుంచి జ్ఞాన్ పోస్ట్ సర్వీసును ప్రవేశపెట్టారు. వ్యాపార విస్తరణలో భాగంగా ఇ–కామర్స్ తరహాలో ఆదివారాలు, సెలవు రోజుల్లోనూ బట్వాడాకు పథకాలు రచిస్తున్నారు. లాభాలే లక్ష్యం చేసుకోకుండా, సామాన్యుడిపై భారం మోపకుండా సేవల నాణ్యతను పెంచడం ఇప్పుడు తపాలాశాఖ ముందున్న సవాలు.

భారతదేశ తపాలా శాఖకు సుదీర్ఘ చరిత్ర ఉంది. బ్రిటిష్ ఇండియా గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్ 1774 మార్చిలో, ఈస్టిండియా కంపెనీ వాణిజ్య ప్రయోజనాల పరిరక్షణ కోసం మొదటిసారి తపాలా సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. లార్డ్ డల్‌హౌసి 1850లో ఏర్పాటు చేసిన పోస్టాఫీస్ కమిషన్ సిఫారసుల మేరకు 1854లో పోస్టాఫీస్ చట్టాన్ని తెచ్చారు. బెంగాల్ ప్రధాన కేంద్రంగా 700 పోస్టాఫీసులు హోంమంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో పనిచేసేవి. సంస్థాన ప్రాంతాలు సహా దేశమంతటా ఒకే టారిఫ్, పోస్టల్ స్టాంపులతో ఏకీకృత సేవలకు ఈ చట్టం వీలు కల్పించి ఆధునిక తపాలా వ్యవస్థకు పునాది వేసింది. నాటి నుంచి అంచెలంచెలుగా విస్తరిస్తూ దేశ సామాజిక, ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోంది. తపాల సేవలకే పరిమితం కాకుండా, స్మాల్ సేవింగ్స్ డిపాజిట్లు, లైఫ్ ఇన్సూరెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకూ తపాలా శాఖ ద్వారా సేవలు అందుతున్నాయి.

మారిన అవసరాలు, టెక్నాలజీని దృష్టిలో పెట్టుకుని 2023లో ఇండియన్ పోస్టాఫీస్ చట్టాన్ని కొత్తగా తెచ్చారు. 2024 జూన్ 18 నుంచి అమలులోకి వచ్చిన ఈ చట్టం ద్వారా డిజిటల్ ఎలక్ట్రానిక్ సాంకేతికతకు అనుగుణంగా ప్రభుత్వ ఆమోదంతో తగిన నిర్ణయాలు తీసుకోవడానికి పోస్టల్ డైరెక్టర్ జనరల్‌కు అధికారాలు కట్టబెట్టింది. పాత చట్టంలో ప్రతి నిర్ణయానికీ పార్లమెంటరీ ఆమోదం పొందాల్సి వచ్చేది.

సిబ్బంది జవాబుదారీకి సంబంధించి కొత్త చట్టంలో వెసులుబాటు కల్పించడంపై ఆక్షేపణలు వచ్చాయి. తపాలా ద్వారా పంపే వస్తువుల నష్టం, ఆలస్యం, సరైన చిరునామాదారుకు చేర్చకపోవడం వంటి పొరపాట్లకు సిబ్బందిని జవాబుదారీతనం నుంచి తప్పించారు. దురుద్దేశపూర్వకంగా తప్పు చేసే వారికి మాత్రం ఇది వర్తించదు. లయబిలిటీ క్లాజును తొలగించడం సిబ్బందిలో ఉపేక్షకు, నిర్లక్ష్యానికి దారితీయవచ్చనే విమర్శలు వచ్చాయి. సర్వీసుల నాణ్యతపై కూడా ప్రతికూల ప్రభావం పడవచ్చు.

డిజిటల్ చెల్లింపులకు ఇంతకాలానికి పోస్టాఫీసుల్లో వెసులుబాటు కలిగింది. అయితే కొత్త టెక్నాలజీకి పూర్తిగా సిబ్బంది సన్నద్ధం కాకపోవడం, అన్ని పోస్టాఫీసుల్లో అప్‌డేషన్ పూర్తి కాకపోవడంతో సర్వీసులు నత్తనడకన సాగుతున్నాయి.



మరో పక్క యాభై ఏళ్లుగా అందుబాటులో ఉన్న రిజిస్టర్డ్ పోస్ట్ విత్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్ సర్వీసును 2025 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ఉపసంహరించుకుంటున్నారు. ఈ సర్వీసును స్పీడ్ పోస్ట్‌లో విలీనం చేస్తున్నట్లు తపాలాశాఖ ప్రకటించింది. ప్రైవేట్ కొరియర్ సంస్థ పోటీ కారణంగా రిజిస్టర్డ్ పోస్టుల సంఖ్య 25 శాతం తగ్గింది. దీనికి తోడు డిజిటల్ ఎడాప్షన్‌లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారట.

ఇప్పటివరకూ లీగల్ నోటీసులను, ఉద్యోగ నియామక పత్రాల వంటి డాక్యుమెంట్లను రిజిస్టర్డ్ పోస్టు ద్వారానే పంపేవారు. ఈ సర్వీసు ద్వారా పొందే ఎక్‌నాలెడ్జిమెంట్‌కు చట్టబద్ధత ఉంది. కోర్టులు కూడా నోటీసు అందినదనడానికి దీన్ని రుజువుగా పరిగణించేవి. స్పీడ్ పోస్ట్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్‌కు ఈ విధమైన చట్టబద్ధత ఉంటుందా అనేది తేలాల్సి ఉంది. స్పీడ్ పోస్ట్ టారిఫ్, దూరాన్ని బట్టి మారుతుంది. కనుక కష్టమర్లపై అదనపు భారం పడుతుంది.


గతంలో రద్దు చేసిన రిజిస్టర్డ్ ప్రింటెడ్ బుక్ పోస్ట్ స్థానే 2025 మే 1వ తేదీ నుంచి జ్ఞాన్ పోస్ట్ పేరుతో కొత్త పోస్టల్ సర్వీసును అందుబాటులోకి తెచ్చారు. అయితే జ్ఞాన్ పోస్ట్‌కు తగినంత ప్రచారం కల్పించకుండా గుట్టుగా ఉంచడంతో రచయితలు, పబ్లిషర్ల వినియోగానికి పూర్తిగా రాలేదు. యూనివర్శిటీలు, గుర్తింపు పొందిన బోర్డుల స్టడీ మెటీరియల్‌ను పోటీ పరీక్షలు రాసేవారు చదివే పాఠ్యపుస్తకాలను జ్ఞాన్ పోస్ట్ ద్వారా పంపవచ్చు. సామాజిక, సాంస్కృతిక, మత అంశాలతో ప్రచురించిన పుస్తకాలను ఈ జ్ఞాన్ పోస్ట్ ద్వారా చేరవేయవచ్చు. 300 గ్రాముల వరకు రూ.20తో మొదలయ్యే టారిఫ్ 5 కిలోలకు గరిష్ఠంగా రూ.100 వసూలు చేస్తారు. జీఎస్టీ అదనం. పీరియాడికల్స్‌ను మాత్రం అనుమతించరు.

రచయితలు, ప్రచురణకర్తలకు కాస్తంత ఊరట కలిగించే జ్ఞాన్ పోస్ట్ సర్వీసులకు పలుచోట్ల తపాలా సిబ్బంది మోకాలడ్డుతున్నారు. ఒక పుస్తకం మాత్రమే పంపాలనీ, నాలుగు వైపులా బుక్ పాకెట్ తెరచి ఉంచాలనీ, ఇలా ఎవరికి తోచిన రూల్స్ వారు చెప్తూ వేధిస్తున్నారు. ఐదు కిలోల వరకు పంపే వెసులుబాటును నీరుగారుస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దాలి.

యాభై ఏళ్లుగా ఉన్న రిజిస్టర్డ్ పోస్ట్ విత్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్ సర్వీసును సెప్టెంబర్ 1 నుంచి ఉపసంహరించుకుంటున్నారు. అంతగా వినియోగంలో లేని మనియార్డర్, పోస్ట్‌కార్డ్, ఇన్‌ల్యాండ్ లెటర్ మునుముందు రోజుల్లో కనుమరుగుకావచ్చు.

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఇ–కామర్స్ సంస్థలతో పోటీ పడేందుకు తపాలాశాఖ సన్నద్ధమవుతోంది. ఇప్పుడు ఒక షిఫ్ట్‌లోనే పోస్ట్‌మెన్ బట్వాడా విధులు నిర్వర్తిస్తున్నారు. దీన్ని మూడు షిఫ్ట్‌లకు పెంచి, ఆదివారాలు, సెలవు రోజుల్లో కూడా బట్వాడా చేసి ఆదాయం పెంచుకోవాలని తపాలాశాఖ యోచిస్తోంది. దీంతో పాటు ఇతర ఆదాయం పెంపు మార్గాలపైనా తపాలా శాఖ దృష్టి పెట్టనుంది. లాభసాటిగా లేని గ్రామీణ పోస్టాఫీసులను మూసివేయడమో, సమీప పోస్టాఫీసుల్లో విలీనం చేయడమో జరగవచ్చు. అంతగా వినియోగంలో లేని మనియార్డర్, పోస్ట్‌కార్డ్, ఇన్‌ల్యాండ్ లెటర్ మునుముందు రోజుల్లో కనుమరుగు కావచ్చు. శాశ్వత ప్రాతిపదికన సిబ్బంది నియామకాలను చేపట్టి, భవనాల వంటి మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించినప్పుడే తపాలా శాఖ ఆశించిన లక్ష్యాలు సాధించగలదు.

■ గోవిందరాజు చక్రధర్



3

దళారే.. ధర నిర్ణేత!

- నిమ్మ మార్కెట్‌లో రైతుకు గిట్టుబాటు ప్రశ్నార్థకం
- ప్రత్యామ్నాయం చూసుకుంటున్న కర్షకులు
- తగ్గిపోతున్న నిమ్మ సాగు విస్తీర్ణం



6

సాగర్ జలాశయానికి కొనసాగుతున్న వరద

ఇచ్చేదే కొసరు.. ఆపై కోతలా?

అసలే చేతికి వచ్చే జీతం తక్కువ.. ఆపై జీతాలకు ముఖ హాజరుతో కోతలు పడతాయని అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నో సంవత్సరాలుగా క్రమబద్ధీకరణపై ఆశతో తక్కువ వేతనాలు అయినా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు ఆ జీతాలకూ కోత పడేలా ఉన్నతాధికారులు తీసుకుంటున్న నిర్ణయాలపై అధ్యాపకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎఫ్‌ఆర్‌ఎస్ పేరుతో ఇప్పటికే అధికారులు వేధిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అసంబద్ధ పని గంటలు, క్రమబద్ధీకరణ పెండింగ్‌పై ఆందోళనలో ఉన్న వారిని మరింత ఆవేదనకు గురి చేసేలా జీతాలకు ముఖ హాజరును ముడిపెడుతుండటంపై లెక్చరర్లు మండిపడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనట్లుగా పలు నిబంధనలు అమలు చేసి ఉద్యోగులను ప్రభుత్వానికి దూరం చేసేందుకు ఉన్నత విద్యాశాఖలోని కొందరు ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

జీతాలకు ముఖ హాజరు లింకుపై ఆగ్రహం

- జూనియర్ కళాశాల అధ్యాపకుల ఆందోళన
- అసంబద్ధ నిర్ణయాలపై ఇప్పటికే అసంతృప్తి





గుంటూరు సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి ముఖ హాజరు (ఎఫ్‌ఆర్‌ఎస్ - ఫేషియల్ రికగ్నిజేషన్ సిస్టం) ఆధారంగా జీతాలన్నట్లు వచ్చిన సమాచారంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 35 జూనియర్ కళాశాలలు ఉండగా 230 మంది కాంట్రాక్టు లెక్చరర్లు, ఎక్కువ సంఖ్యలో బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. గతంలో కళాశాలలు పని వేళలు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండేవి. ఇప్పుడు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని వేళలు పెంచారు. అయితే రవాణా సౌకర్యాలు లేక దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఎప్పటి మాదిరిగానే ఉదయం 10 గంటలకు కళాశాలకు వస్తున్నట్లు తెలుస్తుంది. అయినా అధ్యాపకులు 9 గంటల నుంచి పడిగాపులు కాయాల్సి వస్తోంది. అసంబద్ధంగా పని గంటలు ఎలా పెంచుతారని అధికారులపై ఇప్పటికే లెక్చరర్లు మంత్రులకు ఫిర్యాదు చేశారు. ఆ విషయం ఎటూ తేలక ముందే జీతాలకు ముఖ హాజరు లింకుపెట్టడంపై ఆగ్రహం వెల్లువెత్తుతోంది.

ఐదు నిమిషాలు ఆలస్యమైనా..

ఎఫ్‌ఆర్‌ఎస్ అమలుతోనే గత జగన్ ప్రభుత్వంపై ఉద్యోగుల్లో వ్యతిరేకత నెలకొంది. ప్రభుత్వం మారిన తర్వాత కొంత మార్పులు వస్తాయని ఉద్యోగులు ఆశించారు. అయితే ఇందుకు విరుద్ధంగా (మిగతా 4వ పేజీలో)

● లక్ష గాజులతో అమ్మవారు



గుంటూరు అరండల్‌పేట శ్రీ అష్టలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో 30వ కోటి కుంకుమార్చనలు వైభవంగా జరిగాయి. శనివారం ఉదయం శేషాభిషేకార్చన, లక్ష గాజులతో అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. అనంతరం శాంతిహోమం మహా పూర్ణాహుతి నక్షత్ర హారతి , మంత్రపుష్పం కళాశాలలో జలాన్ని భక్తులకు సంప్రోక్షణ నిర్వహించారు.

ఎరువులు ఉన్నా.. విక్రయాలు లేవు

- ఈ-పోస్‌లో మారని సిబ్బంది వేలిముద్రలు
- జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో నిలిచిన విక్రయాలు

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

ఎరువులు అందవేమోనని ఆందోళనలో ఉన్న రైతులకు అధికారుల నిర్లక్ష్యం శాపంగా మారింది. రైతు సేవా కేంద్రాల్లో ఎరువుల నిల్వలు ఉన్నా విక్రయాలు నిలిచిపోయాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో వందలాది మంది వ్యవసాయ, ఉద్యాన అస్టెంట్లను ఇటీవల ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెలిసిందే. సిబ్బందిని బదిలీ చేసినా వారికి అధికారాలు బదిలీ చేయకపోవడంతో రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అందాల్సిన సేవలు నిలిచిపోయాయి. బదిలీపై వచ్చిన ఉద్యోగుల వేలి ముద్రలు ఈ-పోస్‌లలో అప్‌లోడ్ చేయడాన్ని వ్యవసాయ, ఉద్యాన శాఖలు మరిచాయి. దీంతో రైతు సేవా కేంద్రాలకు ప్రభుత్వం ఎరువులు సరఫరా చేసినా రైతులకు విక్రయించలేని దుస్థితి నెలకొంది. బదిలీలు జరిగి నెల రోజులు దాటినా



సదరు ఉద్యోగుల లాగిన్ ఐడీలు మార్చకపోవడంతో రైతు సేవా కేంద్రాల్లో ఎరువుల విక్రయాలు నిలిచిపోయాయి. దీంతో ఎరువుల కోసం రైతులు ఆర్‌ఎస్కేలకు వచ్చి నిరాశతో వెనుతిరిగి వెళ్తున్నారు. పల్నాడు జిల్లాలోని కేంద్రాలకు 5,300 టన్నుల ఎరువులను సరఫరా చేశారు. ఇదే స్థాయిలో బాపట్ల, గుంటూరు జిల్లాల్లో కూడా ఆర్‌ఎస్కేలకు ఎరువులను సరఫరా చేశారు. అయితే సాంకేతిక సమస్యల వల్ల రైతులకు ఎరువులు అందడంలేదు. వర్షాలు, కాల్వలకు నీటి విడుదలతో పంటల సాగు ఊపందుకుంది. ఎరువులు తక్షణావసరంగా ఉంది. ఈ పరిస్థితుల్లో ఎరువులు అందుబాటులో లేక రైతులు ఇక్కట్లు పడుతున్నారు. ఆర్‌ఎస్కేలలో ఎరువులు విక్రయాలు ప్రారంభించకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు ఎరువులను బ్లాక్ చేసి అధిక ధరకు విక్రయిస్తూ రైతులను దోచుకుంటున్నారు. అధికారుల అవగాహనా రాహిత్యం, నిర్లక్ష్యం కారణంగా తాము ఇబ్బందులు పడాల్సి వచ్చిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉద్యాన, వ్యవసాయ అసిస్టెంట్ల వేలిముద్రలను ఈ-పోస్‌లో అప్‌లోడ్ చేసి, లాగిన్ వసతిని కల్పించి ఎరువుల విక్రయాలు సాఫీగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైళ్లకు క్విక్ వాటరింగ్ ఎప్పుడు?



- 200 - 250 కిలోమీటర్లకు ఒక వాటరింగ్ స్టేషన్ ఉండాల్సిందే
- గుంటూరు-సికింద్రాబాద్, తిరుపతి-గుంటూరు సెక్షన్లలో ఏవని కాగ్ ప్రశ్న

అప్పుల భారం.. సర్పంచ్, ఉప సర్పంచ్ ఆత్మహత్య

- చిన్నలింగాయపాలెంలో విషాద ఛాయలు

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్త హత్య

- నమ్మకంగా తీసుకువెళ్లి చంపిన ప్రియుడు

సీనియార్టీ జాబితా తయారు చేయాలి

- మునిసిపల్ ఆర్డీకి సచివాలయ ఉద్యోగుల విజ్ఞప్తి 6

కూతురితో వచ్చి.. కృష్ణానదిలో దూకి తల్లి ఆత్మహత్య 4

చంద్రబాబుతోనే సంక్షేమం సాధ్యం

- ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ అభివృద్ధి
- లాంలో సూపర్‌హిట్ సభలో డాక్టర్ పెమ్మసాని

తాడికొండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం అభివృద్ధి జరగాలన్నా.. ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలన్నా.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితోనే సాధ్యమవు తాయని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. సూపర్ సిక్స్ హామీల్లో స్త్రీశక్తి పథకం సూపర్‌హిట్ అయిన సందర్భంగా లాం, తాడికొండలో శనివారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. తొలుత ఉచిత బస్సు పథకంపై లాం గ్రామంలో మహిళలతో పెమ్మసాని మాట్లాడారు. ఆ తర్వాత ఆర్టీసీ బస్సులో మహిళలతో కలిసి లాం నుంచి తాడికొండ వరకు వచ్చారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడైనా అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకం ఏర్పడిందంటే అది టీడీపీ ప్రభుత్వంలో వేసినదేనని గర్వంగా చెప్పవచ్చన్నారు. రాష్ట్రం ఎంత అప్పుల భారంలో ఉన్నా రూ.పది వేల కోట్లతో తల్లికి వందనం, ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు, నెలకు రూ.4000 చొప్పున రూ.35 వేల కోట్లతో పెన్షన్లు, అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు రూ.60 వేల కోట్లకు పైగా సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అమరావతిలో రూ.50 వేల కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఒక కుటుంబానికి రూ.3 వేలు లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ నీలాల కృష్ణారావు, బీజేపీ, జనసేన నియోజకవర్గ సమన్వయకర్తలు కంతేటి బ్రహ్మయ్య, బేతపూడి విజయ్‌శేఖర్, టీడీపీ మండల అధ్యక్షులు తలశిల ప్రసన్నకుమార్, ధనేకుల సుబ్బారావు, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు, మాజీ ఎంపీపీ షేక్ రిజ్వాన, టీడీపీ, జనసేన నాయకులు ఎడ్డూరి హనుమంతరావు, జ్యోతి, అంగన్‌వాడీల సంఘ జిల్లా అధ్యక్షురాలు జానీబేగం, రాష్ట్ర కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు, బీసీ మేదర సాధికార సమితి కన్వీనర్ ఏసుబాబు, మాజీ సర్పంచ్ నూతక్కి నవీన్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మదుసూధనరావు, నూతలపాటి రామారావు, తదితరులు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్



మొక్కలు నాటుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

ఐదు లక్షల మొక్కలు నాటి సంరక్షణ

మిషన్ గ్రీన్ గుంటూరు లక్ష్యమన్న కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో దశల వారీగా ఐదు లక్షల మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షిస్తామని ఇదే మిషన్‌గ్రీన్ గుంటూరు లక్ష్యమని నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక కావటి శంకర్రావు ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటి విద్యార్థులతో కలిసి మానవ హారం, స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాటాడుతూ విద్యార్థులు తమ ఇళ్లల్లో నాటడానికి ఏ మొక్కలు కావాలో ప్రధానోపాధ్యాయులకు చెప్తే వాటిని అందిస్తామన్నారు. పాఠశాలల్లో నాటిన మొక్కలను విద్యార్థులు దత్తత తీసుకుని సంరక్షించాలన్నారు. మొక్కలు పెరిగితే పచ్చదనంతో పాటు పర్యావరణం ఆరోగ్యకరంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వేముల జ్యోతిపద్మజ, ఏడీహెచ్ శాంతి, హెచ్‌ఎం సీతారాములు, పీఎంసీ చైర్మన్ ముసలయ్య, మానవత సంస్థ సెక్రటరి సతీష్, ప్రెసిడెంట్ శ్రీనివాస్, కన్వీనర్ సాంబశివరావు,ట్రెజరర్ సాయిరామ్ పాల్గొన్నారు.



● ఇటీవల వర్షాలకు నందివెలుగు రోడ్డు ఇలా..


వర్షాలతో.. రోడ్లు ఛిద్రం

- ప్రాణ సంకటంగా రహదారులు
- మరమ్మతులు చేయాలంటోన్న వాహనదారులు

గుంటూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు నగరంలోని ప్రధాన రహదారులు ఛిద్రమయ్యాయి. జోరువానలతో అంతంత మాత్రంగా ఉన్న రోడ్లు గోతుల మయంగా మారాయి. ప్రధాన రోడ్లు కూడా మోకాలిలోతు గుంతలతో మొనతేలిన రాళ్లతో ప్రమాదకరంగా మారాయి. అధ్వానంగా మారిన రోడ్లు ద్విచక్ర వాహనదారుల పాలిట ప్రాణసంకటంగా మారాయి. జీటీ రోడ్డు, బ్రాడీపేట, అరండల్‌పేట, లాలాపేట, బృందావన్‌గార్డెన్స్, కొరిటెపాడు, పలకలూరురోడ్డు, నల్లచెరువు రోడ్డు, నందివెలుగు రోడ్లు గుంతలతో దర్శనమిస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాల బారిన పడటం ఖాయంగా రోడ్లు దర్శనిమస్తున్నాయి. ఇక రాత్రి సమయాల్లో అయితే ప్రమాదాలతో పలువురు గాయపడుతు న్నారు. రోడ్లపై గుంతలను పూడ్చేలా కనీస మరమ్మతులు అయినా చేయాలని నగరవాసులు కోరుతున్నారు.



● అధ్వానంగా పలకలూరు రహదారి



ముస్తాబవుతున్న త్రిముఖ గణనాథుడు

ముస్తాబవుతోన్న.. మట్టి గణపతి

- గుంటూరులో 99 అడుగుల ఎత్తులో నిర్మాణం
- 21 రోజుల పాటు పూజలు, హోమాలకు ఏర్పాట్లు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మట్టి గణపతే మహా గణపతిగా భక్తులకు దర్శనమిచ్చేం దుకు ముస్తాబవుతున్నాడు. హైదరా బాద్‌లో ఖైరతాబాద్ మాదిరిగానే గుంటూరులో 99 అడుగుల భారీ గణపతి కొలువుదీరాడు. వినాయక చవితిని పురస్కరించుకుని గుంటూరు, ఇన్నర్‌రింగు రోడ్డులో అమరావతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ మట్టి గణపతిని సిద్ధం చేస్తున్నారు. గంగా, కృష్ణా నదుల్లోని నల్లమట్టి, ఎర్రమటితో పాటు హాని కలిగించని రంగులతో త్రిముఖ రూపంలో విగ్రహాన్ని రూపొందిస్తున్నారు. నెల రోజుల క్రితం విగ్రహ నిర్మాణ పనులను ప్రారంభించారు. కలకత్తా నుంచి వచ్చిన నిపుణుల నేతృత్వంలో భారీ మట్టి గణపతిని రూపొందిస్తున్నారు. బుధవారం చవితి సందర్భంగా హోమాలు, పూజలు నిర్వహించి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. శ్రీకాణిపాక వరసిద్ధి వినాయక దేవస్థానంలో మాదిరిగా ఇక్కడ పూజా కార్యక్రమాలు, హోమాలు చేసేందుకు యాగశాలను సిద్ధం చేస్తున్నారు. 21 రోజులు పాటు స్వామివారికి పూజలు, హోమాలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. విగ్రహ ప్రారంభోత్సవంలో పాల్గొనాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌తో పాటు జిల్లా ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ నరేంద్రరెడ్డి తెలిపారు.

నాగార్జున కొండలో పర్యాటకుల సందడి



నాగార్జున కొండను సందర్శించిన పర్యాటకులు

విజయపురిసౌత్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జున కొండలో శనివారం పర్యాటకులు సందడి చేశారు. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగసిరి, శాంతిసిరి, అగస్త్య లాంచీలలో వీరు నాగార్జున కొండకు చేరుకున్నారు. కొండపై గల మ్యూజియం, అనుపులోని మహాస్థూపం, అశ్వమేధ యజ్ఞశాల, బోధి వృక్షం, యాంపి థియేటర్ శ్రీరంగనాథస్వామి ఆలయం తిలకించారు. ఎత్తిపోతల జలపాతాన్ని వీక్షించారు. లాంచీల ద్వారా పర్యాటక శాఖకు రూ. 45 వేల ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

OFFICE OF THE SUPERINTENDENT
GOVERNMENT GENERAL HOSPITAL GUNTUR

Rc.No.01/S1/Tenders-2025 Dated:23.08.2025

TENDER NOTIFICATION

Sealed Tenders are invited from the reputed manufactures / Distributers and retailers for supply of the following items for use in Government General Hospital, Guntur, for a period of 02 (two) years:

S.No	Description
I	Implants (Orthopedics, Plastic Surgery, Neurosurgery & Other Surgical Implants)

Date of Sale of Tender Application : 25.08.2025 Time 10:30 AM
Last Date of Sale of Tender Application : 07.09.2025 Time 05:00 PM
Last Date for submission of tender applications : 08.09.2025 Time 03:00 PM
Date of opening of Tender : 09.09.2025 Time 11:00 AM

Technical and Financial bids should be submitted in separate sealed covers. The Sealed tender will be opened in the presence of the Joint Collector / Chairman, District Purchase Committee, Guntur District, Guntur and the Tender Committee. Authorized Representatives of the Tenderer should attend the tender opening on 09.09.2025 at 11:00 AM at Joint Collector's Chamber, O/o Collectorate, Guntur.

The Tender form should be obtained from this Office in any working day from 10:30 AM to 05:00 PM on payment of Rs.5000-00, payable in cash at Hospital Stoppages Counter, Government General Hospital, Guntur.

The sealed Tenders along with Demand Draft towards E.M.D and other required documents to be submitted to this Office within the stipulated time.

This office is not responsible for any postal delay. The Superintendent, GGH Guntur is the final authority to accept or reject any tender without assigning any reason.

Sd/- **SUPERINTENDENT**
Govt.General Hospital, Guntur.

కూతురితో వచ్చి..

కృష్ణానదిలో దూకి తల్లి ఆత్మహత్య



అనేఖ్య



విజయభార్గవి మృతదేహం

తాడేపల్లి టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఏం కష్టమొచ్చిందో ఆ తల్లికి... కూతురిని ఒడ్డున కూర్చోబెట్టి కృష్ణానదిలో దూకి తనువు చాలించింది. ఒంటరైన పాపని ప్రశ్నిస్తే తల్లిదండ్రుల పేర్లు చెబుతుంది కానీ, ఇతర వివరాలు చెప్పలేకపోతోంది. ఈ విషాద ఘటన తాడేపల్లి పరిధిలోని సీతానగరం వద్ద శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. పుష్కరఘాట్ల వద్ద ఓ తల్లి కూతురిని మధ్యాహ్నం 3 గంటల సమయంలో తీసుకువచ్చింది. కొద్దిసేపటికే కూతురిని మెట్ల మీద కూర్చోబెట్టి అకస్మాత్తుగా నదిలోకి దూకేసింది. స్థానికులు కాపాడేలోగా చనిపోయింది. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిన్నారిని విచారించగా తన పేరు అనేఖ్య అని, తల్లి పేరు విజయభార్గవి, తండ్రి పేరు నరేష్ అని చెబుతోంది. ఊరు తదితర వివరాలు చెప్పలేకపోతోందని పోలీసులు తెలిపారు. ఎవరైనా గుర్తించినట్లయితే సీఐ 86888 31361, ఎస్ఐ 8143 8734 09 నెంబర్లలో సంప్రదించాలని ఎస్ఐ సతీష్ తెలిపారు.

ప్రకాశం పంతులు జీవితం అందరికీ ఆదర్శం



పకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఈఓ జ్యోతి బసు, డిప్యూటీ సీఈఓ

జిల్లా పరిషత్ సీఈఓ వీర్ల జ్యోతి బసు

గుంటూరు సిటీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం అందరికీ ఆదర్శమని గుంటూరు జిల్లా పరిషత్ సీఈఓ వీర్ల జ్యోతి బసు అన్నారు. శనివారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడిన సీఈఓ జ్యోతి బసు ప్రకాశం పంతులు రాష్ట్ర ఏర్పాటు కోసం చేసిన కృషిని జ్ఞాపకం చేశారు. మద్రాస్‌లో సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా జరిగిన ప్రదర్శనలో తుపాకీ ఎదురుగా గుండెను ఉంచిన ధీరుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ అన్నారు. నీతి, నిజాయితీ కి ఆయన నిలువుటద్దమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ అకౌంట్స్ ఆఫీసర్ శామ్యూల్ పాల్, విభాగాధిపతులు నాగ మల్లేశ్వరరావు, నాగరాజు, రత్న కుమార్, సాయి శ్రీనివాస్, రామకోటయ్య, మినిస్టీరియల్ సిబ్బంది రాష్ట్ర నేత డాక్టర్ కూచిపూడి మోహన్ రావు, సమావేశ మందిరం ఇన్‌చార్జి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శనివారం 33.18 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 3,87,101 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. మొత్తం 3,81,796 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

ముగిసిన జోనల్..

అమరావతి చాంపియన్‌షిప్

పెదకాకాని, గుంటూరు 23 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 20 నుంచి నిర్వహిస్తున్న అమరావతి చాంపియన్‌షిప్ జోనల్ స్థాయి క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి తెలిపారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి పది క్రీడాంశాల్లో అండర్-14 బాల బాలికల విభాగాల్లో ఈ పోటీలు జరిగాయన్నారు. ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, నెల్లూరు, కృష్ణ, ప్రకాశం జిల్లాలకు చెందిన సుమారు 2,087 మంది క్రీడాకారులు పాల్గొన్నారని చెప్పారు. విజేతలు ఆదివారం నుంచి ఈ నెల 26వ తేదీ వరకు తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. వీరికి క్రీడా సామగ్రి, టీఏ మంజూరైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి విజేతలు 29న జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదగా పతకాలు అందుకుంటారని పేర్కొన్నారు. 1.కబడ్డీ:నెల్లూరు బాలురు జట్టు, ఎన్టీఆర్ బాలికల జట్టు, 2.ఖోఖో: బాపట్ల బాలుర, నెల్లూరు బాలికల జట్లు, 3.బాస్కెట్‌బాల్: గుంటూరు బాలుర, పల్నాడు బాలికల జట్లు 4.హాకీ: బాపట్ల బాలుర, నెల్లూరు బాలికల జట్లు, 5.వాలీబాల్: గుంటూరు బాలుర, ఎన్టీఆర్ బాలికల జట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడనున్నట్లు వెల్లడించారు.

ఇచ్చేదే కొసరు.. ఆపై కోతలా?

(3వ పేజీ తరువాయి)

నిర్ణయాలు తీసుకోవడం విచిత్రం. ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో ఐదు నిమిషాలు ఆలస్యంగా హాజరు వేసినా ఆ రోజు ఆబ్సెంట్‌గా చూపిస్తున్నదని పలువురు వాపోతున్నారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ఎక్కువగా జూనియర్ కళాశాలలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. ఆయా కళాశాలలకు ఎక్కువమంది లెక్చరర్లు సుమారు 80 కిలోమీటర్ల ప్రయాణించి విధులకు హాజరౌతున్నారు. ఈ పరిస్థితుల్లో ఎఫ్‌ఆర్‌ఎస్ వల్ల వచ్చే జీతంలో కోతలు ఎక్కువగా ఉంటాయి. సెల్‌సిగ్నల్ లేకపోయినా.. యాప్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తినా ఉద్యోగికే నష్టం జరుగుతుంది. ఇస్తుందే తక్కువ జీతం.. అందులో కోతలు అంటే ఎలా అని పలువురు లెక్చరర్లు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న 230 మంది కాంట్రాక్టు లెక్చరర్లలో ఎక్కువ మంది క్రమబద్ధీకరణకు అర్హత కలిగి ఉన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత క్రమబద్ధీకరణ ప్రక్రియకు బ్రేక్‌తో 14 నెలలుగా అసంతృప్తితో ఉద్యోగం చేస్తున్నారు. క్రమబద్ధీకరణ విషయాన్ని పట్టించుకోకుండా అధికారులు ఎఫ్‌ఆర్‌ఎస్‌కు జీతాలు లింకు పెట్టేందుకు ప్రయత్నం చేయడంపై అసంతృప్తి, ఆందోళన వెల్లువెత్తుతోంది.

26న జిల్లా స్థాయి ఫెన్సింగ్ ఎంపికలు

గుంటూరు (తూర్పు), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గుంటూరు ఫెన్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలుర, బాలికల విభాగాల్లో ఈ నెల 26న స్థానిక బీఆర్ స్టేడియంలో జిల్లా స్థాయి ఫెన్సింగ్ ఎంపికలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి డి.అశోక్‌బాబు తెలిపారు. పొత్తూరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025 నాటికి 17 ఏళ్ల పూర్తయిన వారు అర్హులన్నారు. పోటీలలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 30న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరిగే 11వ అంతర్జిల్లాల ఫెన్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో పాల్గొంటారన్నారు. ఇతర వివరాలకు 70755 08842 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

పురపాలక సంఘం, బాపట్ల

ఆర్.ఓ.సి.నెం.898/2023/జి2 తేది. 22.08.2025

ప్రకటన

ప్రభుత్వ ఉత్తర్వుల నెం. 650, యం.ఏ & యు.డి. తేది. 27-10-1993 మాస్టర్ ప్లాను ప్రకారము, బాపట్ల పురపాలక సంఘ పరిధిలో రోడ్లను అభివృద్ధి చేయుటలో భాగంగా జి.బి.సి. రోడ్డు, రథం బజారు మరియు ఎ.జి. కాలేజీ రోడ్డులను విస్తరణ చేయడం జరిగింది. సదరు రోడ్డు విస్తరణలో స్థలం కోల్పోయిన యజమానుదారులకు TDR (Transferable Develpment Rights) బాండ్లు జారీ చేయు విషయమై పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ డిపార్టుమెంటు వారు మెమో నెం. 2250050/M2/2023, తేది. 30.10.2023 నందు Scrutiny కమిటీని ఏర్పాటు చేసియున్నారు. సదరు Scrutiny కమిటీ వారు Scrutiny చేసిన స్థల యజమానుదారుల వివరములు ఈ క్రింది విధముగా ఉన్నవి.

S. No	Structure No	Name of the Building (or) Site Owner	Location of Site	Registered deed No	Extent of Land effected (Sq.Mts)	Door No	Survey No
1	5	Brundavanam Srinivsamurthy Acharyulu	Radham Bazar	6627/2010	11.84	10-3-14	501/1
2	71	Muppalaneni Srinivasarao	Ag College Road	2166/1993	40.32	12-3-11	484/1
3	55	Kollipara Srinivasarao	GBC Road	4899/2023	9.9	10-2-138/2	489/3
4	67	Thatavarthi Suresh	Ag College Road	184/1988	6.44	12-3-20	484/1
5	38	Thatavarthi Suresh	Radham Bazar	7213/2020	7.95	10-1-50	501/1
6	53	Itha Sriranganadham	Radham Bazar	75/1981	5.31	10-1-25	503/3
7	13	Boddupalli Narayana	GBC Road	5952/2012	36.43	15-4-12	510/3
8	19	Chamarthi Gopala Krishnamurthy	GBC Road	362/1997	43.18	16-2-5	479/1, 2
9	20	Komaravolu Seshu Kumar	Ag College Road	377/2001	43.46	12-2-12	466/5
10	24	Vegesana Narendra Varma	GBC Road	1006/2015	10.19	16-1-37	479/3, 479/4B

పై తెలిపిన వారు యొక్క డాక్యుమెంట్లను Scrutiny కమిటీ వారు Scrutiny చేసి TDR బాండ్లు మంజూరు చేయుటకుగాను ఆమోదము తెలిపియున్నారు. కావున పై తెలిపిన వారికి TDR బాండ్లు మంజూరు చేయు విషయములో ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల 7 రోజులలోపు బాపట్ల పురపాలక సంఘ కార్యాలయమునకు దాఖలు చేయవలెనని తెలియజేయడమైనది.

సం/- **కమీషనరు,**
బాపట్ల పురపాలక సంఘం

యూరియా అమ్మకాలపై నిఘాకు బృందాలు

గుంటూరు సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా అమ్మకాలపై నిఘా బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. మండల స్థాయిలో ఏర్పాటు చేసే ఈ బృందంలో తహసీల్దార్, ఎస్ఐ, ఏవో ఉంటారని తెలిపారు. ఎవరైనా యూరియాను అధిక ధరకు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా కమిటీ చర్యలు చేపడుతుందని తెలిపారు. యూరియా బస్తా కేవలం రూ.266.50కి మాత్రమే విక్రయించాలని తెలిపారు.



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

సమగ్రంగా స్వీపింగ్ చేపట్టాలి

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో ఉదయం ప్రధాన రోడ్లలో డివైడర్ వరకు సమగ్రంగా స్వీపింగ్ చేపట్టాలని కమిషనర్ పులి శ్రీనివాసులు కార్మికులను ఆదేశించారు. శనివారం శ్యామలానగర్, ఎన్జీవో కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, నల్లకుంట, శ్రీనివాసరావుతోట తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో డీఈ వెంకటరమణ పాల్గొన్నారు.



సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

సురవరానికి ఘన నివాళులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్‌లో శనివారం సీపీఐ జాతీయ పూర్వ కార్యదర్శి మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి మాట్లాడుతూ పేదల పక్షపాతి సుధాకర్‌రెడ్డి అని కొనియాడారు. బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. పేదల హక్కుల కోసం ఎన్నోసార్లు జైలు జీవితం గడిపారని గుర్తుచేశారు. సాధారణ కుటుంబంలో పుట్టి జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగారన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగూరి రాధాకృష్ణమూర్తి, అకిటి అరుణ్‌కుమార్, లలితమ్మ, యశ్వంత్ శశి, మంగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్వాంటమ్ టెక్నాలజీపై అవగాహన అవసరం

గుంటూరు(విద్య), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నూతన టెక్నాలజీగా అభివృద్ధి చెందుతున్న క్వాంటమ్ టెక్నాలజీపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని కళాశాల డైరెక్టర్ డాక్టర్ మొవ్వ ఉమాశంకరరెడ్డి తెలిపారు. స్థానిక చౌడవరంలోని కళ్లం హరనాధరెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో శనివారం క్వాంటమ్ వ్యాలీ-2025 హ్యాకథాన్‌పై అవగాహన సదస్సు జరిగింది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి హ్యాకథాన్ పోటీలలో ప్రతి విద్యార్థి పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, ఉపాధికల్పన అధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు, హ్యాకథాన్ పోటీల నిర్వాహకురాలు డాక్టర్ బిందుమాధవి పాల్గొన్నారు.

ఎరువుల షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు



షాపుల్లో యూరియా నిల్వలు పరిశీలిస్తున్న విజిలెన్స్ సీఐ కొమ్మాలపాటి చంద్రశేఖర్ తదితరులు

గుంటూరు సిటీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలోని ఎరువుల షాపులపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ డి సూర్యశ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ తనిఖీలలో అధికారులు ఎరువుల షాపుల్లో యూరియా నిల్వలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లు పరిశీలించిన అధికారులు యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక ధరలకు విక్రాయించినట్లు ఫిర్యాదులు వస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీలలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కొమ్మాలపాటి చంద్రశేఖర్, ఏఈఈ వై శివన్నారాయణ, ఏఓ సీహెచ్ ఆదినారాయణ, అసిస్టెంట్ జియాలజిస్ట్ జి.అనిల్‌బాబు, ఎఫ్ఆర్ ఓ సైదులు, తహసీల్దార్ ఎం లక్ష్మి మాధవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు తూర్పునకు నాలుగు ప్రాజెక్టులు

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి జన వికాస్ కార్యక్రమం ద్వారా గుంటూరు తూర్పు నియోజకవర్గానికి నాలుగు కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు మంజూరయ్యాయని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. పీఎంజీవీకే, పీఎం సూర్య ఘర్ అమలుపై కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ ఏడు ఎకరాల విస్తీర్ణంలో మైనార్టీ రెసిడెన్షియల్ స్కూలు, ఆటోనగర్ కార్మికుల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, అంజుమన్ భూమిలో మల్టీపర్పస్ స్కిల్ సెంటర్, బొంగరాలబీడులో జీజీహెచ్ సబ్ సెంటర్ ఉన్నాయన్నారు. సూర్యఘర్ పథకం ద్వారా గుంటూరు పార్లమెంటు పరిధిలో లక్ష 16 వేల మంది ఇప్పుడు దాకా రిజిస్టర్ అయ్యారన్నారు. ఇందులో 3600 మందికి మాత్రమే అమలు జరిగిందన్నారు. బ్యాంకు రుణాలు, పథకానికి సంబంధించిన పోర్టల్‌లో ఉన్న ఇబ్బందులు, అధికారులు లబ్ధిదారుల మధ్య సమన్వయ లోపాలు తదితర అంశాల కారణంగా కొంత ఆలస్యం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ అహ్మద్, డీఆర్‌ఓ షేక్ ఖాజావలి, సీపీవో శేషశ్రీ, అధికారులు పాల్గొన్నారు.




కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

రెండు ఆస్పత్రుల్లో డీఎంహెచ్‌వో తనిఖీలు

గుంటూరు మెడికల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రేష్ఠ హాస్పిటల్స్, విజయాస్ కోస్టల్ కేర్ ఆస్పత్రుల్లో శనివారం డీఎంహెచ్‌వో విజయలక్ష్మి తనిఖీలు చేశారు. ఆస్పత్రుల్లోని రిజిస్టర్‌లను పరిశీలించారు. విజయాస్ కోస్టల్ కేర్ ఆస్పత్రిలో వైద్యపరీక్షల ధరల పట్టికను ప్రదర్శించాలని ఆదేశించారు. వెంటిలేషన్ సదుపాయాలు పెంచుకోవాలని సూచించారు.

శ్రేష్ఠలో ఒకే రోజు హైరిస్క్ శస్త్రచికిత్సలు



రోటాబ్లేషన్ మెషిన్‌తో డాక్టర్ నాగార్జున, డాక్టర్ హేమసుందర్

గుంటూరు మెడికల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రోటాబ్లేషన్, ఐవస్ పద్ధతుల ద్వారా హైరిస్క్ రోగులకు ఒకే రోజు ఐదుగురికి దిగ్విజయంగా శస్త్రచికిత్సలు అందించినట్లు శ్రేష్ఠ హాస్పిటల్స్ కార్డియాలజిస్టులు డాక్టర్ గొట్టిపాటి నాగార్జున, డాక్టర్ కొర్రపాటి హేమసుందర్ తెలిపారు. ఆయా రోగులు ఆరోగ్యపరంగా పూర్తిగా కోలుకున్నట్లు చెప్పారు. గతంలో ఈ తరహా ఆధునిక సర్జరీల కోసం రోగులు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లకు వెళ్లాల్సివచ్చేదన్నారు. కాగా శ్రేష్ఠ హాస్పిటల్స్ ఈ తరహా సంక్లిష్టమైన గుండె శస్త్రచికిత్సలు గుంటూరుప్రాంతంలోనే చేస్తున్నట్లు తెలిపారు.

వసతిగృహాల్లో సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏఎస్‌డబ్ల్యువో శైలజ

గుంటూరు(విద్య), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాల్లో కల్పించే సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని విద్యార్థినులు ఉన్నత స్థానాలకు చేరాలని సాంఘిక సంక్షేమశాఖ సహాయ సంక్షేమశాధికారి జి.శైలజ విజ్ఞప్తి చేశారు. శనివారం పట్టాభిపురంలోని సాంఘిక సంక్షేమశాఖ కళాశాల హాస్టల్‌లో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కష్టపడి చదువుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షమ శాఖాధికారి కె.అనురాధ, బీహెచ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కౌశల్యాదేవి, మహిళా పోలీసు రజిత పాల్గొన్నారు.

అమరావతిపై వైసీపీ కుట్రలు హేయం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అమరావతిపై వైసీపీ చేస్తున్న విష ప్రచారం హేయమని టీడీపీ సీనియర్ నాయకుడు కొర్రపాటి సురేష్ మండిపడ్డారు. స్థానిక నగరంపాలెం కార్యాలయంలో జరిగిన జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధాని ప్రతిష్ఠను దిగజార్చేందుకు దుష్ప్రచారాలు చేసే చర్యలు సిగ్గుచేటన్నారు. రాజధాని జోలికివస్తే మరోసారి జగన్‌కు ఘోర ప్రభావం తప్పదని హెచ్చరించారు. పవిత్ర యెషయా గ్రంథంలో అమరావతి అభివృద్ధి, ఆంధ్రప్రదేశ్ పరిస్థితి ప్రతిబింబించేలా క్షుణ్ణంగా ఉందన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

● అధికారులకు సూచించిన పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆదేశించారు. శనివారం తన కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే వాటి పరిష్కారం కోసం ద్విచక్ర వాహనంపై పలు డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా 28వ డివిజన్ హౌసింగ్ బోర్డు కాలనీలో జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నాసిరకం పనులు సహించేది లేదన్నారు. ఏటి అగ్రహారం 4వ, 5వ లైన్ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న మురుగు సమస్యను ప్రత్యక్షంగా గమనించి, శాశ్వత పరిష్కారం కోసం తక్షణ చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.



మురుగు కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవి

స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్రను విజయవంతం చేయాలి

● తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నసీర్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు(విద్య), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా నాలుగో శనివారం స్వచ్ఛత మీ సేవ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్ని విజయవంతం చేయాలని తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీ కమిటీ చైర్మన్ నసీర్ తెలిపారు. స్థానిక చౌత్రా సెంటర్ బాలికల పాఠశాలలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి పరిశుభ్రతే ఔషధమన్నారు. చేతులు శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని తెలిపారు. విద్యార్థులు చక్కగా చదువుకోవాలన్నా, ఆనందంగా ఆడుకోవాలన్నా ఆరోగ్యంగా ఉంటేనే సాధ్యమని తెలిపారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్లు చిష్టి, శంకూరి శ్రీను, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, ఎంహెచ్‌వో రామారావు, షఫీజ్, ప్రసాద్, ఎంఈవో ఖుద్దూస్, ప్రిన్సిపాల్ పద్మజ, చిన్న బుజ్జి, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

పండుగల సమయంలోనూ పని చేయరా?

'కాలువల్లో మురుగు కదలడం లేదు. ఎక్కడికక్కడ అపరిశుభ్రత వాతావరణం కనిపిస్తోంది. వర్షాకాలంలో ఇలా ఉంటే వ్యాధులు రాకుండా ఉంటాయా? పండుగల సమయం కూడా పట్టించుకోరా? ఇకపై మైక్రో ప్యాకెట్స్ వారీగా దృష్టి సారిస్తాం..' అని శానిటేషన్ సిబ్బందిపై ఎమ్మెల్యే నసీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం అనంతరం స్థానిక చౌత్రా సెంటర్ లో మురుగు కాలువలను ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. కాలువల్లో మురుగు నీరు నిల్వలు ఉండటం, చెత్తచెదారం పేరుకుపోవడం గమనించి సంబంధిత అధికారులను పిలిపించారు. వినాయకచవితి, ఇతర పండుగలు వస్తున్నాయని, ఈ సమయంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించబోమన్నారు.

వీఆర్‌ఏలకు పేస్కేలు వేతనాలు అమలు చేయాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకులకు తెలంగాణ తరహా పేస్కేలు వేతనాలు అమలు చేయాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో షేక్ ఆదాం షఫీ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఎనిమిదేళ్ల నుంచి వేతనాలు పెంచకుండా వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని విమర్శించారు. అక్రమ డ్యూటీలు, నైట్ డ్యూటీలను ఎత్తివేయాలన్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బందగి సాహెబ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వీఆర్‌ఏలకు వేతనాలు పెంచకపోగా ప్రతి వీఆర్ఏ నుంచి రూ.14 నుంచి రూ.15 వేల వరకు రికవరీచేశారని గుర్తుచేశారు. ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మన్, వీఆర్వో పోస్టులు వీఆర్‌ఏలతో భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, లక్ష్మణరావు, బాజీబాబు, షేక్ నాగుల మీరా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు, పాల్గొన్న వీఆర్‌ఏలు

విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలి

● కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆందోళన



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుంటూరు(విద్య), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారించాలంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. జిల్లా కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చి 15 నెలలు అయినా, విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు అయినా విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వకుండా కళాశాల యాజమాన్యాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ బిల్లులు పెంచకపోవడం వల్ల హాస్టళ్లలో పౌష్టికాహార లోపంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మండలానికి ఒక ప్రభుత్వ జూనియర్ కాలేజి, నియోజకవర్గానికి ఒక డిగ్రీ కాలేజి ఏర్పాటు చేయాలని కోరారు.




సత్యనారాయణకు పురస్కారం అందజేస్తున్న గుమ్మడి గోపాలకృష్ణ

అప్పాజోస్యులకు కళావిపంచి పురస్కారం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణకు కళావిపంచి వారి తెలుగు వెలుగు ఆత్మీయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు ఆధ్వర్యంలో తెలుగు వెలుగు ఆత్మీయ పురస్కార సభ జరిగింది. ఆరాధన ఆర్ట్స్ అకాడమీ, గోవిందరాజులు నాగేశ్వరరావు రచన, నడింపల్లి వెంకటేశ్వరరావు దర్శకత్వం వహించిన పాప దొరికింది హాస్య నాటిక ఆహుతులను అలరించింది. భాగీ శివశంకరశాస్త్రి, డి.తిరుమలేశ్వరరావు, జి. మల్లికార్జునరావు కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళావిపంచి గౌరవాధ్యక్షుడు రామరాజు శ్రీనివాసరావు, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, సాహితీవేత్త కందిమళ్ళ సాంబశివరావు, సారస్వత కళానిధి డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ కే.సి.పీ. సిమెంట్ వజ్జా మధుసూదనరావు, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సి.హెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, డీ. రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

బార్లకు దరఖాస్తు చేసుకోవాలి

గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ శ్రీనివాసులు



ప్రసంగిస్తున్న గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ శ్రీనివాసులు, పక్కన జిల్లా అధికారి అరుణ కుమారి

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మద్యం బార్లకు వ్యాపారులు దరఖాస్తు చేసుకోవాలని గుంటూరు ఎక్సైజ్ డీసీ డాక్టర్ కే శ్రీనివాసులు తెలిపారు. శనివారం గుంటూరు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్యం పాలసీపై కొందరు చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. గతంలో పోల్చుకుంటే ప్రస్తుత పాలసీ చాలా బాగుందన్నారు. బార్ నిర్వాహణలోని నిబంధనలను సరళం చేశామన్నారు. బార్లలో ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకు వ్యాపార లావాదేవీలు నిర్వహించుకునే అవకాశం ఉందన్నారు. మద్యం వ్యాపారులకు ఐటీ మినహాయింపు కూడా లభిస్తుందన్నారు. మూడు సంవత్సరాల కాలవ్యవధిలో బార్లను నిర్వహించుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారిని అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సర్వీసులకు అమరావతి రూట్‌లో పెరిగిన స్టేజీ

గుంటూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శంకర్‌విలాస్ ఫ్లైవోవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్ మళ్ళింపులో భాగంగా అమరావతి రూట్ వైపునకు రాకపోకలు సాగించే బస్సులకు ఒక స్టేజ్‌ని పెంచి ఛార్జీ వసూలు చేయనున్నట్లు డిపో మేనేజర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌టీఆర్ బస్టాండ్ నుంచి లామ్ వైపునకు వయా రమేష్ హాస్పటల్, గుజ్జనగుండ్ల, జేకేసీ కళాశాల, ఆర్టీవో ఆఫీసు మీదుగా చిలీస్ మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు. ఒక స్టేజ్ పెరిగిన కారణంగా గుంటూరు నుంచి అమరావతి గుడికి పాత ఛార్జీ రూ.45నుంచి రూ.50కు, గుంటూరు నుంచి క్రోసూరుకు పాత ఛార్జీ రూ.70 ఉండగా రూ.75, గుంటూరు నుంచి తుళ్ళూరు పాత ఛార్జీ రూ.40 కొత్త ఛార్జీ రూ.45కు మారినట్లు పేర్కొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలు హేయం: లింగంశెట్టి

గుంటూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బీ సుదర్శన్‌రెడ్డిపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయటం హేయమని మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు విమర్శించారు. రాజీవ్‌గాంధీభవన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆ య న మాట్లాడుతూ ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఎదిరించలేక అప్ప టి తీర్పులపై కువిమర్శలు చేయటం బీజేపీ దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. సమావేశంలో డీసీసీ లీగల్‌సెల్ అధ్యక్షుడు యన్నం సుధీర్‌బా బు, ఎన్ఎస్‌యూఐ జిల్లాఅధ్యక్షుడు కరీమ్, తిరుమలరావు, నవీన్ ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై యువతకు అవగాహన అవసరం



మాట్లాడుతున్న చిలుకూరి విజయకుమార్

గుంటూరు(విద్య), ఆగస్టు 23(ఆంధ్ర జ్యోతి): యువతకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరమని ఆర్థికరంగ నిపుణుడు చిలుకూరి విజయకుమార్ సూచించారు. శనివారం జేకేసీ కళాశాలలో కోటక్ సెక్యూరిటీస్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెటింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. డిగ్రీ చదివే విద్యార్థులు డిజిటల్ మార్కెటింగ్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలతోపాటు, పెట్టుబడులకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి గోపిచంద్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కే ప్రసాద్, కామర్స్ విభాగాధిపతి ఎం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకారవేతనాలకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు (విద్య) ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో దివ్యాంగ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయనున్నట్లు వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువార్త శనివారం తెలిపారు. పాఠశాల స్థాయిలో 9, 10 తరగతి, ఇంటర్ ఆపై చదివే దివ్యాంగ విద్యార్థిని విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ మంజూరు చేస్తారని వెల్లడించారు. అర్హులైన వారు ఈ నెల 31లోగా www.depwd.gov.in,https://scholarships.gov.inలో అనే వెబ్‌సైట్ ద్వారా డిపార్టుమెంట్ ఆఫ్ పర్సన్ విత్ డిజెబిలిటీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు తక్కెళ్లపాడులో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

పెదకాకాని, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండలం, తక్కెళ్లపాడులో శ్రీకృష్ణుడి వేషధారణలో ఉన్న ఎన్టీఆర్ భారీ విగ్రహాన్ని ఆదివారం ఉదయం 10గంటలకు ఆవిష్కరిస్తున్నట్లు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ తెలిపారు. శనివారం సభా వేదిక వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, హోంమంత్రి వం గలపూడి అనిత, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. కార్యక్రమంను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో టీడీపీ నాయకులు మోపర్తి సంజీవ్‌కుమార్, ఎ.సంపత్, జె.బ్రహ్మయ్య, కె.రాజేష్, బసవ య్య, కె.మల్లేశ్వరరావు, ఎం.మల్లేశ్వరరావు, ఎన్. రామయ్య, సుబ్బారావు, పి.నాగసురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి జీవితం అందరికీ ఆదర్శం

గుంటూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటంలో తెల్లదొరల తుపాకి గుండుకు ఎదురొడ్డి నిలిచిన ధీరుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి కొనియాడారు. శంకర్ విలాస్ సెంటర్‌లోని ప్రకాశంచౌక్‌లో ఆంధ్రకేసరి అభిమాన సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్రకాశం పంతులు జ యంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షుడైన అప్పిరెడ్డి హాజరై ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), బందా రవీంద్రనాధ్, వెలుగూరి రత్నప్రసాద్, బత్తుల దేవానంద్ పలువురు కార్పొరేటర్లు ఉన్నారు.

● ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ ఆధ్వర్యంలో ఇన్నర్‌రింగ్ రోడ్డులోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో నాయకులు పులిపాక ప్రసాద్, లలితశాస్త్రి, మాచిరాజు మురళీకృష్ణ, నాగరాజు, పులిజాల సాంబశివరావు, మాదిరాజు తరుణ్, మద్దాళి రాంబాబు, గొల్లపూడి గిరి, బీజేపీ నాయకుడు పాండురంగ విఠల్ తదితరులున్నారు.

● అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం జరిగింది. విద్యావేత్త చంద్రయ్య మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు భారత జాతిరత్నమని కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సుబ్బారెడ్డి, సింగరయ్య, వెంకటరత్నం, కృష్ణారావు తదితరులున్నారు.



ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి తదితరులు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, డీఆర్వో, నజీనా బేగం

ప్రకృతి నచ్చేలా పండగను జరుపుకుందాం

● కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితంగా వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి పిలుపునిచ్చారు. కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన 'సహజ రంగులతో చేసిన మట్టి ప్రతిమలతో.. పర్యావరణ అనుకూల వినాయక చవితి జరుపుకుందాం' పోస్టర్లను శనివారం కలెక్టరేట్‌లో ఆమె ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కృత్రిమ రంగులు, రసాయనాలు, థర్మకోల్ వంటి వినియోగంతో పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందన్నారు. భావితరాలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలంటే పర్యావరణ హిత మార్గాలను అనుసరించాలన్నారు. ప్రకృతి శోభతో ఆధ్యాత్మిక వాతావరణంలో పండుగను జరుపుకోవాలని సూచించారు. పర్యావరణ ఇంజనీరు నజీనా బేగం మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల్లో మట్టి ప్రతిమలనే పూజించాలని కోరారు. అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని స్వచ్ఛంద సంస్థలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలీ, సీపీఓ శేషశ్రీ పాల్గొన్నారు.

దళారే.. ధర నిర్ణేత

● నిమ్మ మార్కెట్‌లో రైతుకు గిట్టుబాటు ప్రశ్నార్థకం
● ప్రత్యామ్నాయం చూసుకుంటున్న కర్షకులు
● తగ్గిపోతున్న నిమ్మ సాగు విస్తీర్ణం



తెనాలి క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తెనాలి నిమ్మకాయల మార్కెట్ యార్డులో దళారీ వ్యవస్థ ఓడల మర్రిలా వేళ్లూనుకుంది. దళారులు చెప్పిన ధరకే రైతు పంట అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. తెనాలి, చుండూరు, దుగ్గిరాల మండలాల పరిధిలో రెండు వేల మంది నిమ్మరైతులున్నారు. గతంలో పది వేల ఎకరాల మేర నిమ్మ తోటలు సాగు చేసేవారు. ప్రస్తుతం 6 నుంచి 8 వేల ఎకరాలకే నిమ్మసాగు పరిమితం అయింది. ఇక్కడి నిమ్మకాయలు దేశ వ్యాప్తంగా ప్రసిద్ధి. నిమ్మ పంటకి అనుకూలమైన సాగు భూములు ఈ ప్రాంతంలో ఉండడంతో కాయ నాణ్యత, రసం దిగుబడి అధికంగా ఉంటుంది. రాష్ట్రంలో ఏలూరు, గూడూరు, పొదలకూరు, తెనాలి, రాజమండ్రి ప్రధాన నిమ్మ మార్కెట్‌లు. తెనాలి మార్కెట్‌లో రైతుకు మిగిలిన మార్కెట్‌లలో ఏ ధర పలుకుతుందో అన్న సమాచారం కూడా దళారులు, వ్యాపారులు, అధికారులు తెలియనివ్వడం లేదు. దీనితో ఇక్కడ దళారే పంట ధర నిర్ణేత. ఇక్కడ మార్కెట్‌లో కమీషన్, తూకం, తరుగుదలలో కూడా రైతు కళ్ల ముందే మోసం జరుగుతుంది. దీనిపై రైతు మాట్లాడలేని పరిస్థితి. కాయ పండించి తోటల నుంచి మార్కెట్‌కు తీసుకు రావడమే.. గిట్టుబాటు ధర రైతు చేతుల్లో ఉండదు. గిట్టుబాటు కావడం లేదని పచ్చికాయను తిరిగి రైతు ఇంటికి తీసుకు వెళ్లలేని పరిస్థితి. నిమ్మతోట ఏడాదిలో రెండుమూడు కాపులు ఇస్తుంది. అందులో ఏదో ఒక సారి మాత్రమే రైతుకు గిట్టుబాటు ధర వస్తుంది. పెరిగిన పెట్టుబడులు, అధిక కూలి కారణంగా ఒక్కోసారి తోటల్లోనే కాయలు కోయకుండా వదిలేస్తున్న పరిస్థితులు ఇటీవల అనేక సార్లు రైతులు ఎదుర్కొన్నారు. రైతులు నష్టాలు భరించలేక తోటలు తొలగించి ఇతర పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. దళారీ వ్యవస్థకు చెక్ పెట్టి.. తెనాలి ప్రాంతంలోనే నిమ్మకాయ ఉప ఉత్పత్తుల పరిశ్రమలను ప్రభుత్వం ప్రోత్సహించాలని సంగం జాగర్లమూడికి చెందిన రైతు నాయకుడు కె.రమేష్‌బాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. దీంతో స్థానికంగా తోటల విస్తీర్ణం పెరగడమే కాక రైతులకు మంచి ధర లభిస్తుందని పేర్కొన్నారు.


తెనాలి మార్కెట్ యార్డు

క్షీర రామలింగేశ్వర స్వామిని దర్శించిన జస్టిస్ కృష్ణమోహన్ దంపతులు


జస్టిస్ బీ కృష్ణ మోహన్, వసంతలక్ష్మీ దంపతులకు పండితాశీర్వాదం

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని క్షీర రామలింగేశ్వర స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణ మోహన్, వసంతలక్ష్మి దంపతులు శనివారం దర్శించుకున్నారు. జస్టిస్ కృష్ణమోహన్ దంపతులకు ఆలయ మర్యాదలతో అధికారులు, అర్చకులు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం న్యాయమూర్తి దంపతులకు అర్చక స్వాములు వేదాశీర్వచనం గావించారు. వారికి స్వామివారి శేష వస్త్రాన్ని, చిత్రపటాన్ని అందజేశారు.

ద్వారకా తిరుమల శ్రీవారి సేవలో జస్టిస్ సుజాత


జస్టిస్ సుజాతకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఈవో మూర్తి

ద్వారకాతిరుమల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల శ్రీవారి ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయన సుజాత శనివారం సందర్శించారు. ఆలయానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆమెకు అర్చకులు, దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. బంగారు వాకిలి నుంచి లోనికి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ ఈవో ఎన్‌వీ సత్యనారాయణమూర్తి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.


రీజినల్ డైరెక్టర్ హరికృష్ణకు వినతి పత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు రజాక్ తదితరులు

సీనియార్టీ జాబితా తయారు చేయాలి

● మునిసిపల్ ఆర్డీకి సచివాలయ ఉద్యోగుల విజ్ఞప్తి

గుంటూరు సిటీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గుంటూరు జోనల్ పరిధిలోని వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సీనియారిటీ జాబితా వెంటనే తయారు చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ/వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ విజ్ఞప్తి చేశారు. శనివారం గుంటూరు పట్టణంలోని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ రీజినల్ డైరెక్టర్ ఎస్.హరికృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల సీనియార్టీ జాబితాను జూలై 31వ తేదీలోపు రూపొందించాలని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఆదేశాలు ఇచ్చినప్పటికీ, అనేక చోట్ల జాబితాను రూపొందించలేదని ఆరోపించారు. త్వరితగ తిన పారదర్శకంగా సీనియార్టీ జాబితాను సిద్ధం చేసి, వార్డు సచివాలయ ఉద్యోగులకు అందజేయా లని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ సంఘాల నేతల విజ్ఞప్తిపై రీజినల్ డైరెక్టర్ హరికృష్ణ స్పందిస్తూ పది రోజుల్లోపు గుంటూరు రీజియన్ (ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి నెల్లూరు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలు) పరిధిలోని జాబితాను రూపొందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని, తుది సీనియార్టీ జాబితాను మునిసిపల్ డైరెక్టర్ కార్యాలయానికి, ఉద్యోగులకు అందిస్తామని వెల్లడించినట్లు సమాచారం. సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పార్థా మధు, నాయకులు అంకారావు, సందీప్ పాల్గొన్నారు.

సాగర్ జలాశయానికి కొనసాగుతున్న వరద

◆ 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల



విజయపురిసౌత్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. శనివారం శ్రీశైలం నుంచి 4,09,193 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 584.50 అడుగులు ఉంది. ఇది 295.99 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,019, ఎడమ కాలువ ద్వారా 7,518, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 29,232, 26 క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 3,60,724 ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో 4,09,193 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పులిచింతలకు 4,01,905 క్యూసెక్కులు


18 క్రస్ట్ గేట్లద్వారా విడుదలవుతున్న నీరు

రెంటచింతల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మించిన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి దిగువన ఉన్న పులిచింతలకు 4,01,905 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. 20 గేట్లకు గాను 13 రేడియల్ క్రస్ట్ గేట్లను 4.5 మీటర్లు, 5 గేట్లను 4 మీటర్ల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన సాగర్ నుంచి 3,90,849 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 73.94 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.450 టీఎంసీలకు సమానమన్నారు.విద్యుదుత్పత్తి నిలిపి వేశామన్నారు.

మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ


ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల తగ్గించడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నది వరద ఉధృతి క్రమేపీ తగ్గుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు కీసర, మున్నేరు, వెలగలేరు, తదితర ప్రధాన వాగుల నుంచి 3,92 715 క్యూసెక్కుల వరదనీరు శనివారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 3,75,125 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టా కాలువకు 10,0 82, పశ్చిమ డెల్టాకు 7,508 క్యూసెక్కులు వదులుతుండగా గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేసినట్టు జేఈ తెలిపారు. వరద ఉధృతి తగ్గుతుండడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించినట్లు జేఈ తెలిపారు.

అప్పుల భారం.. సర్పంచ్, ఉప సర్పంచ్ ఆత్మహత్య

● చిన్నలింగాయపాలెంలో విషాద ఛాయలు


గురిందపల్లి యోహాను (ఫైల్)


గిరిబాబు (ఫైల్)

కాకుమాను, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నలింగాయపాలెంలో సర్పంచ్, ఉప సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఇద్దరు ప్రజా ప్రతినిధులు ఒకే రోజు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎస్ఐ పృథ్వీ ఏకనాథ్ వివరాల ప్రకారం.. 2021లో సర్పంచ్‌గా గురిందపల్లి యోహాను(43) గెలుపొందారు. ఉప సర్పంచ్‌గా సీహెచ్ గిరిబాబు ఎన్నికయ్యారు. సర్పంచ్ యోహాను 8 ఎకరాల కౌలు పొలంలో వరి సాగు చేస్తూ రూ.5 లక్షల వరకు అప్పు చేశారు. అప్పు తీర్చే మార్గం లేక గత గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో అతనిని చికిత్స నిమిత్తం పొన్నూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. వైద్య సేవలు అందించినప్పటికి ఫలితం లేకపోయింది. భార్య మార్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఉప సర్పంచ్ సీహెచ్ గిరిబాబు కూడా వ్యవసాయం కోసం అధిక మొత్తంలో చేసిన అప్పులు తీర్చే మార్గం లేక అదే రోజు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. పొన్నూరులోని అదే ఆసుపత్రికి అతనిని తరిలించారు. అక్కడ నుంచి గుంటూరులోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. శవ పంచనామా అనంతరం మృతదేహాలను శనివారం గ్రామానికి తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఇద్దరి మృతదేహాలను సందర్శించి, నివాళులర్పించారు. యోహాను, గిరిబాబుల మృతి పార్టీకి తీరనిలోటు అని విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్త హత్య

❖ నమ్మకంగా తీసుకువెళ్లి చంపిన ప్రియుడు

బొల్లాపల్లి, గుంటూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : వివాహేత సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో ప్రియుడు, ప్రియురాలు కలిసి భర్తనే హతమార్చిన ఘటన నల్లపా డు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసిం ది. గోరంట్లకు చెందిన మున్నంగి ప్రదీప్‌ను గోరంట్ల మేరీప్రియ నగర్‌కు చెందిన యాదాల సాంబశివరావు గొంతు నులిమి హత్య చేశాడు. నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో నమోదైన మిస్సింగ్ కేసులో మిస్టరీని పోలీసు లు ఛేదించారు. పోలీసుల కథనం మేరకు.. యాదాల సాంబ శివరావుకు గోరంట్లకు చెందిన మున్నంగి మరియమ్మతో కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతుంది. మరియమ్మ భర్త బేల్దారి ప్రదీప్ మద్యానికి బానిసై ఆమెను ఇబ్బంది పెడుతున్నాడు. అలాగే తన వివాహేత సంబంధానికి భర్త అడ్డుగా ఉండడంతో ఎలాగైనా అడ్డు తొలగించు కోవాలని మరియమ్మ భావించింది. ప్రియుడు యాదాల సాంబశివరావు ఈ నెల 20న ప్రదీప్‌కు ఫోన్ చేసి తమ స్వగ్రామం వెనిగ ళ్ళలో ఇంటికి రేకులు వేయాలం టూ కోరాడు. ప్రదీప్‌ను సాంబ శివరావు ఆటోలో ఎక్కించుకొని చిలకలూరిపేట మీదుగా వినుకొండ వైపు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రదీప్‌కు మద్యం తాగించి, వెల్ల టూరు వెళ్లే రోడ్డులో నెహ్రూ సాగర్ తండా వైపు వెళ్లే మట్టి రోడ్డులోకి తీసుకెళ్లాడు. ఆటోలో ఉన్న పాత లుంగీతో.. ప్రదీప్ మెడకు ఉరి బిగించి హత్య చేశాడు. మృతదేహాన్ని అక్కడే రోడ్డు పక్కన వదిలి పరారయ్యాడు. అక్కడ నుంచి వస్తూ మరియమ్మకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. కానీ, ప్రదీప్ హత్య విషయం పోలీసులకు తెలిసి ఉంటుందని భావించిన నిందితుడు భయంతో.. నేరుగా గోరంట్ల వీఆర్వో సెబాస్టియన్‌ను కలిసి అసలు విషయం చెప్పాడు. వీఆర్వో ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు హత్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. సాంబశివరావు, మరియమ్మను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.


ప్రదీప్ కుమార్ మృతదేహం


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ భానోదయ

రైళ్లకు క్విక్ వాటరింగ్ ఎప్పుడు?

● 200 - 250 కిలోమీటర్లకు ఒక వాటరింగ్ స్టేషన్ ఉండాల్సిందే
● గుంటూరు-సికింద్రాబాద్, తిరుపతి-గుంటూరు సెక్షన్లలో ఏవని కాగ్ ప్రశ్న

గుంటూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రైల్వే బోర్డు ఉత్తర్వుల ప్రకారం 200 నుంచి 250 కిలోమీటర్ల దూరంలో రైళ్లకు తప్పనిసరిగా వాటరింగ్ స్టేషన్ ఉండాలన్న నిబంధన గుంటూరు రైల్వే డివిజన్‌లో అమలు కావడం లేదు. సికింద్రాబాద్‌లో రైలు బయలుదేరితే గుంటూరుకు వచ్చేంత వరకు మార్గ మధ్యలో వాటరింగ్ సదుపాయం లేదు. అయితే అప్పటికే రైళ్లు 281 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తున్నాయి. ఈ కారణంగా రైళ్లలో నీళ్లు అయిపోయి టాయ్‌లెట్స్‌కు వెళ్లడానికి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తిరుపతి - గుంటూరు సెక్షన్‌లోనూ ఇదే పరిస్థితి. మధ్యలో గూడూరులో వాటరింగ్ సదుపాయం ఉన్నా.. అక్కడి నుంచి బయలుదేరే రైళ్లలో మాత్రమే నింపుతున్నారు. దీంతో దాదాపుగా 380 కిలోమీటర్ల దూరం ప్రయాణించేంత వరకు నీటి సదుపాయం ఉండటం లేదు. ఈ రెండు విషయాలను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా సంస్థ తాజాగా విడుదల చేసిన నివేదికలో ప్రస్తావించింది.

ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు..

కాగ్ దేశ వ్యాప్తంగా రైళ్లలో క్విక్ వాటరింగ్‌పై ఇటీవలే అధ్యయనం చేసింది. ఈ నెల 20న తన నివేదికని కేంద్ర ప్రభుత్వానికి అందజేసింది. అందులో సికింద్రాబాద్ - గుంటూరు, తిరుపతి - గుంటూరు సెక్షన్లను ప్రత్యేకించి ప్రస్తావించింది. రైలు బోగీలలో నీటి సదుపాయం అనేది తప్పనిసరి. అయితే ఇటీవల కాలంలో రైళ్లలో నీరు అందుబాటులో ఉండడం లేదని తరచుగా ఫిర్యాదులు అందుతున్నాయి. నీరు నింపకుండా ఏ ఒక్క ట్రైన్‌ని నడపడానికి వీల్లేదని రైల్వేబోర్డు స్పష్టంగా ఆదేశాలు జారీ చేసింది. ప్రత్యేక రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా ప్రయాణిస్తుంటాయి. వాటిల్లో నీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో తప్పనిసరిగా 200 - 250 కిలోమీటర్ల దూరానికి నీటిని బోగీలపైన ఉండే ట్యాంకుల్లోకి నింపాల్సిందే.

ప్రతిపాదనలు వెళ్లినా..

నడికుడి రైల్వేస్టేషన్‌లో క్విక్ వాటరింగ్ సదుపాయం కల్పించాలని ప్రతిపాదనలు వెళ్లినా.. ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. ఈ స్టేషన్‌కు కేవలం 12 కిలోమీటర్ల దూరంలోనే కృష్ణా నది ఉంది. ఏడాది పొడవునా నీటి సదుపాయం ఇక్కడ అందుబాటులో ఉంటుంది. అయినప్పటికీ రూ.10 కోట్లు ఖర్చు చేసి క్విక్ వాటరింగ్ సదుపాయాన్ని రైల్వే శాఖ కల్పించలేకపోతోంది. అలానే ఇటీవలే రైలు సర్వీసులకు తెరిచిన రొంపిచర్ల, నెమలిపురి మార్గంలోనూ వాటరింగ్ సదుపాయం ఎక్కడా లేదు. సికింద్రాబాద్‌లో రైలు బయలుదేరితే దిగువమెట్ట వెళ్లేంత వరకు నీటిని నింపే అవకాశం లేదు. దీని వల్ల కూడా ఆ మార్గంలో రైళ్లను నడపడానికి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతిలో బయలుదేరితే గుంటూరు వరకు వాటరింగ్ స్టేషన్ లేదు. మార్గమధ్యలో గూడూరులో సదుపాయం ఉన్నప్పటికీ జోన్ అనుమతి ఇవ్వడం లేదు. అలానే సాయంత్రం వేళ గుంటూరు నుంచి కాచీగూడకు బయలుదేరే రైలుకు కూడా మార్గమధ్యలో దిగువమెట్ట, కర్నూలులో వాటరింగ్ సదుపాయం ఉన్నా జోన్ ఇవ్వకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నరసపూర్ - హుబ్లీ అమరావతి ఎక్స్‌ప్రెస్, షాలిమార్ - వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్‌లకు కూడా దిగువమెట్టలో గుంటూరు వైపు నుంచి వెళ్లేటప్పుడు వాటరింగ్ చేయడం లేదు. కాగ్ రిపోర్టు నేపథ్యంలో ఇప్పటికైనా క్విక్ వాటరింగ్ సదుపాయాన్ని నడికుడి, నంద్యాల, దిగువమెట్టలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.


రైళ్లకు చేసే క్విక్ వాటరింగ్ సిస్టం



వింటేజ్ వాచ్‌లతో ట్రెండీగా..

ప్రత్యేకమైన డిజైన్లతో అందరినీ అలరించిన వింటేజ్ వాచ్‌లు మళ్లీ ఇప్పుడు ట్రెండింగ్‌లోకి వచ్చేశాయి. అద్భుతమైన చేతిపని నైపుణ్యం, ఒకప్పటి హస్తకళల వైభవం మేళవించినట్లుండే ఈ వాచ్‌లు ప్రస్తుతం ఫ్యాషన్ ప్రియులను అలరిస్తున్నాయి. ప్రముఖ సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, సింగర్లు, వ్యాపారవేత్తలు ఇలా అందరూ ఈ ట్రెండ్‌ను అనుసరిస్తున్నారు. బంగారం, ప్లాటినంతో రూపొందించి వజ్రాలు, రత్నాలు పొదిగి వినూత్నంగా తీర్చిదిద్దిన అలనాటి కళాత్మక గడియారాలు ఎన్నో అందుబాటులోకి వచ్చేస్తున్నాయి. విభిన్నంగా జోడించిన చెయిన్, బెల్ట్‌లతో ఖరీదైన బ్రాస్‌లెట్లను తలపిస్తున్నాయి.

ఇటీవల కరీనా కపూర్ ఖాన్.. అత్యంత అరుదైన జేగర్ లీ కౌల్టర్ వాచ్ ధరించి తళుక్కుమన్నారు. అలాగే అనన్య పాండే కూడా ఆడెమర్స్ పిగ్యుట్ రాయల్ ఓక్ మినీ ఫ్రోస్టెడ్ గోల్డ్ వాచ్ పెట్టుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇది 1997 దశకంలో అత్యంత ప్రజాదరణ పొందిన మోడల్. 18 క్యారెట్ బంగారు కేసు దీని ప్రత్యేకత. డేవిడ్ బెక్‌హామ్.. వజ్రాలతో నిండిన కస్టమ్ ట్యూడర్ బ్లాక్ బే క్రోనోను ఎడమ చేతికి పెట్టుకుని వింబుల్డన్‌లో మెరిశాడు. నిక్ జోనాస్.. 1970 నాటి రోలెక్స్ డే డేట్‌ను ధరించి కనిపించాడు. ఇలా యాభై ఏళ్లనాటి వింటేజ్ వాచ్‌లు మరల కనువిందు చేస్తున్నాయి.

ఎలా ఎంచుకోవాలంటే..!

- క్లాసిక్ గడియారాలకు సంబంధించి ఒకప్పుడు అత్యంత ఆదరణ పొందిన డిజైన్లు, మోడల్స్, బ్రాండ్లను గురించి వివరంగా తెలుసుకోవాలి. వెనక్కి ప్రయాణించి శోధించే కొద్దీ అపురూపమైన వాచ్‌లు వెలుగులోకి వస్తాయి. పాత పుస్తకాలు చదవడం, వెబ్‌సైట్‌లు పరిశీలించడం, అప్పటి ప్రకటనలు లేదా మేగజైన్లు చూడడం లాంటివి ఉపకరిస్తాయి.
- ఈ వింటేజ్ వాచ్‌ల విలువ ఎక్కువగానే ఉంటుంది. కనీసం ముప్పయి వేల నుంచి కొన్ని లక్షల వరకు ఖరీదు ఉండవచ్చు. వింటేజ్ వాచ్‌ను ధరించాలంటే ముందుగా బడ్జెట్‌ను అంచనా వేసుకుని అందుకు తగ్గట్టు నిర్ణయం తీసుకోవాలి. సీకో, లాంగైన్స్, టిస్సోట్ లాంటి బ్రాండ్లు చక్కని స్టయిలిష్ వింటేజ్ వాచ్‌లను అందుబాటులో ఉంచుతున్నాయి. ప్రామాణికత పాటిస్తూ అనుభవం ఉన్న నమ్మకమైన డీలర్ల సలహా ప్రకారం వింటేజ్ వాచ్‌లు కొనుగోలు చేయడం మంచిది.



కీరదోస ప్రయోజనాలెన్నో!

నీటి శాతం ఎక్కువగా ఉండే కీరదోసను సలాడ్‌ల రూపంలో ఎక్కువగా తీసుకుంటాం. ఈ కీరదోస వలన పలు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం...

- ఊబకాయ బాధితులకు కీరదోస దివ్యౌషధం లాంటిది. ఇందులో తక్కువ క్యాలరీలు ఉండడం వలన బరువు తగ్గేందుకు బాగా ఉపయోపడుతుంది.
- కీరదోస మధుమేహాన్ని, రక్త పోటును అదుపులో ఉంచుతుంది.
- దీనిలో దాదాపు 95 శాతం నీరు ఉండడం వలన డీహైడ్రేషన్ బారి నుంచి తప్పించుకోవచ్చు.
- ఇందులోని విటమిన్ ఎ, బి, సిలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి.
- కీరదోస శరీరాన్ని నిర్విషీకరణ చేస్తుంది.



- కిడ్నీలో రాళ్లను కరిగించడంలో ఉపయోగపడుతుంది.
- శరీర ఉష్ణోగ్రత అదుపులో ఉంచుతుంది.
- ఇందులోని విటమిన్ బి అడ్రినల్ గ్రంథి పనితీరును మెరుగుపరిచి ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది.
- అలాగే కీర ముక్కలను రోజూ కళ్ల మీద పెట్టుకుంటే కళ్ల మంట, నల్లటి వలయాలు తగ్గుతాయి.

తేనె ఎక్కువగా తీసుకుంటున్నారా?

ఏదీ అతి మంచిది కాదు. ఇదే తిండి విషయంలోనూ వర్తిస్తుంది. ఆరోగ్యానికి మంచిది కదా అని ఎక్కువగా తీసుకుంటే అనర్థాలు తప్పవు. తేనెలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. తేనె రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు చర్మానికి పోషణ కూడా కల్పిస్తుంది. కానీ తేనెను అతిగా తీసుకోవడం వలన నష్టాలు కూడా జరుగతాయి. అవేంటో తెలుసుకుందాం...



- తేనె వలన రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగిపోతాయి. దీని వలన గుండె సంబంధిత వ్యాధులు తలెత్తే ప్రమాదముంది.
- తేనెలో ఫ్రక్టోజ్ అధిక మొత్తంలో ఉంటుంది. ఇది కొందరిలో తొందరగా జీర్ణమవదు. కాబట్టి తేనె ఎక్కువగా తింటే ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు తలెత్తవచ్చు.
- అధిక మొత్తంలో తేనె తీసుకోవడం వలన లోబీపీ బారిన పడే ప్రమాదముంది.
- ఒక టీస్పూన్ తేనెలోనే 64 క్యాలరీలు ఉంటాయి. కాబట్టి అధిక మొత్తంలో తేనె తీసుకుంటే అధిక బరువు పెరుగుతారు.
- తేనె తీసుకోవడం వలన దంత సమస్యలు కూడా వస్తాయి.

'మయసభ'తో మళ్లీ ఆ ఫీలింగ్ వచ్చింది



• సండే సెలబ్రిటీ

చంద్రబాబునాయుడు... వైఎస్ రాజశేఖరెడ్డి మధ్య స్నేహం, వైరంపై కొన్ని సినిమాలు వచ్చాయి. వాటినే నేపథ్యంగా తీసుకొని దర్శకుడు దేవ కట్టా 'మయసభ' అనే వెబ్‌సిరీస్ రూపొందించారు. 'సోనీ లివ్' ఓటీటీలో పలు భాషల్లో అందుబాటులో ఉన్న ఈ వెబ్ సిరీస్‌కు దేశవ్యాప్తంగా మంచి స్పందన లభిస్తోంది. తాజాగా 'ఓర్‌మ్యాక్ మీడియా లిస్ట్'లో ప్రేక్షకులు ఎక్కువగా చూసిన మూడు వెబ్ సిరీస్‌లలో ఒకటిగా నిలిచింది. ఓ తెలుగు వెబ్‌సిరీస్ టాప్3లో చోటు దక్కించుకోవడం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో దేవ కట్టాను 'నవ్య' పలకరించింది.

'మయసభ'కు వస్తున్న స్పందన చూస్తే ఎలా అనిపిస్తోంది?

చాలా ఆనందంగా ఉంది. చాలా లిబరేటింగ్‌గా కూడా ఉంది. దర్శకుడిగా నేను ఎదిగానని అనిపించింది. అన్ని వర్గాల ప్రేక్షకులకూ నేను చెప్పాలనుకున్న విషయాలను ఈ వెబ్ సిరీస్ ద్వారా సూటిగా చెప్పగలిగానని అనిపించింది. సాధారణంగా ఏదైనా సినిమా బాగుంటే, విడుదలైన వెంటనే అందరిలోనూ 'ఈ సినిమా బ్లాక్ బస్టర్' అనే ఫీల్ వస్తుంది. 'ప్రస్థానం' చిత్రం సమయంలో నాకు అలాంటి ఫీలింగ్ కలిగింది. ఇప్పుడు మళ్లీ 'మయసభ' ద్వారా అలాంటి అనుభూతే కలుగుతోంది.

ఈ కథను ఇప్పటిదాకా అనేకమంది దర్శకులు సినిమాల రూపంలో చెప్పారు. మళ్లీ దీన్నే ఎందుకు ఎంచుకున్నారు?

ఇప్పటిదాకా వచ్చిన కథలన్నీ ఒక వ్యక్తి కోణం నుంచి వచ్చాయి. అంటే ఒక వ్యక్తి హీరో అవుతాడు. అతని దృష్టికోణం నుంచి కథ నడుస్తుంది. కొందరు హీరోకి మద్దతు ఇస్తారు. మిగిలిన వారందరూ విలన్లుగా మారతారు. కానీ 'మయసభ'ను జీవిత చరిత్రల్లా చెప్పాలనుకొనలేదు. నా ఉద్దేశంలో ఇది 1970, 1980 దశకాలలో మన తెలుగు రాష్ట్ర చరిత్ర. నా తెలుగు కుటుంబ చరిత్ర. ఈ సమయంలో అనూహ్యమైన రాజకీయ పరిణామాలు ఏర్పడ్డాయి. ఇద్దరు సామాన్యమైన వ్యక్తులు స్నేహంతో కలిసి, రాజకీయంగా వేర్వేరు దారులు పట్టి, ఒకరికొకరు శత్రువులుగా మారినప్పుడు జరిగిన పరిణామాలను ఇందులో స్పృశించాను. దేశ రాజకీయాల్లో కులాన్ని వేరుగా చూడలేం. కానీ కులాన్ని ఎంతవరకు హేతుబద్ధంగా వాడుకోవచ్చు... ఆ తర్వాత అది ఎలా మారుతుందనే విషయాన్ని చెప్పటానికి ప్రయత్నించాను. కులం తప్పా... ఒప్పా అనే చర్చ ఇందులో లేదు. సైద్ధాంతికంగా ప్రారంభమైన పోరాటం వ్యక్తిగతంగా మారి ఒకరినొకరు నాశనం చేసుకొనే స్థితికి రాకూడదనేది నా ఉద్దేశం.

వెబ్‌సిరీస్‌గా ఎందుకు తీయాల్సివచ్చింది?

మొదట్లో 'మయసభ'ను వెబ్‌సిరీస్‌గా తీయాలనే ఆలోచన లేదు. 'గాడ్ ఫాదర్' మాదిరిగా మూడు పార్టులు ఉంటే బాగుంటుందనుకున్నా. మొదటి పార్టులో ఇద్దరు సమర్థులైన, చురుకైన యువకులు తమ జీవితాన్ని ఎలా ప్రారంభించారు? వేర్వేరు పార్టీలలో చేరి ఎలా ఎదిగారు? అనే విషయం ఉంటుంది. రెండో పార్టులో వారిద్దరూ ఎలా శత్రువులుగా మారారనేది ఉంటుంది. మూడో పార్టులో వారు బద్ధశత్రువులుగా ఎలా మారారు? ఒకరినొకరు ఎలా నాశనం చేసుకోవాలనుకున్నారు? అనేది ఉంటుంది. ఈ మూడు పార్టులనూ రెండుగా కుదించటానికి ప్రయత్నించాను. సినిమాగా తీస్తే వీరిద్దరి కథగానే మిగిలిపోతుందని అనిపించింది. దాంతో ఓటీటీ ఫార్మాట్ అనుకున్నాం. బడ్జెట్ కూడా ఎక్కువే అయింది. 'సోనీ' మాకు కావాల్సిన బడ్జెట్ ఇచ్చింది.

సినిమాలు... వెబ్‌సిరీస్‌లు... రెండిటిలో ఏది బెటర్?

నాకు పెద్దగా తేడా అనిపించలేదు. ఆరున్నర గంటల 'మయసభ'ను 85 రోజుల్లో పూర్తిచేశాం. సాధారణంగా సినిమాల్లో ఎక్కువ వేస్టేజ్ ఉంటుంది. ఎక్కువ తీసి కావాల్సినంతే ఉపయోగించుకుంటారు. కానీ దీనిలో మొత్తం స్క్రిప్ట్ అంతా ముందే చేతులో ఉంది కాబట్టి వేస్టేజ్ సమస్యే లేదు. అంతేకాకుండా ఇందులో విజువల్స్ ఏ కమర్షియల్ సినిమాకూ తీసిపోవు. 'మయసభ' తీసిన తర్వాత రెండు రూపాయల అవుట్‌పుట్‌ను రూపాయితోనే ఇవ్వగలననే నమ్మకం కలిగింది.

> **అందరినీ కలిపే ఏదో ఒక ఎమోషన్ లేకపోతే నేను కథ రాయలేను. మన దేశంలో కులం లేకుండా రాజకీయాలు లేవు. వీటిని సినిమాల్లో నర్మగర్భంగా చూపిస్తారు. కానీ 'మయసభ'లో సూటిగా చూపించాను. అందుకే ప్రారంభంలోనే 'స్టోరీ ఆఫ్ ఇండియా ఈజ్ స్టోరీ ఆఫ్ క్యాస్ట్' అని వస్తుంది. దీనిని ఆరున్నర గంటల సినిమా అనుకోవచ్చు. ఇందులో అందరూ హీరోలే! వారి వారి దృష్టి కోణాల్లో వారు చేసేది ఒప్పే.**

'మయసభ' మీకు నేర్పిన పాఠం ఏమిటి?



నేను నమ్మిన సిద్ధాంతాన్ని చెబితే ప్రజలు ఆదరిస్తారని తెలుసుకున్నా. నా మనసుకు నచ్చింది చేస్తే, అది అందరికీ నచ్చుతుందనే విషయాన్ని తెలుసుకున్నా. కొన్నిసార్లు కమర్షియల్ ఎలిమెంట్స్ ఉండాలని కొందరు చెబుతూ ఉంటారు. వారి మాట విని... ఆ ఎలిమెంట్స్‌ను చొప్పించాల్సి ఉంటుంది. అవి స్టోరీకి అడ్డంకి అయితే ఇబ్బంది అవుతుంది. ఉదాహరణకు కొన్నిసార్లు కమర్షియల్‌గా విజయం సాధించటం కోసం పాటలు పెడతారు. 'మయసభ'లో కూడా పాటలు ఉంటాయి. కానీ అవి కథలో భాగమే.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

పిల్లలు బడి నుంచి రాగానే..!

ఉదయాన్నే బడికి వెళ్లి సాయంత్రం ఇంటికొచ్చిన పిల్లలను తల్లిదండ్రులు రకరకాల ప్రశ్నలు అడుగుతూ ఉంటారు. ఇవాళ బడిలో ఏ పాఠాలు చెప్పారు..? నోట్స్ రాసుకున్నావా..? హోంవర్క్ ఇచ్చారా..? స్లిప్ టెస్టుల్లో మార్కులు ఎలా వస్తున్నాయి? ఇలా ఎన్ని ప్రశ్నలు అడిగినప్పటికీ పిల్లలు అన్యమనస్కంగా సమాధానాలు ఇవ్వడం మనం గమనిస్తూ ఉంటాం. బడి నుంచి రాగానే... పిల్లలను తల్లిదండ్రులు ఏమి అడగాలో తెలుసుకుందాం...

- పిల్లలు ఇంటికి రాగానే ఆ రోజంతా ఎంత ఆనందంగా గడిపారో అడిగి తెలుసుకోవాలి. స్నేహితులతో కలిసి ఆడిన ఆటలు, ఉపాధ్యాయుల పొగడ్తలు, మధ్యాహ్నం ఎవరితో కలసి భోజనం చేశారు? అన్న అంశాలు అడగాలి. పిల్లలు ఆ విషయాలన్నింటినీ గుర్తుచేసుకుంటూ ఉత్సాహంగా అన్ని విషయాలు చెప్పేస్తారు.



- కొంచెం పెద్ద పిల్లలను మాత్రం.. ఉపాధ్యాయులు లేదా తోటి విద్యార్థులతో ఏవైనా సమస్యలు ఉన్నాయేమో అడగాలి. దీనివల్ల తరగతి గదిలో పిల్లలకు ఎదురవుతున్న పలురకాల ఇబ్బందుల గురించి తెలుస్తుంది. వెంటనే ఉపాధ్యాయులతో చర్చించి పరిష్కారాలు వెతకవచ్చు.
- బడిలో ఎంతమంది స్నేహితులు ఉన్నారు? వాళ్లతో ఎలా సమయం గడుపుతున్నదీ అడగాలి. అలాగే ఉపాధ్యాయులతో అనుబంధం ఎలా ఉన్నదీ అడిగి తెలుసుకోవాలి. తరగతి గదిలో ఒంటరిగా ఉండకుండా టీచర్లకు సహాయం చేస్తూ నాయకత్వ లక్షణాలను పెంచుకునేలా పిల్లలను ప్రోత్సహించాలి.
- ఈ రోజు బడిలో ఏ కొత్త విషయం నేర్చుకున్నావు? అని అడిగితే పిల్లలు కొద్దిగా ఆలోచించడం మొదలుపెడతారు. తమకు ఎదురైన కొత్త అనుభవాలను గుర్తుచేసుకుని మరీ చెబుతారు. దీనివల్ల పిల్లల్లో సంభాషణ సామర్థ్యం పెరుగుతుంది.
- పిల్లలు బడికి వెళ్లడానికి ఇష్టపడకపోతే దానికి కారణం అడిగి తెలుసుకోవాలి. ఉపాధ్యాయులు చెబుతున్న పాఠాలు అర్థం కాకపోవడం, బోర్డు కనిపించకపోవడం, స్నేహితులు లేకపోవడం లాంటి కారణాలు ఉన్నాయేమో గమనించాలి.

• వినూత్నం

సంపాదనలో సగం మూగజీవాలకే..

కళ మీదున్న మక్కువతో ఇంజనీర్ వృత్తి నుంచి పక్కకు తప్పుకుని, ఆకట్టుకునే పింగాణీ వస్తువుల తయారీకి పూనుకుంది హైదరాబాద్‌కు చెందిన గాదిరాజు హరిప్రియ. 'ప్రాణి' స్టూడియో ద్వారా తన ఆదాయంలో సగ భాగాన్ని మూగజీవాల సేవల కోసం ఖర్చు చేస్తూ, సేవా దృక్పథాన్ని కూడా చాటుకుంటోంది. పలు రకాల పింగాణీ కళాకృతులతో వినూత్నమైన గుర్తింపును పొందుతున్న హరిప్రియ 'నవ్య'తో పంచుకున్న కబుర్లివి.

ఇంజనీరింగ్ తర్వాత ఆ రంగంలో ముందుకు వెళ్లాలని అనిపించలేదు. దాంతో మైసూర్‌లో ఎమ్‌బిఎ చేశాను. ఆ తర్వాత హెచ్‌ఆర్‌గా ఉద్యోగం చేశాను. అయినా మనసులో ఏదో వెలితి. చిన్నప్పటి నుంచి కళలంటే ఇష్టం. బొమ్మలు గీయడమంటే ఇష్టం. ఒక సందర్భంలో మట్టితో బొమ్మలు తయారుచేసే పాటరీ కళ నన్ను ఆకర్షించింది. అలా మూడేళ్ల క్రితం పాటరీ క్లాసులకు హాజరైనప్పుడు నాకు తగిన రంగం అదేనని అనిపించింది. ఆ కళలో ఎదగాలనే కోరికతో మహారాష్ట్రలో ఎంతో ప్రసిద్ధి పొందిన అన్వి పాటరీ లెర్నింగ్ సెంటర్‌లో చేరిపోయి, పాటరీలో పట్టు సాధించాను. ఆ తర్వాత ముంబయిలో సెరామిక్స్‌కు సంబంధించిన ఇంటర్న్‌షిప్ కూడా చేశాను. ఇంటికి చేరుకున్న తర్వాత చిన్న చిన్న సెరామిక్ కప్పులు, బొమ్మలు లాంటివి తయారుచేయడం మొదలుపెట్టాను. మొదట్లో స్నేహితులు, బంధువులు వాటినెంతో ఆదరించి, ప్రోత్సహించారు. మగ్స్, టేబుల్ మీద అమర్చుకునే అలంకరణ వస్తువులు, గోడకు వేలాడదీసే అలంకరణ వస్తువులు లాంటి వాటిని తయారుచేసేదాన్ని. అలా రెండేళ్ల పాటు సాధన చేసి, గత ఏడాదిగా సామాజిక మాధ్యమాల ద్వారా పూర్తి స్థాయిలో సెరామిక్ వేర్‌ను విక్రయించడం మొదలు పెట్టాను.





> మాది భీమవరం దగ్గరున్న జల్లి కాకినాడ. వ్యాపారరీత్యా చిన్నప్పుడే కుటుంబంతో పాటు హైదరాబాద్ వచ్చేశాను. నా చదువంతా ఇక్కడే సాగింది. నాన్న గాదిరాజు ప్రసాదరాజు పౌల్ట్రీ వ్యాపారం చేస్తారు. అమ్మ కుమారి, గృహిణి. మూగజీవాల పట్ల ప్రేమ ప్రతిబింబించేలా నా పాటరీ స్టూడియోకు 'ప్రాణి' అనే పేరు పెట్టుకున్నాను. ఇంజనీరింగ్ చదివేటప్పటి నుంచి జబ్బుపడిన, గాయపడిన వీధి కుక్కలకు చికిత్సలు చేయడం, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించడం లాంటివి చేస్తున్నాను. నిధులు సేకరించి వాటికి ఆహారం అందిస్తూ ఉంటాను. వేసవిలో కుక్కల కోసం నీటి పాత్రలు అందుబాటులో ఉంచుతూ ఉంటాను. కొవిడ్ సమయంలో ఇస్కాన్, కుక్కల కోసం ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రోగ్రామ్స్‌లో పాల్గొన్నాను. అలాగే నిష్కామకర్మ సంస్థ తరపున నిధులు సేకరించడంతో పాటు, పాటరీ ద్వారా ప్రతి నెలా నాకొచ్చే సంపాదనలో సగ భాగాన్ని మూగ జీవాల సేవలకే వినియోగిస్తూ ఉంటాను.

గిరాకీ ఎక్కువే!


పాటరీ క్లిష్టమైన కళ. ఎంతో మక్కువ ఉంటే తప్ప ఈ కళలో, రంగంలో రాణించడం సాధ్యపడదు. మరీ ముఖ్యంగా ముడిసరుకు, రంగులు, బట్టీలను సమకూర్చుకోవడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. కాబట్టి ప్రారంభంలో స్వయంగా ఉత్పత్తులను తయారుచేసినా, వాటిని కాల్చడం కోసం పాటరీ స్టూడియోల్లో ఉండే బట్టీలను అద్దెకు తీసుకునేదాన్ని. కొంత డబ్బు చెల్లించి వాళ్ల దగ్గరుండే బట్టీలో మన ఉత్పత్తులను కాల్చుకోవచ్చు. ఆ తర్వాత కొంత కాలానికి సొంత బట్టీ కొనుక్కోగలిగాను. అప్పటి నుంచి ఆర్డర్లు కూడా పెరిగాయి. ఇంటీరియర్ డిజైనర్లు లోగో మగ్స్, కార్పొరేట్ గిఫ్టింగ్ కోసం నా చేత ఆయా ఉత్పత్తులను తయారుచేయించుకుంటూ ఉంటారు. ఇంకొందరు పెంపుడు జంతువుల బొమ్మలు, అలంకరణ వస్తువులు తయారుచేయించుకుంటూ ఉంటారు. అలాగే కెఫేలు, రెస్టారెంట్లు టేబుల్ వేర్ పట్ల ఆసక్తిని కనబరుస్తూ ఉంటాయి. పాటరీ వర్క్‌షాప్స్ కూడా కండక్ట్ చేస్తూ ఉంటాను. నాకు ప్రకృతి అంటే ఇష్టం. కాబట్టి నేను తయారుచేసే ఉత్పత్తులు ప్రకృతిని ప్రతింబింబించేలా ఉంటాయి.

సవాళ్లూ లేకపోలేదు

ఆర్డర్లు అందుకోవడం ఒక ఎత్తైతే, వాటికి రూపాన్నిచ్చి, అంతిమ ఉత్పత్తిని రూపొందించడం మరో ఎత్తు. ఒక్కోసారి మనం అనుకున్న రూపం వచ్చిందనుకుంటాం. కానీ బట్టీలో కాల్చిన తర్వాత దాని రూపం మారిపోవచ్చు. సంతృప్తిని కలిగించకపోవచ్చు. ఒక్కో సందర్భంలో ఉత్పత్తే పగిలిపోయి, శ్రమంతా వృథా కావచ్చు. అలా ప్రారంభంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నాను. ప్రస్తుతం సెరామిక్ వేర్‌కు ఆదరణ పెరిగింది. ఇంటీరియర్ డిజైనర్లు, ఆధునిక మహిళలు, పింగాణీ పాత్రలు, వస్తువులు, బహుమతుల పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. హోటల్ రంగం కూడా వినూత్నమైన డిజైనర్ వేర్‌ను కోరుకుంటోంది. ఆహార పరిశ్రమ, ఇంటీరియర్ డెకరేషన్, డెకర్‌వేర్‌తో దగ్గరి సంబంధం ఉన్న రంగం కాబట్టి పాటరీ రంగంలో మంచి అవకాశాలున్నాయి. ఈ రంగాలు మనుగడ సాగించినంత కాలం పాటరీకి కూడా మనుగడ ఉంటుంది. ఆసక్తి, సృజనాత్మకత కలిగిన వారు ఈ రంగాన్ని ఎంచుకోవచ్చు. ఉత్పత్తులు ఎంత వినూత్నంగా ఉంటే, వాటికి ఆదరణ కూడా అంతే ఎక్కువగా ఉంటుంది. మన ఉత్పత్తులు మార్కెట్‌లో గుర్తింపు పొందేవరకూ కష్టపడగలిగితే, ఈ రంగానికి కచ్చితంగా మంచి భవిష్యత్తు ఉంటుంది.

• గోగుమళ్ల కవిత





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
అబిగైల్	తెలుగు డబ్బింగ్	ఆగస్టు 26
మెట్రో ఇన్ డినో	హిందీ చిత్రం	ఆగస్టు 29
కరాటే కిడ్: లెజెండ్స్	హాలీవుడ్ మూవీ	ఆగస్టు 30
అమెజాన్ ప్రైమ్		
అప్‌లోడ్ 4	వెబ్‌సిరీస్	ఆగస్టు 25
హాఫ్ సీఏ 2	హిందీ సిరీస్	ఆగస్టు 27
సాంగ్స్ ఆఫ్ ప్యారడైజ్	హిందీ చిత్రం	ఆగస్టు 29
జియో హాట్‌స్టార్		
రాంబో ఇన్ లవ్	తెలుగు చిత్రం	ఆగస్టు 29

ఈ ఏడాది ఆదాయంలో 20 శాతం వృద్ధి

భారత బీమా రంగంలో అపార అవకాశాలున్నాయి. అయితే ప్రజల్లో ఇప్పటికీ బీమా పట్ల అవగాహన చాలా తక్కువ. దేశంలో నూటికి 83 శాతం మందికి బీమా రక్షణ లేదు. ప్రజల్లో కొద్దిగా అవగాహన కల్పిస్తే బీమా రంగం దూసుకుపోవటం ఖాయమంటున్నారు టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఎండీ, సీఈఓ వెంకీ అయ్యర్. బీమా రంగ పనితీరు, తెలుగు రాష్ట్రాల్లో టాటా ఏఐఏ లైఫ్ కార్యకలాపాల గురించి ఆయన 'ఆంధ్రజ్యోతి బిజినెస్'తో ఇష్టాగోష్ఠిగా ముచ్చటించారు. ఆ వివరాలు..



- ఏపీ, తెలంగాణ నుంచి 7% ఆదాయం
- రూ.1.22 లక్షల కోట్లకు ఏయూఎం
- టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈఓ వెంకీ అయ్యర్

దేశంలో చాలా మందికి బీమా రక్షణ లేకపోవటానికి కారణం?

ప్రజలకు పాలసీల ప్రీమియం అందుబాటులో లేకపోవటం కంటే సరైన అవగాహన లేకపోవటం ఇందుకు ప్రధాన కారణం. ఒకవేళ అవగాహన ఉన్నా పాలసీలు తీసుకునేలా చేయటం చాలా కష్టం. అందుకే బీమా పట్ల అవగాహన కల్పించేందుకు బీమా కంపెనీలన్నీ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. భారత బీమా నియంత్రణ అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) కూడా ఇందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.

భారత జీవిత బీమా పరిశ్రమ భవిష్యత్‌పై మీ అంచనా?

దేశంలో బీమా పరిశ్రమ అభివృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయి. మన జనాభాలో ఇప్పటికీ 83 శాతం మందికి బీమా రక్షణ లేదు. ఇది బీమా రంగానికి పెద్ద అవకాశం. అయితే ఇందు కోసం కొన్ని సంస్కరణలు కూడా అవసరం. అంతేకాదు ప్రజల్లో బీమా తప్పనిసరిగా తీసుకోవాలన్న ఆలోచన వస్తే బీమా రంగం మరింత వృద్ధి పథంలోకి దూసుకుపోవటం ఖాయం. ప్రస్తుతం దేశీయ బీమా పరిశ్రమ ఏటా రెండంకెల వృద్ధి రేటు నమోదు చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) ముగిసే నాటికి బీమా రంగ మార్కెట్ రూ.20 లక్షల కోట్లకు చేరుకోవచ్చని అంచనా. ఇక జీవిత బీమా రంగం కూడా రెండంకెల వృద్ధిని నమోదు చేస్తూ వస్తోంది.

2024-25లో బీమా కంపెనీల ప్రీమియం వసూళ్లు?

2024-25 ఆర్థిక సంవత్సరంలో జీవిత బీమా కంపెనీల మొత్తం ప్రీమియం వసూళ్లు రూ.1.49 లక్షల కోట్ల నుంచి రూ.1.66 లక్షల కోట్ల వరకు ఉంది. అందులో ప్రైవేట్ కంపెనీల వాటా రూ.92,000 కోట్ల నుంచి రూ.1.04 లక్షల కోట్ల వరకు ఉంది.

గత ఆర్థిక సంవత్సరం సంస్థ ప్రీమియం వసూళ్లు?

మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో టాటా ఏఐఏ లైఫ్ ప్రీమియం ఆదాయం రూ.31,000 కోట్ల వరకు ఉంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఇది 20 శాతం ఎక్కువ. ఇందులో రూ.9,200 కోట్ల వరకు తొలిసారిగా పాలసీలు తీసుకున్న వారి నుంచి వచ్చింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సంస్థ వృద్ధి రేటు అంచనా?

ప్రీమియం ఆదాయ వృద్ధి రేటు ఈసారి కొంత స్తబ్దుగా ఉండవచ్చని భావిస్తున్నాం. గత ఆర్థిక సంవత్సరం వృద్ధి రేటు 20 శాతంగా ఉంది. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం సంస్థ క్లెయిమ్స్ సెటిల్మెంట్ నిష్పత్తి 99.3 శాతం వరకు ఉంది. ప్రస్తుతం సంస్థ నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.1.22 లక్షల కోట్లుగా ఉంది.

కొత్త పాలసీలు ఏమైనా తీసుకువస్తున్నారా?

మార్కెట్ అవసరాలను బట్టి పాలసీలు మారుతుంటాయి. ప్రస్తుతం ప్రొటెక్షన్, చిల్డ్రన్స్ సేవింగ్స్, వెల్త్ క్రియేషన్, రిటైర్మెంట్, హెల్త్‌తో సహా అన్ని రకాల పాలసీలను అందిస్తున్నాం. మహిళల కోసం ఈ మధ్యనే శుభ శక్తి పేరుతో కొత్త పాలసీ ప్రారంభించాం. మహిళల జీవిత అవసరాలు, ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పాలసీని రూపొందించాం. ప్రజల దీర్ఘకాలిక పొదుపు, రక్షణ అవసరాలను తీర్చేందుకు వీలుగా కొత్త పాలసీలు తీసుకొస్తాం.

మొత్తం ప్రీమియం వసూళ్లలో తెలుగు రాష్ట్రాల వాటా?

టాటా ఏఐఏ లైఫ్ మొత్తం ప్రీమియం వసూళ్లలో తెలుగు రాష్ట్రాల వాటా 5 నుంచి 7 శాతం వరకు ఉంది. ఏపీతో పోలిస్తే తెలంగాణ నుంచి వసూళ్లు ఎక్కువ. 2024-25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో ప్రీమియం ఆదాయం 40 శాతం వృద్ధితో రూ.1,040 కోట్ల నుంచి రూ.1,460 కోట్లకు పెరిగింది. ఏపీలో 34 శాతం వృద్ధి చెంది రూ.503 కోట్ల నుంచి రూ.675 కోట్లకు చేరుకుంది. కొత్త ప్రీమియం ఆదాయం తెలంగాణలో 61 శాతం వృద్ధితో రూ.627 కోట్లకు చేరుకోగా, ఏపీలో 31 శాతం వృద్ధి చెంది రూ.266 కోట్లకు పెరిగింది. ఈ ఏడాది జూలై నాటికి తెలంగాణలో 21,744 మంది ఏజెంట్లు ఉండగా ఏపీలో 18,801 మంది ఏజెంట్లు ఉన్నారు.

ఈక్విటీ క్యాష్ మార్కెట్లో సీఏఎస్‌కు కొత్త నియమావళి

సెబీ ప్రతిపాదన

ఈక్విటీ క్యాష్ మార్కెట్లో క్లోజింగ్ యాక్షన్ సెషన్ (సీఏఎస్)కు సెబీ కొత్త నియమావళిని ప్రతిపాదించింది. దశల వారీగా అమలు చేయనున్న కొత్త విధానంలో తొలుత అధిక లిక్విడిటీ కలిగిన డెరివేటివ్ స్టాక్స్ ముగింపు ధరను నిర్ణయించనున్నారు. తద్వారా గడించే అనుభవం ఆధారంగా అన్ని స్టాక్స్‌కు ఈ విధానాన్ని వర్తింపజేయాలని సెబీ ప్రతిపాదించింది. మార్కెట్లో ఒడుదుడుకులు తగ్గించేందుకు, పారదర్శకత పెంచేందుకు, పెద్ద ఇన్వెస్టర్లు సులువుగా ట్రేడింగ్ చేపట్టేందుకు ఇది దోహదపడవచ్చని సెబీ భావిస్తోంది. ఏదైనా షేరు ముగింపు ధరను నిర్ణయించేందుకు చివర్లో నిర్వహించే స్వల్పకాలిక ట్రేడింగ్ సెషనే సీఏఎస్. గతంలో ప్రతిపాదించిన 3.30-3.45 గంటల మధ్య 15 నిమిషాల పాటు కాకుండా ఈ సెషన్‌ను 3.15-3.35 గంటల మధ్య 20 నిమిషాల పాటు నిర్వహించాలని సెబీ తాజాగా ప్రతిపాదించింది.

బ్లాక్ డీల్ కనీస సైజు రూ.25 కోట్లకు పెంపు

బ్లాక్ డీల్ విండో ద్వారా చేపట్టే ట్రేడింగ్ కనీస ఆర్డర్ సైజును ప్రస్తుత రూ.10 కోట్ల నుంచి రూ.25 కోట్లకు పెంచాలని సెబీ ప్రతిపాదించింది. ప్రస్తుత పరిమితి 2017 నుంచి కొనసాగుతోంది. స్టాక్ ఎక్స్ఛేంజీలో కొనుగోలుదారు, విక్రేత మధ్య ఒకే లావాదేవీ ద్వారా భారీ సంఖ్యలో జరిగే షేర్ల విక్రయాన్నే బ్లాక్ డీల్ అంటారు. స్టాక్ ఎక్స్ఛేంజీలు రోజులో రెండుసార్లు కల్పించే 15 నిమిషాల ప్రత్యేక ట్రేడింగ్ విండో ద్వారానే ఈ బ్లాక్ డీల్స్ చేపట్టేందుకు వీలుంటుంది. ఇందుకోసం ఎక్స్ఛేంజీలు ఉదయం 8.45-9 గంటల మధ్య, మధ్యాహ్నం 2.05-2.20 గంటల మధ్య మరో సెషన్‌ను నిర్వహిస్తాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) 24 తేదీ

హైదరాబాద్	495	విజయవాడ	535
వరంగల్	497	గోదావరి	530
చిత్తూరు	558	విశాఖపట్నం	530
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	95	విజయవాడ	109
వరంగల్	95	గుంటూరు	109
కరీంనగర్	95	ఒంగోలు	109
మహబూబ్‌నగర్	95	చిత్తూరు	83
కర్నూలు	95	నెల్లూరు	88
విశాఖపట్నం	113	అనంతపురం	88
గోదావరి	109		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,620 ▲	93,150 ▲	1,30,000 ▲
విజయవాడ	1,00,700 ▲	96,500 ▲	1,12,000 ▼
విశాఖపట్నం	1,00,690 ▼	92,300 ▼	1,30,000 ▲
రాజమండ్రి	1,01,620 ▲	93,150 ▲	1,17,500 ▲
ప్రొద్దుటూరు	1,01,750 ▲	93,610 ▲	1,18,500 ▲
ముంబై	99,360 ▲	91,010 ▲	1,13,900 ▲

ఐటీసీతో పన్ను చెల్లింపులు.. వడ్డీ మినహాయింపు ఎప్పుడు?

ఇదీ GST



రాంబాబు గొండాల

జీఎస్‌టీలో నమోదై రిటర్న్ దాఖలు చేస్తూ పన్ను చెల్లించే వారిలో చాలా మందికి ఉండే ఆలోచన ఏమిటంటే పన్ను చెల్లింపు ఆలస్యమైనప్పటికీ ఆ మొత్తాన్ని నగదు ద్వారా కాకుండా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) ద్వారా చెల్లిస్తే ఎలాంటి వడ్డీ చెల్లించనవసరం లేదని. కానీ, ఇది కొంతవరకే నిజం. ఈ అవగాహన లోపంతో చాలా మందొ పొరపాట్లు చేస్తున్నారు. ఇలాంటి వారికి వడ్డీ చెల్లించమని నోటీసులు వస్తున్నాయి. అసలు ఈ విషయాన్ని ఎలా అర్థం చేసుకోవాలో చూద్దాం.

ఇంతకు ముందు ఉన్న విధానంతో పోలిస్తే జీఎస్‌టీలో రిటర్న్ దాఖలు చేసే పద్ధతి కొంచెం భిన్నంగా ఉంటుంది. అంటే ఆ నెలకు చెల్లించాల్సిన మొత్తం చెల్లిస్తే గానీ రిటర్న్ దాఖలు కాదు. ఉదాహరణకు ఒక వ్యక్తి రూ.50,000 పన్ను చెల్లించాల్సి ఉండగా రూ.40,000 ఐటీసీ ఉందనుకుందాం. అంటే మిగతా రూ.10,000 నగదు ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. కానీ, సమయానికి రూ.10,000 లభించక రిటర్న్ వాయిదా పడింది. ఒక నాలుగు నెలల తర్వాత తనకు నగదు సర్దుబాటు అయిన తర్వాత మొత్తం రూ.50,000తో రిటర్న్ దాఖలు చేశాడు, సకాలంలో రిటర్న్ దాఖలు చేయనందుకు తాను లేట్ ఫీజు కూడా చెల్లించాడు. అయితే ప్రభుత్వానికి సకాలంలో పన్ను చెల్లించలేదు కాబట్టి పన్ను చెల్లించాల్సిన తేదీ నుంచి చెల్లింపు జరిగిన తేదీ వరకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. మరి ఈ వడ్డీ ఎంత మీద చెల్లించాలనే దాని మీద మొదట్లో కొంత గందరగోళం ఉండేది. చెల్లించాల్సిన మొత్తం రూ.50,000 కాబట్టి ఆ మొత్తం మీద వడ్డీ చెల్లించాలి అని ఒక వాదన కాగా, రూ.40,000 సదరు వ్యక్తికి ఐటీసీ రూపంలో నిర్ణీత గడువు నాటికే అందుబాటులో ఉంది కాబట్టి నగదు రూపంలో చెల్లించిన రూ.10,000 మీద మాత్రమే వడ్డీ వర్తిస్తుందని మరొక వాదన. మొత్తానికి దీనికి సంబంధించి ప్రభుత్వం కొంత వివరణ ఇచ్చింది. సంబంధిత సెక్షన్‌ను సవరించింది. దీని ప్రకారం రిటర్న్ ఆలస్యంగా దాఖలు చేసిన సందర్భంలో ఐటీసీ ద్వారా చెల్లించిన పన్ను మేరకు ఎలాంటి వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు. అంటే నగదు ద్వారా చెల్లించిన పన్నుకు మాత్రమే వడ్డీ వర్తిస్తుంది. పై ఉదాహరణలో రూ.40,000 ఐటీసీ ద్వారా చెల్లించటం జరిగింది కాబట్టి దాని మీద వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు. కేవలం రూ.10,000 మీద మాత్రమే వడ్డీ చెల్లించాలి.

కానీ ఇక్కడ కొన్ని షరతులు ఉన్నాయి. రిటర్న్ దాఖలు చేయటం ఆలస్యమైనప్పటికీ ఆ రిటర్న్ పీరియడ్‌కు సంబంధించిన వివరాలు అన్నీ ఆ రిటర్న్‌లో కచ్చితంగా చూపాలి. ఉదాహరణకు ఒక వ్యాపారస్తుడు జనవరి నెలలో రూ.లక్ష అమ్మకాలు జరిపాడు. దానికి గాను రూ.12,000 పన్ను చెల్లించాలనుకుందాం. ఈ రూ.12,000కు గాను తన దగ్గర రూ.14,000 ఐటీసీ ఉంది. పన్ను చెల్లింపు మొత్తానికి ఐటీసీ సరిపోతుంది కాబట్టి నగదులో ఎలాంటి చెల్లింపులు అవసరం లేదు. అయితే జనవరి నెల రిటర్న్ ఏదో కారణంతో సకాలంలో ఫైల్ చేయకుండా ఒక రెండు నెలల తర్వాత వేసాడనుకుందాం. అయినప్పటికీ, ఆ రిటర్న్‌లో జనవరిలో జరిపిన రూ.లక్ష అమ్మకాలు మొత్తం చూపి, దానికి సంబంధించిన పన్నును నగదు ఉపయోగించకుండా ఐటీసీ ద్వారా చెల్లిస్తే ఎలాంటి వడ్డీ కట్టనవసరం లేదు. అలాకాకుండా అదే జనవరి రిటర్న్ సకాలంలో దాఖలు చేసి రూ.లక్షకు గాను రూ.60,000 అమ్మకాలు మాత్రమే చూపి మిగతా రూ.40,000 అమ్మకాలు ఫిబ్రవరి నెల రిటర్న్‌లో కలిపి చూపితే ఐటీసీ సరిపోను ఉన్నప్పటికీ వడ్డీ మినహాయింపు రాదు.

ఎందుకుంటే రూ.40,000 జనవరికి సంబంధించినవి కాబట్టి. అంటే పన్ను చెల్లింపు ఆలస్యమైనప్పటికీ సంబంధిత రిటర్న్ ఏ పీరియడ్‌కు అయితే దాఖలు చేస్తున్నారో, ఆ పీరియడ్‌లో జరిపిన సరఫరాల వివరాలు అన్నీ చూపి తగిన పన్ను చెల్లించాలి. అలా చెల్లించినప్పుడు మాత్రమే ఐటీసీ ద్వారా జరిపిన చెల్లింపునకు వడ్డీ మినహాయింపు లభిస్తుంది. ఇంకొక షరతు ఏమిటంటే, రిటర్న్ దాఖలు చేయటమనేది అధికారులు చర్యలు తీసుకోవటానికి పూర్వమే జరిగి ఉండాలి. అప్పుడు మాత్రమే ఈ వడ్డీ మినహాయింపు లభిస్తుంది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

స్పోర్ట్స్



ఏపీఎల్ చాంపియన్ తుంగభద్ర వారియర్స్

ఫైనల్లో అమరావతి రాయల్స్‌పై విజయం

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్-4 ట్రోఫీని తుంగభద్ర వారియర్స్ కైవసం చేసుకుంది. ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో శనివారం జరిగిన ఫైనల్లో తుంగభద్ర వారియర్స్ ఐదు వికెట్ల తేడాతో అమరావతి రాయల్స్‌పై గెలుపొందింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన అమరావతి రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 194 పరుగులు చేసింది. కెప్టెన్ హనుమ విహారి (37 బంతుల్లో 4 ఫోర్లు, సిక్సర్‌తో 51) అర్ధ సెంచరీ సాధించగా.. మన్యాల ప్రణీత్ (22 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 47) ఫర్వాలేదనిపించాడు. వీరిద్దరు కలిసి తొలి వికెట్‌కు 70 పరుగులు జోడించారు. పాండురంగ రాజు (22), రాహుల్ (17), వినయ్ (17) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. తుంగభద్ర బౌలర్లలో కేవీ శశికాంత్ 3 వికెట్లు పడగొట్టగా.. స్టీఫెన్ 2, సిద్ధార్థ ఒక వికెట్ తీశారు. అనంతరం తుంగభద్ర వారియర్స్ 18 ఓవర్లలో ఐదు వికెట్లకు 195 పరుగులు చేసి గెలుపొందింది. ఓపెనర్ జ్ఞానేశ్వర్ (46 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 66), వన్‌డౌన్ బ్యాటర్ గుత్తా రోహిత్ (28 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్సర్లతో 63) అర్ధ సెంచరీలతో చెలరేగారు. ఆ తరువాత దత్తా రెడ్డి (12 బంతుల్లో 3 ఫోర్లు, సిక్సర్‌తో 25), ఆనంద జోసయ్య (14 నాటౌట్) ఆఖర్లో అదరగొట్టారు. రాయల్స్ బౌలర్లలో అయ్యప్ప, విహారికి చెరో రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా జ్ఞానేశ్వర్ నిలిచాడు. విజేత తుంగభద్ర వారియర్స్‌కు ట్రోఫీతోపాటు రూ.35 లక్షలు ప్రైజ్‌మనీ దక్కగా.. రన్నరప్ అమరావతి రాయల్స్ జట్టుకు రూ.20 లక్షలు లభించాయి. ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) అధ్యక్షుడు కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, ఏసీఏ కార్యదర్శి దండమూడి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై ఆటగాళ్లకు ట్రోఫీలు అందజేశారు.

మిక్స్‌డ్‌లో భారత్‌కు స్వర్ణం

షిమ్‌కెంట్ (కజకిస్థాన్): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో శనివారం భారత్‌కు స్వర్ణం లభించింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఈవెంట్ ఫైనల్లో ఎలవెనిల్ వలరివన్/అర్జున్ ద్వయం 17-11తో చైనా జోడీ డింగ్/జిన్‌లూ పెంగ్‌ను ఓడించింది. జూనియర్ విభాగం10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ కేటగిరీలో శాంభవి/నరేన్ ద్వయం స్వర్ణం నెగ్గింది.

ఆర్చరీలో గణేష్ బృందానికి పసిడి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రపంచ ఆర్చరీ యూత్ చాంపియన్‌షిప్‌లో తెలుగు ఆర్చర్లు సత్తా చాటారు. కెనడాలో జరిగిన అండర్-21 కాంపౌండ్ టీమ్ విభాగం ఫైనల్లో ఏపీ ఆర్చర్ గణేష్ మణిరత్నం, కుషాల్, నితిన్‌తో కూడిన భారత బృందం స్వర్ణం అందుకుంది.



ఎవరిదో ఆఖరి పంచ్?

జొకోవిచ్



సినర్ అల్కారజ్

సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్ నేటినుంచే

- ఫేవరెట్లు సినర్, అల్కారజ్
- 25వ గ్రాండ్‌స్లామ్‌పై జొకోవిచ్ గురి

న్యూయార్క్: పురుషుల డిఫెండింగ్ చాంపియన్ యానిక్ సినర్, రెండో సీడ్ కార్లోస్ అల్కారజ్ యూఎస్ ఓపెన్‌లో మరోసారి ఫేవరెట్‌లుగా బరిలోకి దిగనున్నారు. ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో సినర్‌పై అల్కారజ్ గెలిస్తే.. వింబుల్డన్‌లో అల్కారజ్‌కు సినర్ షాకిచ్చాడు. మరి.. ఆదివారం నుంచి జరిగే ఈ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్‌లో ఎవరిది పైచేయిగా అవుతుందో చూడాలి. అయితే, రెండో పార్శ్వంలో ఉన్న అల్కారజ్‌కు మెద్వెదెవ్, నొవాక్ జొకోవిచ్ రూపంలో కఠిన సవాల్ ఎదురవనుంది. మెయిన్ డ్రాలో తొలి రౌండ్‌లో రిల్లీ ఓప్లేకాతో కార్లోస్ తలపడనున్నాడు. క్వార్టర్స్‌లో మాజీ చాంపియన్ మెద్వెదెవ్‌ను ఎదుర్కోవాల్సి రావచ్చు. మరోవైపు ఏడోసీడ్ జొకోవిచ్ తన 25వ గ్రాండ్‌స్లామ్ కలను నెరవేర్చుకోవాలనే పట్టుదలతో ఉన్నాడు. ఒకవేళ జొకో, అల్కారజ్ ఇద్దరూ ముందుకు సాగితే.. సెమీస్‌లో ఒకరితో ఒకరు తలపడాల్సి ఉంటుంది. గతంలో ఇద్దరి ముఖాముఖిలో జొకో 5-3తో కార్లోస్‌పై పైచేయిగా నిలిచాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్స్‌లో కూడా అల్కారజ్‌ను నొవాక్ ఓడించాడు. మరోవైపు టాప్ సీడ్ సినర్.. తొలి రౌండ్‌లో విట్ కోప్రివా (చెక్)తో ఆడనున్నాడు. అయితే, క్వార్టర్స్‌లో గతేడాది సెమీఫైనలిస్ట్ జాక్ డ్రేపర్‌తో ఆడే చాన్సున్న సినర్‌కు సెమీస్‌లో మూడో సీడ్ జ్వెరెవ్ రూపంలో ముప్పుపొంచి ఉండొచ్చు. నాలుగో సీడ్ టేలర్ ఫ్రిట్జ్, ఐదో సీడ్ డ్రేపర్, బెన్ షెల్టన్, కచనోవ్ కూడా టైటిల్ వేటలో ఉన్నారు.

సబలెంక టైటిల్ నిలబెట్టుకొనేనా?



మహిళల సింగిల్స్ డిఫెండింగ్ చాంప్ అరియానా సబలెంక సరికొత్త రికార్డు సృష్టించాలనుకొంటోంది. 2014లో సెరెనా విలియమ్స్ తర్వాత వరుసగా రెండోసారి యూఎస్ ఓపెన్ నెగ్గిన క్రీడాకారిణిగా నిలవాలనే పట్టుదలతో ఉంది. అయితే, రెండో సీడ్ స్వియటెక్, మూడో సీడ్ కొకొ గాఫ్ నుంచి సబలెంకకు సవాల్ ఎదురవనుంది. మిగతా సీడెడ్ స్టార్లు జెస్సికా పెగుల, ఆండ్రీవ, పవోలిని, రిబకినా గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. వింబుల్డన్ నెగ్గిన జోరు మీదున్న స్వియటెక్ మరో గ్రాండ్‌స్లామ్‌తో సీజన్‌ను ఘనంగా ముగించాలనుకొంటోంది. మొదటి రౌండ్‌లో రెబెక్కాతో సబలెంకా, ఎమిలియానాతో స్వియటెక్ ఆడనున్నారు. కొకొ గాఫ్ కూడా సొంతగడ్డపై గ్రాండ్‌స్లామ్‌తో మెరవాలనుకొంటోంది. ఇక, వైల్డ్‌కార్డ్‌తో ఎంట్రీ ఇస్తున్న 45 ఏళ్ల వీనస్ విలియమ్స్ తొలి రౌండ్‌లో ముచోవాతో తలపడనుంది.



ప్రేమ ప్రయాణం అలా మొదలైంది..

న్యూఢిల్లీ: టీమిండియా క్రికెటర్ రింకూసింగ్, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన లోక్‌సభ సభ్యురాలు ప్రియా సరోజ్‌ల ఎంగేజ్‌మెంట్ జూన్ 8న లఖ్‌నవూలో ధూంధాంగా జరిగింది. అయితే వీరిద్దరి పరిచయం ఎలా ఏర్పడిందనే విషయం ఇప్పటివరకు ఎవరికీ తెలియదు. కానీ ఆ సస్పెన్స్‌కు రింకూనే స్వయంగా తెరదించాడు. 'కొవిడ్ సమయంలో 2022 ఐపీఎల్ ముంబైలో జరిగిన సందర్భంగా ప్రియతో పరిచయం ఏర్పడింది. నాకో ఫ్యాన్ పేజీ ఉండేది. తన గ్రామంలో ఓటింగ్‌కు సంబంధించిన ఓ ఫొటోను ప్రియ అందులో పోస్ట్ చేసింది. ఆ ఫొటో చూడగానే..నాకు ఆమె పర్‌ఫెక్ట్‌గా మ్యాచ్ అవుతుందని భావించా. దాంతో ఆమెకు మెసేజ్ చేయాలని అనుకున్నా. కానీ బాగుండదని ఆ ఆలోచన విరమించుకున్నా. అయితే తర్వాత ఇన్‌స్టాలో నా ఫొటోలను చూసి ఆమె ఇష్టపడింది. దాంతో నేను ఆమెకు మెసేజ్ చేశా. క్రమంగా మాటలు మొదలయ్యాయి. అలా మా ఇద్దరి మధ్య ప్రేమ మొదలైంది' అని రింకూ వివరించాడు.

దక్షిణాఫ్రికాలో 44 మ్యాచ్‌లు

వన్డే వరల్డ్‌కప్ వేదికల ఖరారు

జొహాన్నెస్‌బర్గ్: రెండేళ్ల తర్వాత జరిగే పురుషుల వన్డే వరల్డ్‌కప్ వేదికలను క్రికెట్ సౌతాఫ్రికా (సీఎస్ఏ) ఖరారు చేసింది. 2027లో జరిగే ఈ మెగా టోర్నీకి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. దీంట్లో భాగంగా మొత్తం 54 మ్యాచ్‌లు జరుగుతాయి. అయితే అత్యధికంగా 44 మ్యాచ్‌లకు సౌతాఫ్రికాలోని జొహాన్నెస్‌బర్గ్, ప్రిటోరియా, కేప్‌టౌన్, డర్బన్, గెబెరా, బ్లూమ్‌ఫోంటీన్, ఈస్ట్ లండన్, పార్ల్ వేదికలుగా ఉండనున్నాయి. మిగిలిన పది మ్యాచ్‌లు జింబాబ్వే, నమీబియాలో నిర్వహిస్తారు. ఇందులో రెండు గ్రూపులుగా మొత్తం 14 జట్లు పాల్గొంటాయి.

లార్డ్స్‌లో విరాట్ ప్రాక్టీస్



లండన్: స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ప్రస్తుతం కుటుంబంతో కలిసి లండన్‌లో గడుపుతున్నాడు. అయితే అక్టోబరులో భారత వన్డే జట్టు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. ఈ నేపథ్యంలో విరాట్ తీవ్రంగా ప్రాక్టీస్ సాగిస్తున్నాడు. శనివారం అతను ప్రఖ్యాత లార్డ్స్ మైదానంలోని ఇండోర్ నెట్స్‌లో రెండు గంటలపాటు సాధన చేశాడు. ఈ క్రమంలో విరాట్ స్పిన్, పేస్ బౌలింగ్‌ను ఎదుర్కొన్నాడు. టీ20, టెస్టుల నుంచి వైదొలిగిన కోహ్లీ కేవలం వన్డేలకు పరిమితమైన విషయం తెలిసిందే.


గాయత్రి, రాజేష్‌కు పతకాలు

ఖేలో వాటర్ స్పోర్ట్స్




హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): శ్రీనగర్‌లో జరిగిన ఖేలో ఇండియా వాటర్ స్పోర్ట్స్‌లో తెలుగు క్రీడాకారులు పతకాలు కొల్లగొట్టారు. కనోయింగ్- కయాకింగ్‌లోని కెనో స్లాలోమ్ కె1 విభాగంలో కృష్ణా జిల్లాకు చెందిన గాయత్రి రజతం, రాజేష్ కాంస్యం సాధించారు.

భారత్‌లో మెస్సీ విన్యాసాలు — కేరళలో అర్జెంటీనా జట్టు పోరు



న్యూఢిల్లీ: ఫుట్‌బాల్ సూపర్ స్టార్ లియోనెల్ మెస్సీ అద్భుత విన్యాసాలను భారత ప్రేక్షకులు ప్రత్యక్షంగా చూసే అవకాశం రానుంది. ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్ కోసం నవంబరులో అర్జెంటీనా జట్టు కేరళకు రాబోతోంది. ఈ విషయాన్ని అర్జెంటీనా ఫుట్‌బాల్ సంఘం కూడా ధ్రువీకరించింది. అయితే, ఆ జట్టు ఎవరితో మ్యాచ్ ఆడుతుందనేది స్పష్టం చేయలేదు. కాగా, నవంబరు 10-18 మధ్య అర్జెంటీనా మ్యాచ్ ఉండే అవకాశముందని కేరళ క్రీడామంత్రి అబ్దుర్ రహిమాన్ వెల్లడించారు. 'లియోనెల్ మెస్సీ నేతృత్వంలో అర్జెంటీనా జట్టు ఈ ఏడాది అక్టోబరులో యూఎస్ఏ, నవంబరులో భారత్ పర్యటనలో రెండు ఫ్రెండ్లీ మ్యాచ్‌లను ఆడనుంది' అని అర్జెంటీనా ఫుట్‌బాల్ సమాఖ్య పేర్కొంది. మరోవైపు మెస్సీ మూడు రోజుల పర్యటన కోసం డిసెంబరులో భారత్‌కు రానున్నాడని ఇటీవల వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, అర్జెంటీనా ఫుట్‌బాల్ సమాఖ్య తాజా ప్రకటనతో అంతకంటే ముందే మెస్సీ భారత్ రావడం ఖాయమైంది.



షరపోవాకు అరుదైన గౌరవం

టెన్నిస్ మాజీ స్టార్ మరియా షరపోవా, డబుల్స్ మాజీ నెంబర్‌వన్ జోడీ, బ్రయాన్ బ్రదర్స్‌కు టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కింది. ఆదివారం జరిగే కార్యక్రమంలో వీరి పేర్లను దిగ్గజాల సరసన చేర్చనున్నారు. 2004 వింబుల్డన్‌లో సెరెనాను ఓడించి ఓవర్‌నైట్ స్టార్‌గా మారిన షరపోవా.. 2006లో యూఎస్ ఓపెన్, 2008లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌తోపాటు రెండు ఫ్రెంచ్ ఓపెన్ టైటిళ్లు సాధించింది. నెం.1 ర్యాంక్‌ను అందుకొన్న తొలి రష్యన్ ప్లేయర్‌గా చరిత్ర సృష్టించింది. 2020లో రిటైర్మెంట్ ప్రకటించింది. డబుల్స్ సోదరులు బాబ్, మైక్ బ్రయాన్‌లు 2012 ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించారు. 438 వారాలపాటు నెం.1 ర్యాంక్‌లో నిలిచారు.

30న విశాఖలో మహిళల నిరాహార దీక్ష: కేసన



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేసన శంకరరావు

మంగళగిరి సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బీసీ మహిళలకు సబ్ కోటా ఇస్తూ మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణ చేసిన తర్వాతే అమలు చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 30వ తేదీన విశాఖపట్నంలో మహిళల నిరాహార దీక్ష చేపడుతున్నట్టు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. జాతీయ స్థాయిలో జనగణనలో కులగణన జరిగి, ఆపై నియోజకవర్గాల పునర్విభజన చేసిన అనంతరమే మహిళా రిజర్వేషన్లను అమలు జరపాల్సి ఉందన్నారు. మహిళా రిజర్వేషన్లను దేశంలోని అన్ని వర్గాల మహిళలతో కలిపి 33 శాతం ఇవ్వడం వలన, బలహీన వర్గాలకు చెందిన ఓబీసీ మహిళలకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. 30న విశాఖలో జరిగే నిరాహార దీక్షలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



ఎస్కే యూనివర్సిటీలో మియావాకి వనం





ఎస్కే యూనివర్సిటీలో నీటి కొలను, పువ్వులు

విశ్వవిద్యా 'వనం'

(మొదటి పేజీ తరువాయి)

అడవిని అభివృద్ధి చేస్తున్నారు. నక్షత్రవనం, శీలావనం, రాక్ గార్డెన్.. ఇలా వివిధ పేర్లతో ఎకరం, అర ఎకరం ప్రాంతంలో రకరకాల మొక్కలు పెంచుతున్నారు. అంతేగాక ఇతర ప్రాంతాలకూ మొక్కలను పంపిణీ చేస్తున్నారు.

26 సెక్టార్లుగా విభజన..

బొటానిక్ గార్డెన్‌ను 26 సెక్టార్లుగా విభజించి మొక్కలు పెంచుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మర్రి జాతుల ఫైక్టోరియం ఏర్పాటు చేశారు. ఇందులో 35 రకాల మర్రిజాతుల మొక్కలను నాటారు. ఇక్కడ రాష్ట్రంలోని 25 వన్య జాతులు ఉండటం విశేషం. హైదరాబాద్ ప్రగతి సుధామి సంస్థ ద్వారా శాస్త్రీయంగా నక్షత్రవనాన్ని నెలకొల్పారు. 9 గ్రహాలు, 12 రాశులు, 27 నక్షత్రాలకు గుర్తుగా ప్రాచీన కాలంలో గుర్తింపు పొందిన మొక్కలు నాటారు. ఖగోళ ఆకృతితో 360 డిగ్రీలలో వనాన్ని ఏర్పాటు చేశారు. అన్ని ఔషధ విలువలు కలిగిన మొక్కలు నాటారు. ఉదాహరణకు సూర్యుడికి ప్రతీకగా ఆర్కా(తెల్లజిల్లేడు) వంటి మొక్కలను నాటారు. ఇతర ప్రాజెక్టుల ద్వారా నర్సరీలను ఏర్పాటు చేసి విశిష్టమైన జాతులను పెంచుతున్నారు. గార్డెన్‌లో చెట్లతో నిండి ఉండే ఐదు ఆర్బోరిటాలను ఏర్పాటు చేశారు. వనంగా పెరిగే అలంకరణ మొక్కలు, వివిధ రకాల పూలమొక్కల ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు. సగానికి పైగా పూలు, పండ్ల మొక్కలను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఎర్రచందం, తెల్లచందం, గాలి బుడగ, వెర్రిచల్ల, కొండ సాంబ్రాణి, పేశీత, రాతి జావ్వి, బిల్లుడు వంటి అనేక రకాల వృక్ష జాతులను పెంచుతున్నారు. 2016లో సహజ సిద్ధంగా పెరుగుతున్న ఆస్పరగేసే కుటుంబానికి చెందిన డిప్‌కాడి జాతిని శ్రీకృష్ణదేవ రాయ పేరుతో ఆవిష్కరించారు.

మియావాకి వనం

విద్యాలయంలోని బొటానిక్ గార్డెన్‌లో అతి ముఖ్యమైనది మియావాకి వనం. ఇది జపాన్ వృక్షశాస్త్రజ్ఞుడు అకిరా అభివృద్ధి చేసిన అటవీ పద్ధతి. ఈ పద్ధతిలో దట్టమైన అడవులను సృష్టించారు. ఈ పద్ధతిలో మొక్కలు, పొదలను దగ్గర దగ్గరగా నాటుతారు. ఇదే తరహాలో వర్సిటీ గార్డెన్‌లో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పచ్చదనం-సుందరీకరణ సంస్థ ఆధ్వర్యంలో 2018లో మియావాకి వనం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇక్కడ స్వల్ప మార్పులు చేశారు. చెట్లకు ఒక మీటరు దూరం ఉండేలా 2019 నవంబరులో 152 రకాల వృక్ష జాతులకు సంబంధించిన 1500 మొక్కలను నాటారు. ప్రొఫెసర్ రవి ప్రసాద్‌రావు నేతృత్వంలో మొక్కల పర్యవేక్షణ చేపట్టారు. మొక్కల్లో పోటీతత్వం, నీడ వంటి ఇతరత్రా కారణాలతో 30 జాతులు అంతరించిపోయినట్లు వర్సిటీ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వాటి స్థానంలో మరో 25 జాతుల మొక్కలను తిరిగి నాటారు. మొదటి రెండేళ్లు వనంలోని మొక్కల పెంపకానికి అవస్థలు పడినట్లు అధికారులు చెబుతున్నారు. స్థానికంగా లభిస్తున్న నీటితోనే డ్రిప్ పద్ధతిలో మొక్కలను పెంచుతున్నారు. ప్రస్తుతం 145 రకాల జాతుల మొక్కలు, చెట్లతో దట్టమైన వనంగా రూపొందింది.

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా..

అనంతపురం జిల్లా పరిస్థితులు విభిన్నమైనవి. ఇక్కడ నీటి కష్టాలు నిత్యం వెంటాడుతూనే ఉన్నాయి. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వర్సిటీలో మొక్కల పెంపకం చేపట్టారు. వర్షపు నీరు వృథా పోకుండా కుంటలను ఏర్పాటు చేశారు. వర్సిటీలో కురిసిన వర్షపు నీరు కుంటల్లోకి వెళ్లేలా చేశారు. గార్డెన్ కోసం ప్రత్యేకంగా సంపును ఏర్పాటు చేశారు. వేసవికాలంలో మొక్కలు, చెట్లకు డ్రిప్ పద్ధతి ద్వారా నీటి తడులు అందిస్తున్నారు. దీంతో మొక్కలు, చెట్లతో వర్సిటీ అడవిని తలపిస్తోంది. మంచి ఆహ్లాదాన్ని పంచుతోంది. పక్షులను ఆకర్షిస్తోంది.

జీవ వైవిధ్యాన్ని ప్రతిబింబించేలా..



విశ్వవిద్యాలయంలోని బొటానిక్ గార్డెన్‌ను జీవ వైవిధ్యాన్ని ప్రతిబింబించేలా ఏర్పాటు చేశాం. మొక్కల జాతులను విద్యార్థులు, వృక్ష ప్రేమికులు అధ్యాయనం చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేశాం. గార్డెన్‌లో 300 టన్నులకు పైగా కర్బన్‌శోషణం జరిగింది. భూతాపాన్ని తగ్గించే విధంగా ఈ పచ్చదనాన్ని వృద్ధి చేస్తున్నాం. ఈ క్రమంలో ఎన్నో రకాల పక్షులు, జంతుజాలానికి వసతి, ఆహారాన్ని అందిస్తున్నాం.

- ఆచార్య రవి ప్రసాద్‌రావు, బొటానిక్ గార్డెన్ డైరెక్టర్, ఎస్కే యూనివర్సిటీ

హెర్బల్ గార్డెన్‌కు ప్రతిపాదనలు



ఎస్కే యూనివర్సిటీలో 25 శాతం భూమి పచ్చదనంతో నిండి ఉంది. బొటానిక్ గార్డెన్ ప్రారంభం నుంచి ప్రతి వీసీ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. నేను వీసీగా పనిచేసిన ఈ ఏడాది కాలంలో వర్సిటీలో 1200 మొక్కలు నాటించి సంరక్షిస్తున్నాం. వర్సిటీ నుంచి గార్డెన్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. రానున్న రోజుల్లో హెర్బల్ గార్డెన్ ఏర్పాటుకు కృషి చేస్తాం.

- ఆచార్య అనిత, వీసీ, ఎస్కే యూనివర్సిటీ

బొటానిక్ గార్డెన్..



ఎస్కే యూనివర్సిటీలో బొటానిక్ గార్డెన్ వివరాలు తెలిపే బోర్డు

విశ్వవిద్యాలయం 500 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇందులో దశాబం నుంచి మొక్కల పెంపకం విరివిగా సాగుతోంది. 2012 వరకు వర్సిటీ ప్రాంగణంలో ఏడు వేల మొక్కలు, చెట్లు ఉండేవి. గడిచిన పదేళ్లలో ఈ సంఖ్య 22 వేలకు చేరింది. ముఖ్యంగా బొటానిక్ గార్డెన్ పేరిట మొక్కల పెంపకం సాగుతోంది. 2013లో ఆంధ్రప్రదేశ్ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు సౌజన్యంతో మోడల్ నర్సరీలో భాగంగా మూడెకరాల్లో బొటానిక్ గార్డెన్ ఏర్పాటు చేశారు. ఇందులో 1.5 లక్షల మొక్కల పెంపకం చేపట్టారు. వాటిని వివిధ ప్రాంతాలకు పంపిణీ చేశారు. ఆ తరువాత 2018లో మరో మూడు ఎకరాలకు గార్డెన్‌ను విస్తరించి, వివిధ రకాల మొక్కల పెంపకం చేపట్టారు. 2021 నాటికి మరో ఆరు ఎకరాలను గార్డెన్‌కు కేటాయించడంతో పాటు మొక్కల పెంపకాన్ని మరింతగా చేపట్టారు.

(అనంతపురం రూరల్, ఆంధ్రజ్యోతి)



అఖిల భారత ఫెన్సింగ్ అసోసియేషన్ సభ్యులతో డాక్టర్ సుగుణారెడ్డి

అఖిల భారత ఫెన్సింగ్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా సుగుణారెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

కాకినాడ రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అఖిల భారత ఫెన్సింగ్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నైనిటాల్‌లో జరిగిన అఖిల భారత ఫెన్సింగ్ అసోసియేషన్ ఎన్నికల్లో సంఘ అధ్యక్షులు రాజీవ్ మెహతా, పలు రాష్ట్రాల ఫెన్సింగ్ ప్రతినిధుల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొనగా సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ సుగుణారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ఏపీ ఉత్తమ స్థానంలో నిలిచేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. సుగుణారెడ్డిని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి అభినందించారు.

నరసాపురాన్ని జిల్లా కేంద్రం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే బండారు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బండారు, టీడీపీ నాయకులు

నరసాపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్వవస్థీకరణ ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో నరసాపురాన్ని జిల్లా కేంద్రం చేయాలంటూ స్థానికుల నుంచి డిమాండ్ వస్తోంది. ఈ దిశగా మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు ఆధ్వర్యంలో వైద్యులు, వ్యాపారులు, న్యాయవాదులు, విద్యాసంస్థల యజమానులు, వివిధ పార్టీల నాయకులు, కార్మికులు శనివారం తొలి అడుగు వేశారు. రాయపేటలోని ఆయన నివాసం నుంచి జనసేన పార్టీ కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ విప్ నాయకర్‌ను కలిశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం, కమిటీ దృష్టికి తీసుకెళ్లి నరసాపురానికి న్యాయం జరిగేలా చూడాలని వినతిపత్రం అందించారు. మాధవనాయుడు మాట్లాడుతూ భౌగోళికంగా అన్ని అనుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ గత ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం కారణంగా నరసాపురానికి అన్యాయం జరిగిందన్నారు. దీనికి మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఓ కారణమని ఆరోపించారు. 'జిల్లా ఉద్యమంలో నేను పాల్గొన్నా. ప్రజల మనోభావాలు నాకు తెలుసు. దీని కోసం నా వంతు కృషి చేస్తాన'ని నాయకర్ హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రం సాధనకు అంతా కలిసి ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు.

పోలీసుల అదుపులో వైసీపీ పెయిడ్ ఆర్టిస్ట్

- దివ్యాంగుల పింఛన్ ఫేక్ వీడియోపై కేసు



వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త రమేశ్

పుట్టపర్తి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడు అయిన తనకు పింఛన్ తొలగించారని కూటమి ప్రభుత్వంపై విషం కక్కుతూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త పి.రమేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం పోలీస్ స్టేషన్‌లో అతడిపై కేసు నమోదైంది. బుక్కపట్నం మండలం నార్సింపలికి చెందిన రమేశ్.. ఒక చేతిని చొక్కాలో దాచుకుని సెల్ఫీ వీడియోను పోస్టు చేశాడు. అతడికి రెండు చేతులు ఉన్న విషయం వెల్లడి కావడంతో పరారయ్యాడు. టీడీపీ నేతల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విచారించి తదుపరి చర్యలు తీసుకుంటామని బుక్కపట్నం ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

కార్మిక శాఖ జాయింట్ కమిషనరు అరెస్టు

- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో కీలక డాక్యుమెంట్లు, అర కిలో బంగారం స్వాధీనం



బాలు నాయక్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులున్న కేసులో కర్నూలు కార్మిక శాఖ జాయింట్ కమిషనరు బాలు నాయక్‌ను ఏసీబీ అధికారులు శనివారం తిరుపతిలో అరెస్టు చేశారు. అనంతరం నెల్లూరులోని అవినీతి నిరోధక శాఖ కోర్టుకు తరలించారు. ఆయనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో కర్నూలులోని కార్యాలయం, అద్దె ఇల్లు, తిరుపతిలోని ఇల్లు, అన్నమయ్య జిల్లాలో ఏడు చోట్ల శుక్ర, శనివారాల్లో ఏసీబీ తనిఖీలు జరిగాయి. తిరుపతి ప్రాంతీయ అవినీతి నిరోధక శాఖ అదనపు ఎస్పీ విమలకుమారి నేతృత్వంలో జరిగిన ఈ సోదాల్లో డాక్యుమెంటు విలువ ప్రకారం రూ.ఐదారు కోట్ల ఆస్తులున్నట్లు గుర్తించారు. వాటి మార్కెట్ విలువ రూ.50 కోట్ల వరకు ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు. స్థిర, చరాస్తులకు సంబంధించి కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. దాదాపు అర కిలో బంగారు నగలు, కిలో వెండి వస్తువులు, దాదాపు రూ.5.5 లక్షల నగదు సీజ్ చేశారు. ఆయనతో పాటు కుటుంబ సభ్యుల పేర్ల మీద వివిధ ప్రాంతాల్లోని 18 బ్యాంకు ఖాతాలను సీజ్ చేశారు. బ్యాంకు లాకర్లలోని బంగారు నగలు, నగదు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల వివరాల కోసం బ్యాంకు మేనేజర్లకు లేఖలు రాశారు.

టంగుటూరికి సీఎం నివాళి

అమరావతి ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తెలుగువారిలో స్వాతంత్ర్య కాంక్షను రగిలించిన ధీరోదాత్తుడు, త్యాగధనుడు, తెలుగు జాతి సాహసానికి ప్రతీక టంగుటూరి ప్రకాశం పంతులు అని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా సీఎం క్యాంపు కార్యాలయంలో ప్రకాశం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రగతికి బాటలు పరిచిన ప్రకాశాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సీఎం పేర్కొన్నారు.

దోపిడీదారులకు జగన్ ఆశీస్సులు

- వైసీపీకి ప్రజలు రాజకీయ సమాధి కట్టడం తథ్యం: చింతమనేని

అమరావతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వైసీపీకి ప్రజలు రాజకీయ సమాధి కట్టే రోజు దగ్గరలోనే ఉందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. 'దోపిడీదారులకు జగన్, వైసీపీ నేతలు ఆశీస్సులు అందిస్తున్నారు. అందుకే జైలు యాత్రలు, దోపిడీ దొంగల పరామర్శలు చేస్తున్నారు. తాను చేసిన దోపిడీకి భార్యను కేసులో ఇరికించి, ఎక్కడ అరెస్టు చేస్తారోనన్న భయంతో పారిపోయిన పేర్ని నాని కూడా చంద్రబాబు, లోకేశ్, పవన్‌పై నోరు పారేసుకుంటున్నాడు. చేపల దొంగతనానికి పాల్పడ్డ మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరికి మద్దతుగా జగన్ అనుచరవర్గమంతా వచ్చింది. కొల్లేరుకు వలస పక్షులు వచ్చినట్లు అప్పుడప్పుడు దెందులూరుకు అబ్బయ్య చౌదరి వస్తాడు' అని చింతమనేని విమర్శించారు.

7న దుర్గ గుడి మూసివేత

విజయవాడ(ఇంద్రకీలాద్రి), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): చంద్ర గ్రహణం కారణంగా సెప్టెంబరు 7వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటల నుంచి విజయవాడలోని ఇంద్రకీలాద్రిపైనున్న దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలోని ప్రధాన ఆలయం, ఉపాలయాలన్నింటినీ మూసివేస్తున్నట్టు దేవస్థానం ఈవో వి.కె.శీనానాయక్ తెలిపారు. ఆ రోజు 3.30 గంటలకు కవాట బంధనం చేయనున్నట్టు వైదిక కమిటీ తెలిపిందని శనివారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. 8వ తేదీ ఉదయం 8.30 గంటల నుంచి తిరిగి భక్తులకు దర్శనం ఉంటుందని తెలిపారు.

చేపల సాగుపైనా ట్రంప్ ఎఫెక్ట్!

- రొయ్యలపై సుంకాల ప్రభావంతో చేపల సాగుకు మొగ్గిన రైతులు
- ఇదే అదునుగా మేత ధర పైపైకి
- 10 టన్నుల డీవోబీ ధర లక్ష నుంచి 1.79 లక్షలకు పెంచేసిన వ్యాపారులు
- ప్రభుత్వం జోక్యానికి రైతుల విన్నపం



ఆకివీడు రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాల భారం.. ఆక్వారంగంపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దీంతో రైతులు చేపల సాగువైపు మళ్లుతున్నారు. నిన్న మొన్నటి వరకు రొయ్యల సాగు చేపట్టిన వారు ఇప్పుడు చేపల పెంపకంపై దృష్టి పెట్టారు. అయితే, ఇప్పుడు చేపల పెంపకంపైనా ట్రంప్ ప్రభావం కనిపిస్తోంది. చేపలకు మేతగా వేసే డీవోబీ ధర ఒక్కసారిగా 79 శాతం మేరకు పెరిగిపోయింది. రెండు నెలుల కిందటి వరకు 10 టన్నుల డీవోబీ ధర రూ.లక్ష ఉండగా, ఇప్పుడు ఏకంగా 1.79 లక్షలకు చేరింది. ఇక, రెండు మాసాల కిందట ఒక చేప ధర రూ.118గా ఉండగా, ప్రస్తుతం మేత ధర పెరిగినా చేప ధర మాత్రం పెరగలేదు. దీంతో రైతులకు నష్టాలు తప్పడం లేదు. ట్రంప్ సుంకాల ప్రభావంతో రొయ్యల సాగుపై ఏర్పడ్డ ప్రతి కూల పరిస్థితుల నేపథ్యంలో చేపల సాగుపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. దీనికి తోడు వర్షాకాలంలో రొయ్యల సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలించవు. దీంతో రైతులు చేపలు సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ఈ సాగు విస్తీర్ణం పెరిగింది. ఇదే అదనుగా భావించిన డీవోబీ వ్యాపారులు తమ ఇష్టానుసారం ధర పెంచేశారు. ప్రస్తుతం 10 టన్నుల డీవోబీ ధర రూ.లక్ష నుంచి రూ.1,79,000లకు పెరిగిపోయింది. దీంతో చేపల రైతులు లబోదిబోమంటున్నారు. చేపల సాగు సమయం 10 నుంచి 12 నెలలు. ప్రస్తుతం పెరిగిన డీవోబీ ధరలతో వ్యయం ఎక్కువ, లాభాలు తక్కువగా పరిస్థితి మారిపోయిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. సహజంగా కట్లా, శీలావతి, గడ్డిచేప, మోసు వంటివి మాత్రమే సాగు చేస్తుంటారు. పేను, మెప్ప, శంఖు జలగ వంటి వ్యాధులు చేపల సాగులో అవరోధాలుగా ఉన్నాయి. అనేక ఇబ్బందులు ఉన్నప్పటికి చేపలసాగు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులలో చేపల మేత ధర పెరిగిపోతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని డీవోబీ ధరలు తగ్గించాలని కోరుతున్నారు.

డీవోబీ అంటే

డీవోబీ అంటే.. చమురు తీసిన తవుడు. దీనికి మరికొన్ని పోషకాలు జోడించి చేపలకు ఆహారంగా వినియోగిస్తారు. డీవోబీలో ప్రొటీన్లు, పీచు పదార్థాలు, విటమిన్లు ఎక్కువగా ఉండి.. చేపలు త్వరగా ఎదుగుతాయి.

లాభాలు తక్కువ..



చేపల సాగుకు పెట్టుబడి ఎక్కువ. లాభం అతితక్కువగా వస్తోంది. ఎప్పుడోగానీ లాభాలు వచ్చే పరిస్థితి లేదు. డీవోబీ రేటు పెరగడం మరింత భారంగా మారింది. చేపల రైతులు నష్టాలు బారిన పడుతున్నారు.

- చింతలపాటి ప్రవీణ్ వర్మ, చేపల రైతు, కోళ్లపర్రు

ప్రభుత్వం నియంత్రించాలి




ఇష్టానుసారం ధరలు పెంచుతున్న డీవోబీ వ్యాపారులపై ఝళిపించాలి. ఇప్పటికే ఆక్వా రంగం సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ప్రభుత్వం కల్పించుకుని డీవోబీ ధరలు నియంత్రించాలి. చేపల ధర పెరిగేలా చర్యలు తీసుకోవాలి.

- కన్నబాబు, ఆక్వారైతు, కోళ్లపర్రు

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యం: నారాయణ, రామకృష్ణ
- ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు ప్రారంభం



సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళులు అర్పిస్తున్న నేతలు

ఒంగోలు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): 'దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది. బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసింది. ఎన్నికల కమిషన్‌తో ఆ పార్టీ కుమ్మక్కై, దొంగ ఓట్లతో గద్దె మీద ఉండే ప్రయత్నం చేస్తుంది' అని సీపీఐ నేతలు ధ్వజమెత్తారు. మూడు రోజుల పాటు ఒంగోలులో జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు, శనివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సీపీఐ శ్రేణులతో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సాయంత్రం జరిగిన బహిరంగ సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి కే.నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 'రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ, జనసేన, ప్రతిపక్షమైన వైసీపీ... మూడు పోటీపడి బీజేపీకి దాసోహం అంటున్నాయి. జనాభాలో అతి పెద్దది అయిన భారత్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. దానిని సమర్థవంతంగా తిప్పికొట్టడంలో ప్రధాని మోదీ విఫలం కావడమే కాక బానిసగా మారాడు' అని నారాయణ విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ మాట్లాడుతూ... 'రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ఇప్పుడు ప్రమాదంలో ఉన్నాయి. కడప జిల్లాలో 79 శాతం స్థానిక సంస్థలను ఏకగ్రీవం చేసుకున్న జగన్ ఇప్పుడు పులివెందులలో ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారు' అని అన్నారు. సభ ప్రారంభానికి ముందు సురవరానికి నేతలు ఘనంగా నివాళులు అర్పించారు.

ఉపాధినిచ్చే సముద్రపు నాచు

- తీరంలో సీ వీడ్ పెంపకంపై ప్రభుత్వం దృష్టి
- పైలెట్ ప్రాజెక్టుగా పీఎం లంక గ్రామం ఎంపిక
- పెంపకంపై రెండు మహిళా గ్రూపులకు శిక్షణ
- విజయవంతమైతే మరిన్ని గ్రూపులతో సాగు

నరసాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సముద్రపు నాచు (సీ వీడ్) పోషకాల గని.! ప్రపంచవ్యాప్తంగా దీన్ని అనేక ఆహార పదార్థాల్లో ఉపయోగిస్తుంటారు. ఔషధాలు, కాస్మొటిక్స్‌తోపాటు అనేక వస్తువుల తయారీలోనూ సముద్రపు నాచును ఉపయోగిస్తున్నారు. ఇన్ని ప్రత్యేకతలున్న సీ వీడ్‌ను సముద్ర తీరంలో సాగు చేయించి మత్స్యకారులకు ఉపాధి చూపించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా పశ్చిమగోదావరి జిల్లాలోని నరసాపురం మండలం పీఎం లంక గ్రామాన్ని ఎంపిక చేశారు. ఇక్కడ మత్స్యకార మహిళలు సభ్యులుగా ఉన్న రెండు డ్వాక్రా గ్రూపుల్ని ఎంపిక చేసి.. వారికి సీ వీడ్ సాగుపై శిక్షణ ఇవ్వనున్నారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద రుణాలిచ్చి నాచు సాగును ప్రోత్సహిస్తారు. ఇది విజయవంతమైతే మరికొన్ని గ్రూపుల్ని కూడా ప్రోత్సహించి తీరంలో ఈ సాగును విస్తరించాలని యోచిస్తున్నారు.

వేలాది మందికి ఉపాధి

ప్రస్తుతం దేశంలో తమిళనాడు సీ వీడ్ కల్చర్ (సముద్రపు నాచు పెంపకం)లో అగ్రగామిగా ఉంది. అక్కడ వేలాది మంది ఈ సాగుతో ఉపాధి పొందుతున్నారు. ప్రారంభ సమయంలో మినహా సాగుకు పెద్దగా పెట్టుబడి అవసరం లేదు. నాలుగు కర్రలను చతురస్రాకారంలో కట్టి దాన్ని తాళ్లతో నులక మంచం మాదిరిగా అల్లుతారు. ఈ అల్లికల మధ్యన నాచు మొక్కల్ని ఉంచుతారు. వాటిని సముద్రంలో ఉప్పు సాంద్రత ఎక్కువగా ఉండే ప్రదేశంలో లంగర్‌తో కడతారు. ఇలా ఐదారు ఫ్రేమ్‌ల్లో మొక్కలు పెట్టి దగ్గరగా ఉంచుతారు. సముద్రపు నీటిలో ఉండిన ఈ మొక్కలు పెరిగి కింద భాగంలో నాచుగా తయారవుతాయి. మూడునెలల తర్వాత వాటిని బయటకు తీసుకొస్తారు. గతంలో కూడా తీర ప్రాంతంలో నాచు సాగు చేసేందుకు ప్రయత్నించారు. అయితే సరైన ప్రోత్సాహం, శిక్షణ లేకపోవడం వల్ల మంచి ఫలితాలు రాలేదు. దీనిపై అధ్యయనం చేసిన మత్స్యశాఖ... ఎంపిక చేసిన రెండు డ్వాక్రా గ్రూపులకు శిక్షణ ఇచ్చి పెంపకం చేపట్టాలని నిర్ణయించింది. ఇప్పటికే ఈ తరహా సాగును రాష్ట్రంలో శ్రీకాకుళం, విశాఖలో చేపట్టారు. అవసరమైతే ఎంపిక చేసిన రెండు గ్రూప్ సభ్యుల్ని శ్రీకాకుళం, విశాఖ లేదా తమిళనాడుకు తీసుకెళ్లి సాగుపై శిక్షణ, అవగాహన కల్పించాలని యోచిస్తున్నారు.

నాచుకు భలే డిమాండ్

ప్రస్తుతం ఈ నాచుకు స్వదేశీ, విదేశీ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అత్యధికంగా ఫార్మా కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయి. కొన్ని కాస్మొటిక్స్‌ల్లోనూ వీటిని విరివిగా వినియోగిస్తున్నారు. ఐస్ క్రీముల్లో గట్టి కట్టేందుకు ఈ నాచు లోంచి వచ్చే పదార్థాన్ని ఎక్కువగా వాడుతున్నారు. ఇంత డిమాండ్ వల్లే తమిళనాడులో ఎక్కువ మంది నాచు సాగుపై ఆధారపడి జీవిస్తున్నారు. మంచి మార్కెట్ సదుపాయాలు కూడా ఉన్నాయి. ఇలా సాగు చేసిన నాచును కొనుగోలు చేసేందుకు ఔషధ కంపెనీలు పోటీపడుతున్నాయి.


సముద్రంలో పెంచుతున్న నాచు

పీఎం లంకలో పైలెట్ ప్రాజెక్టు

'రాష్ట్రంలో అన్ని సముద్ర తీర ప్రాంతాల్లో సీ వీడ్ కల్చర్‌ను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాలో పీఎం లంక ప్రాంతాన్ని ఎంపిక చేశాం. 40 మందితో ఉన్న రెండు డ్వాక్రా గ్రూపుల్ని ఎంపిక చేసి వారికి సాగుపై శిక్షణ ఇవ్వనున్నాం. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద రుణం కూడా ఇస్తాం. తీర ప్రాంతంలో అలల వడి ఎక్కువ. గోదావరి, ఉప్పుటేరు కలిసే ప్రదేశం కావడంతో ఇక్కడ నీటిలో ఉప్పు సాంద్రత తక్కువ. ఈ కారణంగా గతంలో ఈ సాగు విజయవంతం కాలేదు. ఈ సారి సముద్రం ఒడ్డున కాకుండా అలల తీవ్రత లేని ప్రదేశంలో.. అంటే సముద్రంలో కిలోమీటరు దూరంలో సాగు చేపట్టాలని నిర్ణయించాం. కర్ర ఫ్రేమ్‌లను బోటులో అక్కడికి తీసుకెళ్లి లంగర్ సాయంతో కట్టేసి నాచు పెంచుతాం. మూడు నెలల ఫలితాలను బట్టి మరికొన్ని గ్రూప్‌లను ఎంపిక చేసి సాగు విస్తీర్ణం పెంచుతాం.'

\- మత్స్యశాఖ జేడీ నాగలింగాచార్యులు

రైతుల యూరియా కష్టాలు వర్ణనాతీతం

» కోటా మేరకు రాష్ట్రానికి వచ్చింది ఏమైంది?: షర్మిల

అమరావతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో రైతుల యూరియా కష్టాలు వర్ణనాతీతం. ఏ రైతును కదిలించినా ఎరువుల కోసం కన్నీటి వ్యథే' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆందోళన వ్యక్తం చేశారు. తెల్లవారుజాము నుంచే ఎరువుల కేంద్రాల దగ్గర కిలోమీటర్ల మేర క్యూలు. కట్ట యూరియా కోసం రోజుల తరబడి రైతుకు ఎదురు చూపులు. రైతాంగం మీద కూటమి ప్రభుత్వానికి ఉన్న ప్రేమ ఇదేనా? రైతు సేవ, మార్క్‌ఫెడ్, సొసైటీ కేంద్రాల దగ్గర యూరియాలో నో స్టాక్ బోర్డులు పెట్టడానికి సిగ్గుండాలి. రాష్ట్ర కోటా మేరకు వచ్చిన యూరియా స్టాక్ ఏమైంది? 6.34 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా చేరితే రైతులకు ఎందుకు కష్టాలు తప్పలేదు? సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాలి' అని శనివారం ఆమె ఎక్స్‌లో పేర్కొన్నారు.

సంపద సృష్టిస్తామన్నారు.. అప్పులు చేశారు

» రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కాగ్ నివేదికలు ఆందోళనకరం:జగన్

అమరావతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): 2019-24 మధ్య కాలంలో వైసీపీ ప్రభుత్వంపై టీడీపీ, జనసేన నేతలు పదేపదే అబద్ధాలు చెప్పారు. రాష్ట్రంలో ఆదాయ వృద్ధి తగ్గిందని, అభివృద్ధి లేదని తప్పుడు ప్రచారం చేశారు. కూటమి అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తామని నమ్మబలికారు. కానీ, రాష్ట్రంలో ఆదాయం తగ్గిపోయి అప్పులు పెరిగినట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికలు వెల్లడించడం ఆందోళన కలిగిస్తోంది' అని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి శనివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. 2024-25లో కేంద్ర ప్రభుత్వ ఆదాయవృద్ధి 12.04 శాతం భారీగా పెరిగితే.. రాష్ట్ర ఆదాయ వృద్ధి 3.08 శాతం వద్దే ఎందుకు ఆగిపోయింది? ప్రజల కొనుగోలు శక్తి బాగా తగ్గిపోయింది. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆదాయం వృద్ధి 2.39 శాతం మాత్రమే ఉంది. మా ప్రభుత్వ హయాంలో అన్ని రకాల అప్పులు కలిపి రూ.3,32,671 కోట్లు మాత్రమే. కూటమి ప్రభుత్వం ఈ 14నెలల్లోనే రూ.1,86,361 కోట్లు అప్పు చేసింది' అని పేర్కొన్నారు.

వ్యవసాయ పంపుసెట్లు, ఫీడర్లకు సోలార్ విద్యుత్తు

» 5842 ఎకరాల్లో సౌర విద్యుత్తు ప్లాంట్ల స్థాపన
» 'పీఎం కుసుమ్' లక్ష్యంపై డిస్కమ్‌లకు సీఎస్ ఆదేశాలు

అమరావతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కుసుమ్ పథకంలో భాగంగా రాష్ట్రంలో 2.93లక్షల వ్యవసాయ పంపుసెట్లు, 1156 వ్యవసాయ ఫీడర్లకు సౌర విద్యుత్తు అందించాలన్న లక్ష్యాన్ని సకాలంలో నెరవేర్చాలని డిస్కమ్‌లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. శనివారంవిజయవాడ క్యాంపు కార్యాలయంలో డిస్కమ్‌ల సీఎండీలు పృథ్వీతేజ్, సంతోషరావు, పుల్లారెడ్డి, ట్రాన్స్‌కో గ్రిడ్ డైరెక్టర్ ఏవీవీ భాస్కర్, నెడ్‌క్యాప్ ఎండీ బి.కమలాకరబాబుతో సీఎస్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. సోలార్ విద్యుత్తు ప్రాజెక్టులు, విద్యుత్తు సరఫరాపై సమీక్షించారు. 5842ఎకరాల్లో 1162.8 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. కలెక్టర్లతో సంప్రదింపులు జరుపుతూ.. పెండింగ్‌లో ఉన్న 1700 ఎకరాల భూమిని సోలార్ ప్లాంట్ల కోసం సమీకరించాలని నెడ్‌క్యాప్, డిస్కమ్‌లను సూచించారు.

కసిరెడ్డి ఎవరో నాకు తెలియదు

» మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

తిరుపతి(జీవకోన), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో అరెస్టయిన కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఎవరో తనకు తెలియదని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. సిట్ అధికారుల విచారణ నేపథ్యంలో తనపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. శనివారం ఆయన తిరుపతిలో మీడియాతో మాట్లాడారు. 'సిట్ అధికారుల ప్రశ్నలన్నింటికీ నేను సమాధానం చెప్పా. అయితే ఇంట్లో లాప్‌టాప్ తీసుకెళ్లారని, రికార్డులు సీజ్ చేశారని, రూ.8 కోట్ల డబ్బులు లెక్కిస్తున్నారని తప్పుడు ప్రచారం చేయడం సరికాదు. నేను డబ్బులు, ఆస్తులకు ఆశపడను. నా మైండ్‌సెట్ సీఎం చంద్రబాబుకు బాగా తెలుసు. పోలీసు వ్యవస్థ దారుణంగా దిగజారింది' అని నారాయణస్వామి మండిపడ్డారు.

అదానీ సంస్థకు 2,400 ఎకరాలు

» 2016లో భూముల ముందస్తు పొజిషన్
» 2019లోనే పూర్తయిన సోలార్ ప్రాజెక్టు
» ఇప్పుడు 33 ఏళ్ల లీజుకు భూ కేటాయింపుపై రెవెన్యూ శాఖ ఉత్తర్వులు
» 2019 నాటి మార్కెట్ విలువలో 10 శాతంగా ఫీజు

అమరావతి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అదానీ సంస్థ సోలార్ విద్యుత్తు ప్రాజెక్టుకు సంబంధించి భూకేటాయింపులు చేస్తూ రెవెన్యూ శాఖ తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది. 250 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టుకు 2016లోనే 2,400 ఎకరాల ప్రభుత్వ భూములను ముందస్తు పొజిషన్ కింద ఇచ్చారు. 2019లోనే ఈ ప్రాజెక్టు పూర్తయి, అమల్లోకి వచ్చింది. అయితే ఇప్పుడు దాదాపు పదేళ్ల తర్వాత ఆ ప్రాజెక్టుకు 33 ఏళ్ల లీజు ప్రాతిపదికన ఆ భూమిని కేటాయిస్తున్నట్లుగా సర్కారు ఉత్తర్వులిచ్చింది. 2019 నాటి మార్కెట్ విలువ ఆధారంగా 10 శాతం లీజు ఫీజు ఉంటుందని పేర్కొంది. ప్రతీ ఐదేళ్లకోసారి లీజు ఫీజు 10 శాతం పెరుగుతుందని తెలిపింది. మధ్యలో పదేళ్ల భూమి కేటాయింపు విషయంలో కదలిక లేకుండా.. ఇప్పుడే ఎందుకు కేటాయింపు ఉత్తర్వులిచ్చారన్నది ఆసక్తికరంగా మారింది. దీనిపై రెవెన్యూ శాఖ స్పష్టత ఇవ్వకపోవడం సందేహాలకు తావిస్తోంది. 2016లో ప్రభుత్వ సంస్థ ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ నుంచి రెవెన్యూ శాఖకు ఒక దరఖాస్తు వచ్చింది. అదానీ సోలార్ ఎనర్జీ సంస్థ కడప జిల్లా మైలవరం మండలం దొడియం, వద్దిరాల గ్రామాల్లో 250 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలనుకుంటోందని, భూములు కేటాయించాలని కోరింది. ఆనాటి ప్రభుత్వం అందుకు అంగీకరించింది. భూమి కేటాయింపు వివరాలను నిర్ధారించకుండానే భూములను ముందస్తు పొజిషన్ కింద ఇచ్చేశారు. దొడియంలో 2,305.74 ఎకరాలు, వద్దిరాలలో 94.36 ఎకరాల భూమిపై అదానీకి ముందస్తు పొజిషన్ ఇచ్చారు. 2019 నాటికి సోలార్ ఎనర్జీ ప్రాజెక్టును పూర్తి చేశారు. కానీ ఆ తర్వాత ఈ కంపెనీకి భూ కేటాయింపు ఉత్తర్వులు ఇవ్వలేదు. దీనిపై ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం కూడా దృష్టిసారించలేదు. అయితే, ఇటీవల ఈ విషయం ప్రభుత్వ దృష్టికి వచ్చినట్లు తెలిసింది. కడప కలెక్టర్ నుంచి భూకేటాయింపు ప్రతిపాదనలు తెప్పించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ భూ నిర్వహణా సంస్థ (ఏపీఎల్ఎంఏ)లో భూకేటాయింపు విధానంపై చర్చించారు. దీని ప్రకారం భూమిని 33 ఏళ్ల లీజు ప్రాతిపదికన ఇవ్వాలని నిర్ణయించారు. అది 2019 నుంచి లీజు కాలం అన్నట్లుగా, లీజు ఫీజును భూమి మార్కెట్ విలువలో 10 శాతంగా నిర్ణయించారు. దొడియంలో ఎకరా రూ. 3 లక్షలు, వద్దిరాలలో ఎకరా 6.25 లక్షలుగా ఖరారు చేశారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బ్యాట్, కత్తి,
పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సహస్ర తల్లిదండ్రులు

నువ్వుగానీ చంపావేమిట్రా?

- టెన్షన్ పడుతుండటంతో సహస్ర హత్యపై బాలుడిని ప్రశ్నించిన తల్లి
- బ్యాట్‌ను దొంగిలించేందుకే ఇంట్లోకి.. బాలిక అడ్డుకోవడంతోనే హత్య
- పోలీసుల విచారణలో వివరాలన్నీ చెప్పిన బాలుడు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పన్నెండేళ్ల బాలిక సహస్ర నిండు ప్రాణాలను బలిగొన్న పదో తరగతి బాలుడు (14) హత్య తర్వాతా నిర్భీతిగా వ్యవహరించాడు. హత్య అనంతరం రక్తపుమరకలు అంటిన టీషర్టుతోనే ఇంట్లోకి వెళ్లి.. ఆ మరకలు ఇంట్లో ఎవరి కంటా పడకుండా ఉండేందుకు ఆ టీషర్టును విప్పి.. వాషింగ్‌మెషిన్‌లో వేశాడు. రక్తంతో కూడిన కత్తిని శుభ్రంగా కడిగేసి.. తర్వాత స్నానం చేసి ఏమీ తెలియనట్లుగా ఇంట్లోవారితో కలిసి టీవీ చూశాడు. ఇంట్లో బాలుడి తీరును అనుమానించిన తల్లి.. 'నువ్వు గానీ చంపావేమిట్రా ఆ అమ్మాయిని' అని ప్రశ్నిస్తే.. 'నీమీదొట్టమ్మా? అని బొంకాడు. ఆపై 'నువ్వే పట్టించేలా ఉన్నావే' అంటూ బెదురుగా మాట్లాడాడు. ఆ బాలుడిది విచిత్ర మనస్తత్వం అని పోలీసులు గుర్తించారు. గల్లీలో క్రికెట్ ఆడుతుండగా సహస్ర తమ్ముడి వద్ద ఉన్న ఖరీదైన బ్యాట్‌పై కన్నేసి.. దాన్ని చోరీ చేసేందుకు ఇంట్లోకి చొరబడ్డాడని.. సహస్ర అడ్డుకోవడంతో ఆమెను తన వెంట తెచ్చుకున్న కత్తితో పొడిచాడని పోలీసులు తేల్చారు. బాలుడిని మేడ్చల్‌లోని జువైనల్ హోంకు తరలించారు. ఈ మేరకు కూకట్‌పల్లి దయార్‌గూడలో బాలిక హత్య కేసుకు సంబంధించి శనివారం సైబరాబాద్ కమిషనరేట్‌లో విలేకర్ల సమావేశంలో సీపీ అవినాశ్ మహంతి కేసు వివరాలు వెల్లడించారు. దయార్‌గూడలో బాలిక సహస్ర తల్లిదండ్రులు అపార్ట్‌మెంట్‌లోని పెంట్‌హౌస్‌లో.. బాలుడి తల్లిదండ్రులు ఆ పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌లోని నాలుగో అంతస్తులో ఉంటున్నారు. ఈనెల 18న ఉదయం 10 గంటల తర్వాత కత్తి తీసుకొని తన అపార్ట్‌మెంట్ గోడ దూకి ఆవలివైపు అపార్ట్‌మెంట్‌లోకి బాలుడు ప్రవేశించాడు. ఇంట్లో సహస్ర ఒక్కత్తే ఉండటం, ఆమె టీవీలో మునిగిపోయి ఉండటంతో నెమ్మదిగా లోపలికి దూరి.. వంటగదిలో ఉన్న బ్యాట్‌ను తీసుకున్నాడు. అతడు వెళ్లిపోతుండగా గమనించిన సహస్ర.. బాలుడి టీషర్టు పట్టుకొని వెనక్కి లాగి దొంగా దొంగా అంటూ అరిచింది. దీంతో తన వెంట తెచ్చుకున్న కత్తితో తొలుత ఆమె మెడపై పొడిచాడు. ఆపై.. కళ్లు మూసుకొని విచక్షణారహితంగా కడుపులో పొడిచాడు. ఆమె శరీరంపై 27 కత్తిపోట్లను వైద్యులు గుర్తించారు. సహస్రను చంపాక, బ్యాట్‌ను అక్కడే వదిలేసి.. నిందితుడు గోడదూకి పారిపోయాడు. తల్లిదండ్రుల సమక్షంలోనే పోలీసులు అతడి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. 'మాకు జరిగిన అన్యాయం మరెవ్వరికీ జరగకూడదు' అని సహస్ర తల్లిదండ్రులు కృష్ణ, రేణుక మీడియాతో వాపోయారు. తమ కుమార్తెను హత్య చేసిన బాలుడిని ఉరితీయాలి, కాల్చి పడేయాలి, పెట్రోల్ పోసి తగులబెట్టాలి అంటూ శనివారం కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎదుట బంధుమిత్రులతో కలిసి ధర్నా చేశారు.

జైలు నుంచి ఎర్ర గంగిరెడ్డి విడుదల

సైదాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న ఎర్ర గంగిరెడ్డి శనివారం జైలు నుంచి విడుదల అయ్యాడు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో గంగిరెడ్డి ప్రధాన నిందితుడు. శుక్రవారం సుప్రీం కోర్టు గంగిరెడ్డికి బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. 2023, 5 మే నుంచి గంగిరెడ్డి చంచల్‌గూడ జైలులో ఉంటున్నాడు.

శాంతిస్తున్న కృష్ణా, గోదావరి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

నాలుగు రోజులుగా ఉగ్రరూపం దాల్చిన కృష్ణా, గోదావరి నదులు శాంతిస్తున్నాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 37.50 అడుగులకు తగ్గడంతో అధికారులు శనివారం మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 9,63,124 క్యూసెక్కుల జలాలను స్పిల్‌వే 48 గేట్ల ద్వారా విడుదల చేస్తున్నారు. పులిచింతల నుంచి 3,81,655 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్‌కు 3,92,970 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 3,75,125 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. కృష్ణా, గోదావరి ఉధృతి తగ్గుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ తెలిపారు. ధవళేశ్వరం, ప్రకాశం బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరికలను ఉపసంహరించినట్లు వివరించారు.



పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి ప్రవాహం

రేపు మరో అల్పపీడనం

- 26 నుంచి ఉత్తర కోస్తాలో వర్షాలు

విశాఖపట్నం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ పరిసరాల్లో శనివారం అల్పపీడనం ఏర్పడింది. ఇది ఆదివారం నాటికి జార్ఖండ్ వైపు పయనించి బలహీనపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఇది మన రాష్ట్రంపై ఎటువంటి ప్రభావమూ చూపదని పేర్కొంది. అలాగే, ఈనెల 25న ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్‌కు ఆనుకుని వాయవ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడుతుందని తెలిపింది. దాని ప్రభావంతో 26 నుంచి ఉత్తర కోస్తాలో ప్రధానంగా శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామ రాజు, విశాఖపట్నం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వివరించింది. కాగా రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో శనివారం ఎండ, ఉక్కపోత కొనసాగాయి. బాపట్లలో 36.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ ఉరుములు, పిడుగులతో వర్షాలు కురుస్తాయని తెలిపింది.

ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని డబ్బు కాజేసింది

- కి'లేడి' అరుణపై గిరిజనుల ఫిర్యాదు
- కోవూరు పోలీస్ స్టేషన్‌లో మరో కేసు
- విశాఖ జైలుకు రౌడీషీటర్ శ్రీకాంత్ తరలింపు
- శ్రీకాంత్ సోదరుడు మునికృష్ణ బైండోవర్
- ఇప్పటికే నమోదైన కేసుల్లో లోతుగా దర్యాప్తు
- అరుణ కాల్ రికార్డుల పరిశీలన
  ఆమె కస్టడీ కోరుతూ కోర్టులో పిటిషన్

నెల్లూరు (క్రైం), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాకు చెందిన కి'లేడి' నిడిగుంట అరుణ చేతిలో మోసపోయిన, చిత్రహింసలకు గురైనవారు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. తన వద్ద రూ. లక్షలు తీసుకుని మోసం చేసిందంటూ విజయవాడకు చెందిన ఓ వ్యక్తి ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని అరుణ నగదు తీసుకొని మోసం చేసిందంటూ శుక్రవారం రాత్రి పలువురు స్థానిక గిరిజనులు కోవూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అరుణపై మరో కేసు నమోదు చేశారు. ఫిర్యాదులపై పోలీసులు లోతుగా విచారిస్తున్నారు. మరోవైపు రౌడీషీటర్ అవిలేలి శ్రీకాంత్ సోదరుడు మునికృష్ణను తిరుపతి జిల్లా గూడూరు-2 పోలీసుస్టేషన్‌లో బైండోవర్ చేశారు. నెల్లూరు కేంద్రకారాగారంలో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్న శ్రీకాంత్‌ను శుక్రవారం రాత్రి విశాఖపట్నం జైలుకు తరలించారు. శ్రీకాంత్‌కు పెరోల్ రద్దయినప్పటి నుంచి ఆయన నేరాలకు సంబంధించిన అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నెల్లూరు జైలులో శ్రీకాంత్ ఉంటే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని, మరో జైలుకు తరలించాలని జైలు సూపరింటెండెంట్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారి ఆదేశాల మేరకు శ్రీకాంత్‌ను ఏఆర్ సిబ్బంది ప్రత్యేక బందోబస్తు మధ్య విశాఖ జైలుకు తీసుకెళ్లారు.



రౌడీషీటర్ల అరెస్టులు!

రౌడీషీటర్ శ్రీకాంత్, ఆయన ప్రియురాలు అరుణలకు అండగా ఉంటూ నేరాలకు పాల్పడిన పలువురు రౌడీషీటర్లను పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటికే పలువురు రౌడీషీటర్లను ఆయా స్టేషన్‌ల పరిధిలో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆదివారం మరింత మందిని అరెస్టు చేసే అవకాశం ఉంది. ఇక బెదిరింపుల కేసులో అరెస్ట్ అయిన అరుణ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే, అప్పటికే ఫోన్‌లోని రెండు సిమ్‌లను ఆమె తొలగించింది. ఫోన్ అన్‌లాక్ పాస్‌వర్డ్ చెప్పాలని పోలీసులు కోరగా ఆమె నిరాకరించిందని, అది తన వ్యక్తిగత విషయమని చెప్పినట్లు తెలుస్తోంది. ఫోన్ సంభాషణలన్నీ రికార్డు చేయడం అరుణకు అలవాటని తెలుసుకున్న పోలీసులు.. ఆడియో, వీడియో కాల్ రికార్డులను పరిశీలిస్తున్నారు. వాటిలో పలువురు రౌడీషీటర్లకు తరచూ ఆమె కాల్స్ చేసినట్లు ఇప్పటికే గుర్తించారు. వీటి ఆధారంగా పోలీసులు శనివారం వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. అరుణతో గతంలో ఫోన్‌లో మాట్లాడిన పోలీసు అధికారులు, రాజకీయ నాయకుల్లో ఇప్పుడు గుబులు మొదలైంది. కాగా, ఒంగోలు జైలులో ఉన్న అరుణను పూర్తిస్థాయిలో విచారించేందుకు కస్టడీ కోసం కోవూరు పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారని సమాచారం.

విశాఖ సెంట్రల్ జైలుకు అవిలేలి శ్రీకాంత్

ఆరిలోవ (విశాఖపట్నం), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వివాదాస్పద నేపథ్యంలో పెరోల్‌పై బయటికొచ్చి వార్తల్లోకెక్కిన జీవిత ఖైదీ అవిలేలి శ్రీకాంత్ (40)ను నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి శనివారం ఉదయం విశాఖ కేంద్ర కారాగారానికి తీసుకువచ్చారు. అతడిని ప్రత్యేక సెల్‌లో ఉంచినట్టు విశాఖ కేంద్ర కారాగారం డిప్యూటీ సూపరింటెండెంట్ సాయిప్రవీణ్ తెలిపారు. ప్రభుత్వ పాలనాపరమైన నిర్ణయా(అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్)ల్లో భాగంగా శ్రీకాంత్‌ను జైళ్ల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇక్కడికి తరలించినట్టు సాయిప్రవీణ్ వెల్లడించారు. కాగా, గూడూరులో వైన్‌షాపు యజమాని హత్యాకేసులో శ్రీకాంత్‌కు 2007లో కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. 2014లో జైలు నుంచి తప్పించుకోగా, అతడిని తిరిగి 2018లో పట్టుకొని జైలుకు తీసుకొచ్చారు. దీంతో శ్రీకాంత్‌కు శిక్ష కూడా పెరిగింది. ఇటీవల పెరోల్ రావడం, రద్దవడం విషయమై శ్రీకాంత్ వార్తల్లోకెక్కాడు.

శ్రీకాంత్ పెరోల్ కోసం మొదట సిఫారసు చేసింది వైసీపీ ఎమ్మెల్యేలే!

- చెవిరెడ్డి, కిలివేటి లేఖలు ఇస్తే తప్పులేదా?
- ఇంకెప్పుడూ సిఫారసు లేఖలు ఇవ్వను: కోటంరెడ్డి



నెల్లూరురూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ శ్రీకాంత్‌ను పెరోల్‌పై బయటకు తీసుకొచ్చేందుకు మొదట సిఫారసు లేఖలు ఇచ్చింది వైసీపీ ఎమ్మెల్యేలేనని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. శనివారం నెల్లూరులోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. శ్రీకాంత్‌ను పెరోల్‌పై విడుదల చేసేందుకు తనతోపాటు గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ సిఫారసు లేఖలు ఇవ్వడంపై వైసీపీ యాగీ చేస్తోందని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య.. శ్రీకాంత్‌కు ఎలా సిఫారసు లేఖలు ఇచ్చారని ప్రశ్నించారు. దీనిపై వైసీపీ నాయకులు, ఆ పార్టీ సోషల్ మీడియా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జూలై 16న తనతోపాటు గూడూరు ఎమ్మెల్యే ఇచ్చిన లేఖలను ప్రభుత్వం తిరస్కరించిందని తెలిపారు. అయినా 14 రోజుల తర్వాత శ్రీకాంత్ పెరోల్‌పై బయటకు వచ్చాడన్నారు. దీనిపై విచారణ జరుపుతున్నట్లు హోంమంత్రి అనిత ప్రకటించారన్నారు. తానిచ్చిన సిఫారసు లేఖపై రాజకీయ దుమారం రేగినందున ఇక భవిష్యత్తులో ఎవరికీ పెరోల్ కోసం సిఫారసు లేఖలను ఇవ్వబోనని ప్రకటించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు, ఉద్యోగ సంఘాల నేతలు

బకాయిలపై మూడు నెలల్లోగా ఉద్యోగ సంఘాలతో చర్చించాలి

- లేకపోతే మరో ఉద్యమానికి సిద్ధం
- గత ప్రభుత్వంలో రివర్స్ పీఆర్సీతో ఇబ్బందులు
- ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు

విజయవాడ (గాంధీనగర్), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మధ్యంతర భృతి, డీఏ తదితర బకాయిలపై ప్రభుత్వం మూడు నెలల్లోగా ఉద్యోగ సంఘాలతో చర్చించాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. లేదంటే ఎంతటి ఉద్యమానికైనా సిద్ధమని హెచ్చరించారు. ఈనెల 20న ప్రభుత్వం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కానీ 21న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు చర్చకు రాకపోవడం నిరాశకు గురి చేసిందన్నారు. జేఏసీ అనుబంధ సంఘాలతో రాష్ట్రస్థాయి జనరల్ బాడీ సమావేశం విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో శనివారం జరిగింది. అనంతరం బొప్పరాజు మీడియాతో మాట్లాడారు. గతంలో 92 రోజుల పాటు ఉద్యమం చేసి ప్రభుత్వాన్ని నిలదీసిన చరిత్ర తమ జేఏసీకి ఉందన్నారు. గత ప్రభుత్వంలో రివర్స్ పీఆర్సీతో ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం బకాయిలపై తమతో చర్చించకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఒక్కో ఉద్యోగికి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలు, రిటైర్డ్ ఉద్యోగులకు ఒక్కొక్కరికి సుమారు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రావాల్సి ఉందన్నారు. పేస్లిప్‌లో బకాయిల వివరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే బకాయిల రూపంలో ఒక్కో ఉద్యోగి రూ.5 వేలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు రిటైర్ అయిన వెంటనే బెనిఫిట్స్ అందజేసి గౌరవంగా సాగనంపే పరిస్థితి ఇప్పుడు లేదన్నారు. మీడియా సమావేశంలో జేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ పి.దామోదరరావు, అసోసియేట్ చైర్మన్ ఫణి పేర్రాజు, నేతలు ఎస్.శ్రీనివాసరావు, జనకుల శ్రీనివాసరావు, పీఎస్ఎస్ఎస్‌పి శాస్త్రి, పి.లక్ష్మీ పాల్గొన్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

సితార పాత్రలో



సుధీర్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న మైథలాజికల్ థ్రిల్లర్ 'జటాధర'. వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ సంయుక్త దర్శకత్వంలో ఉమేశ్ కుమార్, ప్రేరణ అరోరా నిర్మిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. సోనాక్షి సిన్హా కథానాయిక. నటి దివ్యా ఖోస్లా కీలకపాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో సితార అనే పాత్రలో ఆమె కనిపించనున్నారు. శనివారం చిత్రబృందం దివ్యా ఖోస్లా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. సంప్రదాయ వస్త్రధారణలో అలరించారు దివ్య. 'భారీ బడ్జెట్, హై టెక్నికల్ వాల్యూస్‌తో గ్రాండియర్‌గా నిర్మిస్తున్నాం, ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇచ్చే చిత్రమిది' అని మేకర్స్ తెలిపారు.

విలన్‌గా అక్షయ్



అక్షయ్ కుమార్, సైఫ్ అలీ ఖాన్ ప్రధాన తారాగణంగా ప్రియదర్శన్ తెరకెక్కిస్తున్న బాలీవుడ్ చిత్రం 'హైవాన్'. థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కుతోంది. కేవీఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిల్మ్స్ నిర్మిస్తున్నాయి. అక్షయ్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ శనివారం కొచ్చిలో మొదలైంది. 'అక్షయ్, సైఫ్ 17 ఏళ్ల తర్వాత కలసి నటిస్తున్న చిత్రమిది. ఈ కథ చాలా కొత్తగా ఉంటుంది. ఊటీ, ముంబైలో వరుస షెడ్యూల్స్‌లో చిత్రీకరణ పూర్తి చేస్తాం' అని మేకర్స్ తెలిపారు. ప్రేక్షకులు ఆశించే అన్ని అంశాలతో సినిమాను ఆసక్తికరంగా రూపొందిస్తున్నామని ప్రియదర్శన్ తెలిపారు.

ఒక వారం ముందుగానే...



మౌళి తనుజ్, శివానీ నాగరం ప్రధాన పాత్రలు పోషించిన 'లిటిల్ హార్ట్స్ ' చిత్రం సెప్టెంబర్ 5న విడుదల కానుంది. ఈటీవీ విన్ ఒరిజనల్ ప్రొడక్షన్స్ బేనరుపై దర్శకుడు సాయిమార్తాండ్ రూపొందించారు. ఆదిత్య హాసన్ నిర్మించిన ఈ చిత్రాన్ని బన్నీ వాసు, వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. 'లిటిల్ హార్ట్స్' చిత్రం సెప్టెంబర్ 12న విడుదల కావాలి. కానీ వారం రోజుల ముందుగానే దీన్ని రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాత ప్రకటించారు.'ప్రేక్షకులను నవ్వించడానికి ముందుగానే వస్తున్నాం' అని వెల్లడించారు. టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ రావడంతో థియటర్స్‌లో సినిమాకూ అదే ఆదరణ లభిస్తుందన్న నమ్మకంతో మూవీ టీమ్ ఉంది.

సూపర్ యోధుని సాహసం!



'హను-మాన్' చిత్రంతో దేశవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షించిన యువ కథానాయకుడు తేజ సజ్జా ఇప్పుడు 'మిరాయ్' సినిమాతో సూపర్ యోధగా అలరించనున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేతలు విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. హీరో తేజ పుట్టినరోజు సందర్భంగా శనివారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. కూలిపోతున్న వంతెన మీద కేవలం చేతిలో ఒక స్టిక్‌తో నిలబడి పోరాడుతున్న తేజ లుక్ ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో రితికా నాయక్ హీరోయిన్. మంచు మనోజ్ విలన్‌గా నటిస్తున్నారు. శ్రియ శరణ్, జయరామ్, జగపతిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'మిరాయ్' చిత్రం 2డి, 3 డి ఫార్మెట్స్‌లో ఎనిమిది భాషల్లో సెప్టెంబర్ 5న విడుదల కానుంది. బాలీవుడ్ టాప్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ ఉత్తరాదిలో ఈ సినిమాను విడుదల చేయనున్నారు.

తేజ సజ్జాతో మరో సినిమా

'మిరాయ్' చిత్రం తర్వాత తేజ సజ్జా హీరోగా మరో కొత్త చిత్రాన్ని నిర్మించనున్నట్లు నిర్మాతలు విశ్వప్రసాద్, కృతిప్రసాద్ ప్రకటించారు. తేజ పుట్టిన రోజు సందర్భంగా ఈ కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటిస్తూ విడుదల చేసిన పోస్టర్‌లో ఉన్న 'ఫ్రమ్ రాయలసీమ టు ద ఎండ్ ఆఫ్ ద వరల్డ్' అనే ట్యాగ్‌లైన్ ఆకట్టుకుంటోంది. భారీ బడ్జెట్‌తో, టాప్ క్లాస్ ప్రొడక్షన్ వాల్యూస్‌తో రూపుదిద్దుకొనే ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు నిర్మాతలు వెల్లడించారు.

హాయిగా నవ్విస్తాం



వెంకటేశ్ నిమ్మలపూడి

'చాలా మంచి కుటుంబ వినోదాత్మక చిత్రమిది. సినిమా చూస్తున్నంతసేపూ ప్రేక్షకులు హాయిగా నవ్వుతూనే ఉంటారు' అని చెప్పారు దర్శకుడు వెంకటేశ్ నిమ్మలపూడి. నారా రోహిత్ హీరోగా ఆయన తెరకెక్కించిన చిత్రం 'సుందరకాండ'. సంతోశ్ చిన్న పొల్ల, గౌతమ్‌రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మించారు. సినిమా ఈనెల 27న విడుదలవుతోంది. ఈ సందర్భంగా వెంకటేశ్ నిమ్మలపూడి విలేకరులతో మాట్లాడారు. 'నాకు ఫ్యామిలీ కథలు అంటే ఇష్టం. 'కలిసుందాం రా' నా ఫేవరేట్ సినిమా. అలాంటి ఒక అందమైన కుటుంబ కథా చిత్రాన్ని తీయాలనే నా కల 'సుందరకాండ'తో నెరవేరింది. తను కోరుకునే సుగుణాలున్న అమ్మాయి కోసం పట్టుపట్టి వెతికే అబ్బాయికి, అతని కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయి అనే పాయింట్ ఆధారంగా రాసుకున్న కథ ఇది. శ్రీదేవీ విజయ్‌కుమార్, వృతి వాఘాని నటన అద్భుతంగా ఉంటుంది.' అని అన్నారు.



గ్లామర్ విందుకు నేను రెడీ!

'నువ్విలా', 'రామ్‌లీల' వంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన యువ కథానాయకుడు హవీష్ తాజా చిత్రం 'నేను రెడీ'. నక్కిన త్రినాథరావు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కావ్య థాపర్ కథానాయిక. నిఖిల కోనేరు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'నేను రెడీ' చిత్రం నుంచి కావ్య థాపర్ బర్త్‌డే పోస్టర్ ను విడుదల చేశారు. ఇందులో తన పాత్ర ప్రేక్షకులను మెప్పిస్తుందని కావ్య చెప్పారు. ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది, ప్రేక్షకులను ఆకట్టుకొనే హంగులతో ఈ చిత్రం రూపొందుతోంది అని నిర్మాత నిఖిల చెప్పారు.


చాలా క్రూరమైన పాత్ర చేశా



చైతన్య రావు

"ఘాటీ'లో నా పాత్ర రెగ్యులర్ విలన్‌లా ఉండదు. 'విలన్‌గా కాకుండా ఒక మెయిన్ క్యారెక్టర్‌గా నిన్ను చూస్తున్నాను' అని డైరెక్టర్ క్రిష్ నాతో చెప్పారు. ఐకానిక్ క్యారెక్టర్ అవుతుందనే నమ్మకం నాకుంది.' అని అన్నారు నటుడు చైతన్య రావు. అనుష్కశెట్టి, విక్రమ్‌ప్రభు ప్రధాన పాత్రధారులుగా క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించిన చిత్రం 'ఘాటీ'. రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. ఈ చిత్రంలో చైతన్య రావు కీలక పాత్రలో నటించారు. సినిమా సెప్టెంబరు 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ 'క్రిష్ కథను అద్భుతంగా చెప్పారు. అసలు ఆ క్యారెక్టర్‌లో నన్ను ఎలా ఊహించుకున్నారో అర్థం కాలేదు. చాలా క్రూరమైన పాత్ర అది. లుక్ కోసం చాలా టైం పట్టింది. 'ఘాటీ' 'మయసభ' ఈ రెండూ కూడా నా కెరీర్‌కు గట్టి పునాదులు కాబోతున్నాయి' అని అన్నారు.

మంచి సందేశం ఇవ్వాలనుకుంటున్నా



మోహన్ శ్రీవత్స

'ఈ సినిమాలో హీరో, విలన్ అంటూ ప్రత్యేకంగా ఉండరు. అన్ని పాత్రల్లో అన్ని కోణాలుంటాయి' అని అన్నారు దర్శకుడు మోహన్ శ్రీవత్స. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన 'త్రిబాణధారి బార్బరిక్' సినిమా ఈనెల 29న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో చిత్ర విశేషాలు పంచుకున్నారు. 'మారుతి జానర్‌లో ఉండే సినిమా కాదిది. కానీ ఈ కథను పర్ఫెక్ట్‌గా నెరేట్ చేశాను. 'అన్ని పాత్రల్లోనూ అంతర్గత సంఘర్షణ ఉంటుంది. తెలిసో తెలియకో అందరం తప్పులు చేస్తుంటాం. అన్ని రకాల భావోద్వేగాలను నియంత్రణలో పెట్టుకునే వాడు గొప్ప మనిషి అని చెప్పదల్చుకున్నాను' అని అన్నారు.

కొత్త బ్రాండ్లకు బ్రేక్!

ఎక్సైజ్ శాఖ ప్రతిపాదనలకు సీఎం తిరస్కరణ

- ప్రస్తుతానికి కొత్తవి అవసరం లేదని నిర్ణయం
- జగన్ ప్రభుత్వంలో 'సిమిలర్ సౌండింగ్' బ్రాండ్లతో దోపిడీ
- కమీషన్ల రూపంలో పెద్ద మొత్తం దారి మళ్లించారన్న సిట్
- అదే తప్పు పునరావృతం కాకూడదని భావిస్తున్న ప్రభుత్వం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోకి కొత్త మద్యం బ్రాండ్ల ప్రవేశానికి బ్రేక్ పడింది. ప్రస్తుతం ఉన్నవాటితో పాటు కొత్త బ్రాండ్ల మద్యానికి అనుమతి అంశంపై ఎక్సైజ్ శాఖ ప్రతిపాదనలు రూపొందించింది. వాటిపై ఇటీవల నిర్వహించిన కేబినెట్ భేటీలో చర్చ జరగ్గా కొత్త బ్రాండ్ల అవసరం లేదని సీఎం తిరస్కరించినట్లు తెలిసింది. కొత్తగా ప్రతిపాదించిన బ్రాండ్లలో చాలావరకూ సిమిలర్ సౌండింగ్ బ్రాండ్లే ఉన్నాయి. అంటే ప్రస్తుతం అందుబాటులో ఉన్న బ్రాండ్ల పేర్లకు చిన్నపాటి మార్పులు చేసి కొత్త పేరుతో మార్కెట్‌లోకి ప్రవేశపెడతారు. ఈ విధంగా స్వల్ప మార్పులతో వచ్చినా వాటిని కొత్త బ్రాండ్లుగానే పరిగణిస్తారు. వాటికి కొత్త ధరలు నిర్ణయిస్తారు. గత ప్రభుత్వంలో జరిగిన మద్యం స్కాంలో సిమిలర్ సౌండింగ్ బ్రాండ్లు కీలక పాత్ర పోషించాయి. ఉదాహరణకు బృందావన్ మార్కెటింగ్ ఏజెన్సీస్ కంపెనీ బ్యాగ్‌పైపర్ ప్రీమియర్ విస్కీ అనే బ్రాండ్ సరఫరా చేసేది. దానికి కేసుకు రూ.696 చొప్పున ప్రభుత్వం చెల్లించేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన కొంతకాలానికి అదే కంపెనీ, అదే నాణ్యతతో బాగ్స్‌పైపర్ గోల్డ్ రిజర్వ్ విస్కీ పేరుతో కొత్త బ్రాండ్ ప్రవేశపెట్టింది. దాని ధరను రూ.1,759గా నిర్ణయించారు. దీనివల్ల ప్రభుత్వానికి కేసుకు రూ.1,063 చొప్పున నష్టం వచ్చింది. ఈ మొత్తం కమీషన్ల రూపంలో దారిమళ్లినట్లు సిట్ చార్జ్‌షీటులో పేర్కొంది. ఇప్పుడు సిమిలర్ సౌండింగ్ బ్రాండ్లకు అనుమతిస్తే మళ్లీ అదే తప్పు చేసినట్లు అవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఈసారి అవే కంపెనీలు కొత్త పేర్లతో నాణ్యత తగ్గించి బ్రాండ్లను ప్రవేశపెట్టి అమ్మకాలు పెంచుకోవాలని భావించాయి. అలాగే కొన్ని పూర్తిగా కొత్త బ్రాండ్లు వచ్చేందుకు కూడా ప్రతిపాదనలు వచ్చాయి. కానీ ప్రస్తుతానికి ఎలాంటి కొత్త బ్రాండ్లు అక్కర్లేదని సీఎం స్పష్టం చేసినట్లు సమాచారం. కాగా, ప్రస్తుతం ఉన్న బ్రాండ్ల ధరల సవరణ టెండర్ల అంశంకూడా కేబినెట్ ముందుకొచ్చింది. దీనిపై త్వరలో ఆదేశాలు వెలువడనున్నాయి. టెండర్ కమిటీ సిఫారసులకు అనుగుణంగా వాటి ధరలను సవరించనున్నారు. ప్రభుత్వం మారిన తర్వాత ఇప్పటికే 40 బ్రాండ్లు స్వచ్ఛందంగా ధరలు తగ్గించాయి. ప్రస్తుత ధరల కంటే ఇంకా తగ్గిస్తే ప్రభుత్వ ఆదాయంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. కంపెనీ కొంతమేర ధర తగ్గించుకుంటే దానిపై వివిధ రకాల పన్నులు వేస్తారు కాబట్టి ఆ మేరకు అనేక రెట్లు ఆదాయం తగ్గుతుంది.

శాంతిపై ఎందుకు కరుణ?

దేవదాయ శాఖను భ్రష్టు పట్టించినా చర్యలకు ఉన్నతాధికారుల మీనమేషాలు

- 'కంపల్సరీ రిటైర్మెంట్'కు నోటీసులు జారీ
- దీనివల్ల ఒరిగేదేమీ లేదంటున్న సిబ్బంది
- మూడు జిల్లాల్లో అక్రమాలన్నీ రుజువు
- దుష్ప్రవర్తనకు పాల్పడినట్లు నిరూపణ
- ఆమె పంపిన ప్రతిఫైల్‌కు అప్పట్లో పచ్చజెండా
- ఫైల్స్ ఆమోదించిన వారిపై చర్యల మాటేంటి?
- ఏసీ వ్యవహారంలో మెతక ధోరణిపై సందేహాలు



విశాఖపట్నం పరదేశిపాలెంలో లీజుకు ఇచ్చిన స్థలం. దానిలో డెయిరీ ఐస్‌క్రీమ్ ఫ్యాక్టరీ



అమరావతి/విశాఖపట్నం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ వివాదాస్పద అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) కె. శాంతిపై చర్యలు తీసుకునేందుకు ఆ శాఖ ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. శాంతిపై నమోదు చేసిన అన్ని అభియోగాలు దాదాపు నిరూపణ అయ్యాయి. విచారణాధికారిగా ఉన్న రాజమండ్రి ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఇచ్చిన నివేదికలో.. 'ఆమె చేయని తప్పు లేద'ని స్పష్టంగా పేర్కొన్నారు. శాఖకు చెందిన సొమ్మును దుర్వినియోగం చేయడం, తాను అవినీతికి పాల్పడడంతో పాటు సిబ్బందిని కూడా ప్రోత్సహించడాన్ని నిర్ధారించుకున్నారు. అంతేకాదు, తన భర్త విషయంలో రికార్డుల్లో ఒకరి పేరు, ప్రెస్‌మీట్‌లో మరొకరి పేరు చెప్పడం, ఉన్నతాధికారుల అనుమతి లేకుండా మీడియాతో మాట్లాడడాన్ని కూడా నివేదిలో ప్రస్తావించారు. అదేవిధంగా సీసీఏ నిబంధనలు తుంగలోతొక్కడంతో పాటు నైతిక దుష్ప్రవర్తనకు పాల్పడినట్లు పేర్కొన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, ఎన్టీఆర్ జిల్లాల్లో పనిచేసినప్పుడు ఆమెపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి 20 చార్జ్‌లు పెట్టగా వాటిలో 17 రుజువయ్యాయని తెలిపారు. ఈ నివేదికను పరిశీలిస్తే ఆమెను ప్రభుత్వ ఉద్యోగ నుంచి శాశ్వతంగా తొలగించవచ్చని దేవదాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి. కానీ, శాంతి విషయంలో ఉన్నతాధికారులు ఇంకా మెతక వైఖరినే ప్రదర్శిస్తున్నారు. కేవలం 'కంపల్సరీ రిటైర్మెంట్'కు మాత్రమే ప్రతిపాదించారు. మరోవైపు విచారణ విషయంలో జాప్యం చేస్తున్నారు. ఏసీ శాంతిని గత ఏడాది జూలై 2న సస్పెండ్ చేసి, అభియోగాలు నమోదు చేశారు. సస్పెండ్ చేసి దాదాపు 15 నెలలు పూర్తయ్యాయి. తాజాగా అధికారులు కంపల్సరీ రిటైర్మెంట్‌కు ప్రతిపాదించారు. ఇంత ఆలస్యం ఎందుకు చేశారన్న విషయంపై ఎలాంటి సమాధానం లేదు. పైగా, కంపల్సరీ రిటైర్మెంట్ పెద్ద శిక్ష కాదన్న అభిప్రాయం కూడా ఉంది. దీని వల్ల ఆమె మళ్లీ అసిస్టెంట్ కమిషనర్ లేదా డిప్యూటీ కమిషనర్‌గా దేవదాయశాఖలోకి వచ్చే అవకాశం ఉందని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. కాబట్టి మరింత కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

సహకరించిందెవరు?

అసిస్టెంట్ కమిషనర్‌గా శాంతి విధుల్లో ఉన్నప్పుడు కేవలం 6-సీ ఆలయాలకు సంబంధించిన వ్యవహారాలు మాత్రమే చూడాలి. కానీ, ఆమె 6-బీ, 6-ఏ ఆలయాల వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నారు. ఆ ఆలయాల పరిధిలో లీజులు, లైసెన్సుల కొనసాగింపునకు సంబంధించిన ఫైల్స్‌ను దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయానికి పంపించారు. ఆ సమయంలో శాఖ ప్రధాన కార్యాలయం అధికారులు.. ఆమె పరిధిని ప్రశ్నించలేదు. పైగా, ఆమె పంపిన ప్రతి ఫైల్‌ను ఆమోదించారు. ఆమె కోరిన విధంగా లీజులు, లైసెన్సులకు అనుమతులిచ్చారు. అప్పట్లో ఆమెకు సహకరించిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఆమెకు సహకరించిన అధికారులు, సిబ్బంది విషయంలో ఉన్నతాధికారులు ఎందుకు దృష్టి పెట్టడం లేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

కీలక వివాదాలు ఇవీ..

- అనకాపల్లి జిల్లా నుంచి 2022, జూన్ 30న బదిలీపై ఏసీ శాంతి ఎన్టీఆర్ జిల్లాకు వెళ్లారు. అక్కడ భర్త మదన్ మోహన్‌తో తలెత్తిన వివాదంపై మీడియా ముందుకు వచ్చారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా అనేక అంశాలపై బహిరంగంగా మాట్లాడారు.
- అప్పటి వైసీపీ నేత విజయసాయిరెడ్డిని ఉద్దేశిస్తూ 'ఎప్పుడు ఎలా మాట్లాడాలో మీకు బాగా తెలుసు సార్. మీరు పార్టీకి వెన్నెముక.' అని ట్వీట్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ ఒక రాజకీయ నాయకుడిని సమర్థించడం సర్వీస్ నిబంధనలకు విరుద్ధం.
- మొదటి భర్త మదన్‌మోహన్‌కు విడాకులు ఇచ్చానని, న్యాయవాది సుభాశ్‌ను 2020లో రెండో వివాహం చేసుకున్నానని చెప్పారు. తనకు పుట్టిన మగ బిడ్డకు ఆయనే తండ్రి అని వెల్లడించారు. అయితే మదన్‌తో విడాకులు తీసుకున్నట్టు నిరూపించలేకపోయారు.
- తన పరిధిలో లేని 6-ఏ, 6-బీ ఆలయాల భూములను వేలం వేయకుండా 11 ఏళ్ల లీజుకు ఇచ్చేశారు.

విజిలెన్స్ నిర్వీర్యం

దేవదాయ శాఖలో విజిలెన్స్‌ను పూర్తిగా నిర్వీర్యం చేశారు. శాఖలో విజిలెన్స్ బలంగా లేకపోవడంతో విచారణలు ఆలస్యం కావడంతో పాటు క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం లోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. శాంతిపై క్రమశిక్షణ చర్యలకు సంబంధించి నోటీసులు ఇవ్వడానికి 15 నెలల సమయం తీసుకున్నారు. ఇందతా దేవదాయ శాఖలో విజిలెన్స్ విభాగం బలహీనంగా ఉండడమే కారణమని తెలుస్తోంది. ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు, ఒక జాయింట్ కమిషనర్ ఉండాల్సిన చోట, కేవలం ఒక సీనియర్ అసిస్టెంట్, ఒక కంప్యూటర్ ఆపరేటర్‌తో విజిలెన్స్ విభాగాన్ని నడిపిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో విజిలెన్స్ విభాగంలో ఒక జాయింట్ కమిషనర్ పోస్టు ఉండేది. విభజనతో ఆ పోస్టు తెలంగాణకు వెళ్లిపోవడంతో ఏపీలో విజిలెన్స్ జాయింట్ కమిషనర్ పోస్టులు లేకుండాపోయింది. విజిలెన్స్ బలహీనంగా ఉంటేనే కమిషనర్లు అనుకున్న పనులు జరుగుతాయన్న ధోరణిలో వ్యవహరిస్తున్నారు. విజిలెన్స్ కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తి చేసి, క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటే ఆ విభాగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

డెయిరీ భూముల్లో బొక్కేసి!

అనకాపల్లి జిల్లా లంకెలపాలెంలో పరదేశమ్మ ఆలయానికి సంబంధించిన భూమిలో విశాఖ డెయిరీకి చెందిన ఐస్‌క్రీమ్ కంపెనీ కొన్ని దశాబ్దాలుగా ఉంది. అది ఆక్రమణ కావడంతో ఏసీ శాంతి వారిని బెదిరించారు. దారిలోకి తెచ్చుకొని వేలం లేకుండా 11 ఏళ్లకు లీజుకు ఇచ్చేశారు. అప్పటికే ఆక్రమణదారుడైన సతీశ్(విశాఖ డెయిరీ) నెలకు రూ.20 వేలు చొప్పున జరిమానా కడుతున్నారు. ఆ విషయం కూడా దాచిపెట్టి అదే రూ.20 వేలు లీజుగా నిర్ణయించి ఇచ్చేశారు. పైగా దీనికి అనుకూలంగా నివేదిక ఇవ్వాలని ఆలయ ఈవో, ఇన్‌స్పెక్టర్‌ను బెదిరించారు. వారికి బదులుగా తానే ఒక నివేదిక తయారుచేసి వాటిపై సంతకాలు చేయించారు. నివేదికలు రెండూ ఒకే విధంగా ఉండడంతో అనుమానించిన అధికారులు వారిని ప్రశ్నించగా, ఆమె తమను బెదిరించి సంతకాలు చేయించారని పేర్కొన్నారు. ఆ ఆరోపణలపై విశాఖ కనకమహాలక్ష్మి దేవస్థానం ఈవో శోభారాణి, విజయవాడలోని అదనపు కమిషనర్-1 చంద్రకుమార్ విచారణ పూర్తిచేసి నివేదికలు ఇచ్చారు. దీంతో దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ శాంతికి ఈ నెల 16న షోకాజ్ నోటీసు ఇచ్చారు.

ఒక్కో పోస్టుకు ఒక్కరికే పిలుపు

డీఎస్సీలో మెరిట్ అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన కోసం ఆదివారం కాల్ లెటర్లు అందనున్నాయి. ఏపీడీఎస్సీ వెబ్‌సైట్ అభ్యర్థుల లాగిన్‌లలో పాఠశాల విద్యాశాఖ వీటిని అందుబాటులో ఉంచనుంది. ఒక పోస్టుకు ఒకరు చొప్పున మొత్తం 16,347పోస్టులకు గాను అంతమందినే సర్టిఫికెట్ల పరిశీలనకు పిలుస్తారు. సోమవారం నుంచి సర్టిఫికెట్ల పరిశీలన జిల్లాల్లో ప్రారంభమవుతుంది. ప్రతి 50మంది అభ్యర్థులకు ఒక బృందాన్ని కేటాయించారు. రెండు మూడు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని భావిస్తున్నారు. సర్టిఫికెట్ల పరిశీలనకు ఎవరైనా హాజరు కాకపోయినా, సరైన సర్టిఫికెట్లు సమర్పించకపోయినా ఆ స్థానాలను ఖాళీగా చూపించి, వాటి భర్తీ కోసం మెరిట్ జాబితాలో తర్వాత నిలిచిన అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు.

సార్లొచ్చారు!

(మొదటి పేజీ తరువాయి)

వివాదాలే గుర్తుకొస్తాయి. నోటిఫికేషన్లు జారీ అయినా రకరకాల వివాదాలతో అడుగడుగునా బ్రేకులు పడేవి. ఇక ఆ ప్రక్రియ ఎంతకాలానికి పూర్తవుతుందో ఎవరికీ అంతుపట్టేది కాదు. అలాంటి ఒకేసారి 16,347 పోస్టులు ప్రకటించిన డీఎస్సీని ప్రభుత్వం రికార్డు సమయంలో పూర్తిచేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 20న మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రకటించారు. జూన్ 6 నుంచి జూలై 2 వరకు మొత్తం 67 విభాగాల్లో పరీక్షలు నిర్వహించారు. 3,36,307 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 3.12 లక్షల మంది పరీక్షలు రాశారు. మొత్తం ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ ఆన్‌లైన్‌లో నిర్వహించింది. టెట్ మార్కుల్లోనూ వివాదాలకు అవకాశం లేకుండా అనేకసార్లు అప్‌డేషన్‌కు అవకాశం కల్పించింది. ఎంపికైనవారి జాబితాలు నేరుగా ప్రకటించాలని భావించినా, అభ్యర్థుల్లో అనుమానాలకు తావివ్వకూడదనే ఉద్దేశంతో శుక్రవారం రాత్రి మెరిట్ జాబితాలు ప్రకటించింది. ఆదివారం అభ్యర్థులకు కాల్ లెటర్లు అందించనుంది. ఈ మొత్తం ప్రక్రియకు 125 రోజులు మాత్రమే పట్టింది. మరో వారం రోజుల్లో భర్తీ ప్రక్రియ కూడా పూర్తికానుంది.

ఏడేళ్ల తర్వాత మెగా డీఎస్సీ

ఉమ్మడి రాష్ట్రంలో 23 జిల్లాలకు కలిపి ఎక్కువ టీచర్ ఉద్యోగాలు ఉండేవి. రాష్ట్ర విభజన తర్వాత ఆ సంఖ్య పరిమితమైంది. 2014లో టీడీపీ ప్రభుత్వం 9,061 పోస్టులతో డీఎస్సీ ప్రకటించి పూర్తిచేసింది. మళ్లీ 2018లో 7,729 పోస్టులతో డీఎస్సీ ప్రకటించగా ఆ ప్రక్రియ వైసీపీ ప్రభుత్వంలో పూర్తయింది. ఆ తర్వాత జగన్ ప్రభుత్వంలో ఒక్క టీచర్ ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదు. దీంతో ఖాళీలు పెరిగిపోయాయి. దాదాపు ఏడేళ్ల తర్వాత విడుదల చేసిన మెగా డీఎస్సీ కావడంతో అభ్యర్థులు పెద్దఎత్తున పోటీపడ్డారు. ఇంత పెద్ద డీఎస్సీ ఇప్పట్లో ఉండదనే ఆలోచనతో లక్షల మంది పరీక్షలు రాశారు.

నాడు పోస్టుల హేతుబద్ధీకరణతో మోసం

నిరుద్యోగులను అందులోనూ టీచర్ ఉద్యోగాల కోసం ఎదురుచూసిన వారిని గత వైసీపీ ప్రభుత్వం దారుణంగా మోసం చేసింది. రాష్ట్రంలో 23వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తాను అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని మెగా డీఎస్సీ ద్వారా భర్తీచేస్తానని 2019కు ముందు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో జగన్ పదేపదే ప్రకటించారు. తీరా అధికారంలోకి వచ్చాక జీవో 117 తీసుకొచ్చి పోస్టుల హేతుబద్ధీకరణ చేశారు. టీచర్ ఉద్యోగాలు ఖాళీలే లేవనే కొత్త వాదన తెరపైకి తెచ్చారు. నిరుద్యోగుల నుంచి ఒత్తిడి రావడంతో తప్పని పరిస్థితుల్లో ఎన్నికలకు కొద్ది నెలల ముందు 6,100 పోస్టులతో వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ ప్రకటించింది. అది కూడా న్యాయ వివాదాల్లో చిక్కుకుని ఆదిలోనే ఆగిపోయింది. ఆ వెంటనే ఎన్నికలు రావడంతో మొత్తం ప్రక్రియకు బ్రేక్ పడింది. తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దాన్ని రద్దుచేసి జీవో 117కు ప్రత్యామ్నాయం తీసుకొచ్చింది. కొత్తగా మోడల్ ప్రైమరీ పాఠశాలలు ప్రవేశపెట్టి తరగతికి ఒక టీచర్‌ను ఇచ్చింది. ఏకోపాధ్యాయ పాఠశాలలను 13 వేల నుంచి 9,600కు తగ్గించింది. ఈ చర్యల ఫలితంగా వచ్చిన ఖాళీలతో మెగా డీఎస్సీ ప్రకటించి ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేసింది.

కుటుంబాల్లో కొలువుల జాతర

ఒకే ఇంట్లో ఇద్దరు, ముగ్గురికి టీచర్ పోస్టులు.. భార్యాభర్తలు, అన్నదమ్ములు, అక్కాచెల్లెల్లకు

- కొందరు ఏకంగా 3, 4, 5 ఉద్యోగాలకు అర్హత
- కూలీ బిడ్డలకు డీఎస్సీ ర్యాంకులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఒకే ఇంట్లో ఇద్దరు అక్కాచెల్లెల్లు.. మరో ఇంట్లో ఇద్దరు అన్నదమ్ములు.. ఇంకో ఇంట్లో అక్కాతమ్ముడు.. మరో ఇంట్లో భార్యాభర్తలు.. ఓ కుటుంబంలో ఏకంగా ముగ్గురు.. ఇలా ఎందరో టీచర్ ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. కొందరు ఏకంగా 3, 4, 5 ఉద్యోగాలకు కూడా అర్హత సాధించారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడమనేది ఓ కల అయితే.. ఒకే ఇంట్లో ఇద్దరు, ముగ్గురు టీచర్ ఉద్యోగాలు సంపాదించడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కూటమి ప్రభుత్వం తాజాగా ప్రకటించిన మెగా డీఎస్సీ ఫలితాల్లో ఎన్నో విశేషాలు ఉన్నాయి. కూలి పనులు చేసేవారు, ఆటో నడిపేవారు, చిన్నాచితక పనులు చేసేవారు, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారు ఎందరో అర్హత సాధించారు. జిల్లాతో పాటు రాష్ట్ర స్థాయిలో రెండు, మూడు ర్యాంకులు సాధించినవారూ ఉన్నారు. కొన్ని కుటుంబాల్లో అందరూ టీచర్లు కావడం విశేషం. తాజా డీఎస్సీ 16,347 మంది జీవితాల్లో వెలుగులు నింపింది.



విజయలక్ష్మి శ్యామ్




సుందర్‌నాయక్

రాణించిన అక్కాతమ్ముడు

శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలోని లక్ష్మీపురం కాలనీకి చెందిన బాలునాయక్, లీలాబాయి దంపతుల కొడుకు, కుమార్తె ఇద్దరూ ఒకేసారి మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారు. కుమార్తె విజయలక్ష్మి స్కూల్ అసిస్టెంట్ హిందీలో జిల్లాస్థాయి మొదటి ర్యాంక్ కైవసం చేసుకున్నారు. ఆమె తమ్ముడు శ్యామ్‌సుందర్ నాయక్ ఎస్జీటీ ఇంగ్లిష్ విభాగంలో జిల్లా స్థాయి నాలుగో ర్యాంక్ సాధించారు. ఒకేసారి ఇద్దరికీ ఉద్యోగాలు రావడంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. బాలునాయక్, లీలాబాయి దంపతులు రైల్వే స్టేషన్ సమీపంలో మాంసం దుకాణాన్ని నిర్వహిస్తున్నారు.

సత్తాచాటిన అన్నదమ్ములు



నాగరాజు



సంపత్ కుమార్

కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన అన్నదమ్ములు టీచర్ ఉద్యోగాలు సాధించారు. నాగరాజు స్కూల్ అసిస్టెంట్ విభాగం(బయాలజీ)లో 85.6782 మార్కులతో జిల్లా మొదటి ర్యాంకు సొంతం చేసుకున్నారు. దీంతో పాటు ఎస్జీటీలో కూడా అర్హత సాధించారు. తమ్ముడు సంపత్‌కుమార్ టీజీపీ(తెలుగు) విభాగంలో జిల్లాలో ఐదో ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 50వ ర్యాంకు కైవసం చేసుకున్నారు. వీరిది పత్తికొండ మండలం హోసూరు గ్రామం. తండ్రి ఒడుగూరు లింగన్న, తల్లి ఆదిలక్ష్మిలకు నలుగురు కుమారులు. కూలి పనులు చేస్తేనే వీరి కుటుంబం గడిచేది. తండ్రి మరణించడంతో మొదటి, రెండవ కుమారుడు కూలి పనులతో పాటు ఆటో నడుపుతూ తమ్ముళ్లను ఉద్యోగం వైపు నడిపించారు.

కూలీ కుమార్తెకు 3 ర్యాంకులు



విశాఖ నగర పరిధిలోని పోతినమల్లయ్యపాలెం ఆర్ఎస్ కాలనీకి చెందిన రెడ్డి మహాలక్ష్మి మూడు కేటగిరీల్లో ర్యాంకులు సాధించారు. తండ్రి సత్యనారాయణ కూలి పనులు చేస్తూ ఆమెను చదివించారు. స్కూల్ అసిస్టెంట్ (హిందీ పండిట్) కేటగిరీలో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు, పీజీటీ జోన్-1 స్థాయిలో ఐదో ర్యాంకు, టీజీటీ జోన్-3 స్థాయిలో ఎనిమిదో ర్యాంకు కైవసం చేసుకున్నారు. స్కూల్ అసిస్టెంట్ (హిందీ పండిట్) ఉద్యోగాన్ని ఎంపిక చేసుకుంటానని మహాలక్ష్మి తెలిపారు.

ఒకే కుటుంబంలో నలుగురు టీచర్లు



తాడేపల్లిగూడెంకు చెందిన వి.వేణుమాధురి రెండు ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ ఉద్యోగాలు సాధించారు. తండ్రి మోహనరావు స్కూల్ అసిస్టెంట్‌గా, తల్లి శ్రీలక్ష్మి ప్రైమరీ స్కూల్ హెచ్ఎంగా, అక్క అనుచందన మున్సిపల్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఒకే కుటుంబంలో నలుగురు ఉపాధ్యాయులు ఉండటం ప్రత్యేకత.

ఒకేసారి నాలుగు ఉద్యోగాలు




పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం పెద అమిరానికి చెందిన బూరాడ వెంకటకృష్ణ ఒకేసారి నాలుగు ఉద్యోగాలకు అర్హత సాధించారు. స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్, టీజీటీ మ్యాథ్స్, పీజీటి మ్యాథ్స్‌తో పాటు ప్రిన్సిపాల్ పోస్టు సాధించారు. ఆయన భార్య వరలక్ష్మి వేంపాడు గ్రామంలో ఎంపీపీ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్నారు.

నాలుగు కొలువులు



ప్రకాశం జిల్లా కనిగిరి పట్టణానికి చెందిన ఇరువూరి కృష్ణారెడ్డి, పద్మజల కుమార్తె ఇరువూరి వెంకట హర్షిత నాలుగు పోస్టులకు అర్హత పొందారు. సోషల్ స్టడీస్‌లో జిల్లా ఫస్ట్ ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్‌లో 16వ ర్యాంకు, ఎస్జీటీలో 7వ ర్యాంకు, మోడల్ స్కూల్స్ జాబితాలో 4వ ర్యాంకు సాధించారు.

అర్హత సాధించిన అక్కాచెల్లెలు.. ఒకరికి 5 పోస్టులు




కడప జిల్లా పోరుమామిళ్ల మండలం మహబూబ్‌నగర్‌కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు ఖాదర్‌బాషా కుమార్తెలు మెహతాజ్, రేష్మా డీఎస్సీ మెరిట్ ఫలితాల్లో అర్హత సాధించారు. మెహతాజ్ ఐదు పోస్టులకు ఎంపిక కావడం విశేషం. ఎస్జీటీ, ఎస్ఏ (తెలుగు), ఎస్ఏ(సోషల్), టీజీటీ (తెలుగు), టీజీటీ (సోషల్) ఉద్యోగాలు సాధించారు.


కానిస్టేబుల్.. 4 టీచర్ పోస్టులు

ఉమ్మడి చిత్తూరు జిల్లా పుత్తూరు పట్టణానికి మోహన్‌కు తండ్రి లేరు. తల్లి కువైట్‌లో ఉన్నారు. ఆయన దూర విద్యావిధానంలో బీఏ, బీఈడీ పూర్తి చేశారు. ఇటీవల జరిగిన పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలో మూడో ర్యాంకు సాధించారు. తాజాగా డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో జిల్లాలో 23వ ర్యాంకు, తెలుగు విభాగంలో 27, ఎస్జీటీ విభాగంలో 26, టీజీటీ సోషల్ విభాగంలో 35వ ర్యాంకు పొందారు.

అక్కాచెల్లెళ్లు అదుర్స్



రేచెల



హరిత

నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో ఒకే కుటుంబం నుంచి అక్కా చెల్లెళ్లు డీఎస్సీలో సత్తా చాటారు. ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్న నాగరాజు, నాగమణి దంపతుల ఇద్దరు కుమార్తెలు డీఎస్సీ ఫలితాల్లో రాణించారు. పెద్ద కుమార్తె రేచెల ఎస్జీటీలో 84.83941 మార్కులతో జిల్లాలో 275వ ర్యాంక్, చిన్నకుమార్తె హరిత స్కూల్ అసిస్టెంట్(గణితం)గా 81.55 మార్కులతో జిల్లాలో పదో ర్యాంక్‌ను కైవసం చేసుకున్నారు. హరిత టీజీటీ (గణితం)లోనూ 78.823 మార్కులతో జోనల్ స్థాయిలో 7వ ర్యాంక్ సాధించారు.

భార్యాభర్తలు.. ఫిజిక్స్ టీచర్లు



కడప జిల్లా కాశినాయన మండలం ఉప్పలూరు గ్రామానికి చెందిన భార్యాభర్తలు ఫిజిక్స్ టీచర్లుగా ఎంపికయ్యారు. పాలకొలను సుబ్బారెడ్డి ఫిజిక్స్‌లో 77.79 మార్కులతో 3వ ర్యాంక్, ఆయన భార్య వనిపెంట శ్రీలత 75.27 మార్కులతో 13వ ర్యాంక్ సాధించారు. ప్రస్తుతం సుబ్బారెడ్డి ఖాజీపేటలోని ఓ ప్రైవేట్ స్కూల్లో పనిచేస్తుండగా, శ్రీలత సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో టీచర్‌గా ఉన్నారు.

ఒకే ఇంట్లో ముగ్గురు టీచర్లు

కడప నగరానికి చెందిన ఓ కుటుంబంలో ఏకంగా ముగ్గురికి టీచర్ ఉద్యోగాలు వచ్చాయి. అందులోనూ భార్యాభర్తలకు జిల్లా మొదటి ర్యాంకు రావడం విశేషం. సయ్యద్ సనావుల్లా ఉర్దూ ఎస్జీటీగా చాపాడు మండలంలో పనిచేస్తున్నారు. మెగా డీఎస్సీ 2025లో మరోమారు తన అదృష్టాన్ని పరీక్షించుకోగా.. ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్‌లో 59.87 మార్కులతో జిల్లా మొదటి ర్యాంక్ సాధించారు. ఆయన భార్య నజీహా కరీమ్ ఇంట్లో ఇద్దరు పిల్లల్ని చూసుకుంటూ డీఎస్సీకి ప్రిపేర్ అయ్యారు. 84.07 మార్కులతో ఎస్జీటీ ఉర్దూ విభాగంలో మొదటి ర్యాంక్ సొంతం చేసుకున్నారు. అలాగే సయ్యద్ సనావుల్లా సోదరి సయ్యద్ రేష్మ ఉర్దూ ఎస్జీటీ ఈడబ్ల్యూఎస్ విభాగంలో జిల్లా 20వ ర్యాంక్ తెచ్చుకున్నారు. ఒకే ఇంట్లో ముగ్గురికి ప్రభుత్వ ఉద్యోగాలు రావడంతో బంధుమిత్రులు అభినందనలు తెలుపుతున్నారు.

ఒకేసారి మూడు ఉద్యోగాలు



ఉదయ్‌కుమార్



గంజపురి రేవతి

శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండల కేంద్రానికి చెందిన ఉదయ్ కుమార్ డీఎస్సీలో ఒకేసారి మూడు ఉద్యోగాలు సంపాదించారు. పీజీటీ సోషల్ స్టడీస్‌లో జిల్లా స్థాయి 2వ ర్యాంక్(73 మార్కులు), స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్‌లో జిల్లా స్థాయి 7వ ర్యాంక్(83.39 మార్కులు), టీజీటీ సోషల్ స్టడీస్‌లో 10వ ర్యాంక్ (79.12 మార్కులు) సాధించారు. 2012 నుంచి డీఎస్సీ పరీక్షలు రాస్తున్నారు. ప్రతిసారి తృటిలో ఉద్యోగం కోల్పోయినా నిరాశ చెందకుండా కృషి చేసి అద్భుత విజయం సాధించారు. తన తల్లి, భార్య ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైందని ఉదయ్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. ముదిగుబ్బ మండల పరిధిలోనే ఎనుములవారిపల్లి గ్రామానికి చెందిన గంజపురి రేవతి మూడు ఉద్యోగాలకు అర్హత సాధించారు. డీఎస్సీ మెరిట్ లిస్ట్‌లో 9వ ర్యాంక్‌తో స్కూల్ అసిస్టెంట్, 6వ ర్యాంక్‌తో పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ), ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ) పోస్టులకు అర్హత పొందారు. వీరిది రైతు కుటుంబం.

టీచర్ కాదు సైకో!

- విద్యార్థులపై కారం కొట్టి

చిత్ర హింసలు పెట్టిన ఉపాధ్యాయుడు

నందిపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అల్లరి చేస్తున్న విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టేందుకు ఉపాధ్యాయులు వారిని మందలించి.. దండించడం సహజమే. కానీ ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మాత్రం విచక్షణ కోల్పోయి చిన్న పిల్లలని కూడా చూడకుండా విద్యార్థుల పట్ల సైకోలా ప్రవర్తించాడు. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం ఖుద్వాన్‌పూర్ గ్రామంలోని మండల ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో 4 రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. శంకర్ అనే ఆ పాఠశాల ఉపాధ్యాయుడు 2, 3 తరగతులకు చెందిన 10 మంది విద్యార్థులపై మధ్యాహ్న భోజ న పథకం సిబ్బంది వద్ద నుంచి తెచ్చిన కారం చల్లి, ఆపై కొట్టి ప్రతాపం చూపెట్టాడు. అప్పట్నించి విధులకు డుమ్మా కొట్టిన శంకర్.. శనివారం పాఠశాలకొచ్చాడని తెలుసుకున్న బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు రావడంతో తనపై దాడి చేస్తారేమోనని పరారయ్యాడు. అతనిపై దాడికి కూడా గ్రామస్థులు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఎంఈవో పాఠశాలకు వచ్చి విచారణ చేపట్టారు.

గోదావరి-కావేరీ లింకుతో.. కృష్ణా బేసిన్‌లో రెండు రిజర్వాయర్లు..!

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరీ అనుసంధానంలో వాటాగా వచ్చే నీటిని సమ్మక్కసాగర్ బ్యారేజీ పరిసరాల్లో కాక కృష్ణా బేసిన్‌లో 2 రిజర్వాయర్లు కట్టుకొని, వినియోగించుకోవాలని తెలంగాణ నిర్ణయించింది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలకు కృష్ణా జలాల పంపిణీపై విచారణ జరుగుతుండగా.. ఏడాదిలోపు తీర్పు వెలువడే అవకాశాలున్నాయి. ఆ తర్వాత కృష్ణా ట్రైబ్యునల్ నీటిని కేటాయించని ప్రాంతాల్లో నీటి వినియోగానికి రిజర్వాయర్లను నిర్మించాలని నిర్ణయం తీసుకుంది. ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోని వాటా నుంచి 147 టీఎంసీలను జీసీ లింకుకు తొలి దశలో తరలించాలని ఎన్‌డబ్ల్యూడీఏ నిర్ణయించింది.

లోకం తీరు



వైసీపీ ప్రతిపక్షం కాదు.. విషవృక్షం





పెద్దాపురంలో ప్రజావేదికపై స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రమాణం చేయిస్తున్న సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

వదల బొమ్మాళి.. వదల.. తరహాలో మళ్లీ అది పైకి వస్తోందంటూ చంద్రబాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. భవిష్యత్తులో వైసీపీ మునగడం, భూస్థాపితం కావడం ఖాయమన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలోనూ, అమరావతి ఉండవల్లిలో పార్టీ నేతలతో జరిగిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా జగన్, వైసీపీ రాజకీయాలపై తీవ్ర స్వరం వినిపించారు. పదేళ్లలో వైసీపీ పది అరాచక అబద్ధాలను పెద్దాపురం సభలో వినిపించారు. తొలుత ఈ పట్టణంలో స్వచ్ఛతా ర్యాలీలో పాల్గొని అనంతరం నిర్వహించిన ప్రజావేదిక సభలో ప్రసగించారు. సూపర్ సిక్స్... సూపర్ హిట్ అయిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇంత భారీ స్థాయిలో సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ మనకు వైకుంఠపాళీ ఆట వద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే..

సూపర్ సిక్స్...హిట్ కొట్టాం..

"రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమ ప్రాధాన్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకువెళ్తోంది. మా మూడు పార్టీల ఆలోచన, ఆశయం ఒక్కటే. సంపద సృష్టించడం, తద్వారా ఆదాయం పెంచడం, తిరిగి ప్రజలకు సంక్షేమం రూపంలో అమలు చేయడం ఎలాగో ప్రభుత్వానికి తెలుసు. కానీ అప్పులు చేసి సంక్షేమం అమలుచేయడం, దోపిడీలకు పాల్పడం గత పాలకుల నైజం. ఏ వ్యక్తి అయితే సంపద సృష్టిస్తాడో అతడికే సంక్షేమ పథకాలు అమలుచేసే అర్హత ఉంది. ఎన్నికలప్పుడు టీడీపీ అధికారంలోకి రాగానే సూపర్‌సిక్స్ అమలు చేస్తాం అంటే చాలామంది సాధ్యం కాదన్నారు. కానీ ఇప్పుడు అన్నింటినీ అమలుచేసి చూపించాం. సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశాం. ఈ ఆగస్టు నెలనే తీసుకుంటే ఎన్నో పథకాల ద్వారా సంక్షేమ పథకాలు అమలుచేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాం. నేను మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం గురించి చెబితే ఎగతాళి చేశారు. కానీ నేడు ఆడబిడ్డలు ఎంచక్కా ఎక్కడకు కావాలంటే అక్కడకు ఉచిత బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. శ్రీశైలం, సింహాచలం, తిరుపతి వెళ్లాలన్నా వెళ్లొచ్చు.."

మ్యాజిక్ డ్రెయిన్ పట్ల సీఎం ఆసక్తి

పెద్దాపురం పట్టణంలోని పదో వార్డులోని మ్యాజిక్ డ్రెయిన్‌ను పరిశీలించారు. ఇంకుడు గుంత తరహాలో ఈ డ్రెయిన్ ద్వారా భూగర్భ జలాలను పెంచేలా నిర్మించారు. దానిని ఆయన ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం యాక్సిస్ బ్యాంకు 55,686 మంది పారిశుధ్య కార్మికులకు ప్రమాదబీమా సౌకర్యం కల్పించే కార్యక్రమం చంద్రబాబు సమక్షంలో జరిగింది. బాధిత కార్మికుడి కుటుంబానికి కోటి రూపాయలు, అవుట్‌సోర్సింగ్ అయితే రూ.20 లక్షల వరకూ దీనివల్ల పరిహారం అందుతుంది. ముగ్గురు కుటుంబ సభ్యులకు రూ.15 లక్షల వరకూ బీమా వర్తింపజేస్తారు. ఎడ్యుకేషన్ గ్రాంటు, ఇతర సౌకర్యాలు ఉన్నాయి. అలాగే అక్టోబరు 2న స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా 16 కేటగిరీల కింద అవార్డులు ఇస్తున్నామని సీఎం తెలిపారు. ఉత్తమ మునిసిపాలిటీ, గ్రామ పంచాయతీ, స్కూల్, అంగన్‌వాడీ కేంద్రం, హాస్టల్, మురికివాడ, విలేజి లెవిల్ ఫెడరేషన్, బస్‌స్టేషన్, రైతుబజారు, పరిశ్రమ, ఎన్‌జీవో, శానిటరీ వర్కర్లు.. ఇలా పలు కేటగిరిల్లో అవార్డులు అందిస్తారు.



కాకినాడ జిల్లా పెద్దాపురంలో తడి, పొడి చెత్త వాహనాన్ని తోస్తున్న సీఎం చంద్రబాబు

నేతల విగ్రహాల్ని అవమానిస్తే సహించబోం

కైకలూరు ఘటనపై చంద్రబాబు సీరియస్

కైకలూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): దివంగత నేత వంగవీటి మోహనరంగా విగ్రహంపై ఆగంతుకులు దుశ్చర్యకు పాల్పడిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. నేతల విగ్రహాలను అవమానిస్తే సహించబోమని హెచ్చరించారు. శనివారం ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం కలిదిండిలో మోహనరంగా విగ్రహానికి పేడ పూసి కొందరు ఆగంతకులు అవమానించారు. ఈ ఘటనకు పాల్పడినవారిని పట్టుకుని శిక్షించాలని పోలీసు డిపార్టుమెంటును చంద్రబాబు ఆదేశించారు.

ఫేక్ ప్రచారాలు.. అబద్ధపు రాతలు..

"గత ఎన్నికల్లో దుర్మార్గులకు ఓటు వేశారు. దీంతో నేర మనస్తత్వం ఉన్నవారు అధికారంలోకి వచ్చారు. నా జీవితంలో వైసీపీ లాంటి పార్టీని, జగన్ వంటి నాయకుడిని చూడలేదు. టీడీపీ, పవన్‌కల్యాణ్, బీజేపీకి సొంతంగా టీవీ లేదు, పేపర్ లేదు. కానీ జగన్‌కు మాత్రం పేపర్, టీవీ ఉన్నాయి. వీటిని తప్పుడు వార్తలు రాసేందుకు, ఫేక్ ప్రసారానికి వాడుతున్నారు. హత్యలు, దొంగతనాలు చేసే వారంతా వైసీపీలోనే ఉన్నారు. సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారాలు, రౌడీ రాజకీయాలు చేస్తున్నారు. తప్పుడు విధానాలే వీరి అజెండా. 2019-2024లో వైకుంఠపాళీ ఆటలా పైనుంచి కిందకు దిగి వచ్చాం. మనకు వైకుంఠపాళీ ఆట వద్దు. అభివృద్ధి కావాలి, పేదరికం పోవాలి. అందుకే పీ4 తీసుకువచ్చాం." అని చంద్రబాబు అన్నారు. అనంతరం పీ 4 కింద 50 బంగారు కుటుంబాలను లలిత ఇండస్ట్రీస్, పట్టాభి ఆగ్రో ఫుడ్స్ అధినేతలు చంద్రబాబు సమక్షంలో దత్తత తీసుకున్నారు.

ఈ పదీ అందరికీ చెప్పండి : సీఎం

వైసీపీ కుట్ర రాజకీయాలకు పదేళ్లలో పది ఉదాహరణలున్నాయంటూ.. వాటిని చంద్రబాబు సభలో వినిపించారు.

1) సొంత చిన్నాన్న వివేకానందరెడ్డి దారుణంగా హత్య చేశారు. పేపర్లో నా చేతిలో గొడ్డలి పెట్టి నేను చంపినట్టు తప్పుడు ప్రచారం సాగించారు.
2) విశాఖలో కోడి కత్తి డ్రామా ఆడారు. కోడికత్తితో దాడి చేసిన వారితో నేను మాట్లాడానని ప్రచారం సాగించారు. ఇదొక మిస్టరీగా తయారైంది.
3) ఎన్నికలప్పుడు గులకరాయి డ్రామా ఆడారు. విజయవాడలో ఓ అమాయకుడిని హింస పెట్టారు.
4) పోలవరం డయాఫ్రం వాల్ కట్టకుండా నిర్లక్ష్యం చేశారు. దీనివల్ల డయాఫ్రం వాల్ కొట్టుకుపోతే అదీ నావల్లే అని ప్రచారం చేశారు.
5) వైసీపీకి వలంటీర్లు ఎన్నికల ప్రచారం చేస్తుంటే వారు లేకుండా పింఛన్లు ఇవ్వాలని చెప్పాం. ఆ సాకుతో పింఛన్లు ఇవ్వకుండా తిప్పి 15 మంది వృద్ధుల చావుకు కారణమయ్యారు. ఆ నెపాన్ని కూడా నా పైకి నెట్టే ప్రయత్నం చేశారు.
6) నేను ఎక్కడికి వెళ్లినా రాష్ట్రంలో పనులు బాగా చేస్తున్నారని చెబుతున్నారు. మీ ప్రాంతంలో ఒక భూతం ఉందని వారు అంటే, దానిని పాతాళంలో బిగించామని చెబుతున్నా. కానీ, అది మళ్లీ పైకి రావడానికి ప్రయత్నం చేస్తోంది.
7) మొన్న జగన్ కారు కింద పడి సింగయ్య అనే వైసీపీ కార్యకర్త చనిపోయాడు. ముందేమో అసలు మా కారు కింద పడలేదన్నారు. ఇప్పుడు ఆ వీడియోలు బయట పడితే మృతుడి భార్యను బెదిరించి అంబులెన్స్ వాళ్లే చంపేశారని చెప్పించారు.
8) మొన్న జగన్ నెల్లూరు వెళ్లినప్పుడు మనుషులు రాలేదు. దీంతో బంగారుపాళ్యం ఫొటోలను మార్ఫింగ్ చేసి ప్రచారం చేశారు
9) వర్షాలకు అమరావతి మునిగిపోయిందని దుష్ప్రచారం చేస్తున్నారు. నేను ఒక్కటే చెబుతున్నా. అమరావతి మునగలేదు. మునిగిపోయింది వైసీపీ. భూస్థాపితం కాబోయేది కూడా ఆ పార్టీయే.
10) గత ప్రభుత్వంలో పింఛన్లు వికలాంగులు కానివారికి ఇచ్చారు.అర్హులకే పింఛన్లు ఇవ్వాలని మేంచూస్తున్నాం. దీనిపైనా బురద చల్లుతున్నారు.

కాన్వాయ్‌కి అడ్డు వెళ్లిన రైతు

పెద్దాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు కాన్వాయ్‌లో హఠాత్పరిణామం జరిగింది. తన భూమి ఆన్‌లైన్‌లో తక్కువగా చూపిస్తోందని న్యాయం చేయాలంటూ ఫ్లెక్సీతో చంద్రబాబు కాన్వాయ్‌పైకి ఓ వ్యక్తి దూసుకువచ్చాడు. గొల్లప్రోలుకు చెందిన గంగాధర్ అనే వ్యక్తి కాన్వాయ్‌కు అడ్డుగా వెళ్లడంతో పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. వెంటనే చంద్రబాబు కాన్వాయ్ ఆపి బాధితుడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకూ 70సార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని వివరించాడు. గంగధర్ ఫిర్యాదుపై సీఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్‌ను పిలిచి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



సీఎం చంద్రబాబు కాన్వాయ్‌ని అడ్డుకుని తన సమస్యను తెలియజేస్తున్న గొల్లప్రోలుకు చెందిన రైతు

చెత్తపనులు చేసిపోయారు

"ముఖ్యమంత్రిగా నేను పెద్ద పెద్ద ప్రారంభోత్సవాల కోసం ఇక్కడకు రాలేదు. మీ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పడానికే వచ్చా. రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్ కావాలంటే ప్రతి ఒక్కరి ఆలోచనలు మారాలి. గత ప్రభుత్వం చెత్తపై పన్ను వేసింది. కానీ, చెత్త చెత్తగా రాష్ట్రాన్ని వదిలేసిపోయింది. ఎన్నికల సమయంలో నేను, పవన్, బీజేపీ ఒక్కటే చెప్పాం. మళ్లీ వస్తాం...ప్రక్షాళన చేస్తాం అని చెప్పాం. ఇప్పుడు చేసి చూపిస్తున్నాం. కేబినెట్‌లో తాజాగా సర్క్యులర్ ఎకానమీ పాలసీని ఆమోదించాం."

ఫేక్ ప్రచారాలను ఉపేక్షిస్తే ప్రమాదకరం

పార్టీ నేతల భేటీలో చంద్రబాబు వెల్లడి

అమరావతి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తప్పుడు ప్రచారాలతో రాజకీయాలు చేస్తున్నవారిని ఉపేక్షించడానికి వీల్లేదని సీఎం చంద్రబాబు అన్నారు. "వాళ్లు ఫేక్ ప్రచారాలను రాజకీయ సిద్ధాంతంగా పెట్టుకుని రాజకీయం చేస్తున్నారు. ప్రజల సమస్యలు, ప్రజల ప్రయోజనాలు వాళ్లకు అనవసరం. వాళ్లకు కావాల్సింది రాద్ధాంతం.. తప్పుడు ప్రచారం, మంచిపై చర్చ జరగకుండా చూడటం.' అని ముఖ్యమంత్రి చంద్రబాబు వైసీపీ ఫేక్ ప్రచారాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన పార్టీ నేతల సమావేశంలో సీఎం మాట్లాడారు. వైసీపీ సోషల్ మీడియా నిత్యం తప్పుడు ప్రచారంతో ప్రభుత్వ పథకాలపై, మంచి కార్యక్రమాలపై చర్చ జరగకుండా చేస్తోందని సీఎం మండిపడ్డారు. నీచస్థాయి పార్టీ చేసే చిల్లర రాజకీయాలు వైసీపీ చేస్తోందని, వాళ్లే వివాదం సృష్టించి, వాళ్లే నేరాలు చేసి మళ్లీ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహించారు.

కొత్త నేతలకు పార్టీ పదవులు

- క్లస్టర్ ఇన్‌చార్జులకు జిల్లా కమిటీల్లో చోటు
- కమిటీ నియామకంలో సోషల్ ఇంజనీరింగ్
- పార్టీ నేతల సమావేశంలో సీఎం చంద్రబాబు
- 6న 'సూపర్ సిక్స్-సూపర్ హిట్'కు శ్రీకారం

అమరావతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): టీడీపీని మరింత బలోపేతం చేస్తున్నామని పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు తెలిపారు. యువతకు అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శనివారం పార్టీ నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "తెలుగుదేశం సిద్ధాంతం చాలా బలమైంది. అందుకే ఇన్నేళ్లుగా ప్రజాదరణ పొందుతోంది. పార్టీపై దృష్టి సారించా. పార్టీలో కింది స్థాయి నుంచి పై వరకు బలమైన నిర్మాణం చేస్తున్నాం. పార్లమెంటు కమిటీల నియామకం అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా జరగాలి. కమిటీ నియామకంలో సోషల్ ఇంజనీరింగ్ జరగాలి. యువతకు అవకాశం కల్పించాలి. అన్ని వర్గాల నుంచి బలమైన నేతలకు అవకాశం ఇవ్వా లి." అని తేల్చిచెప్పారు. మొహమాటాలకు పోయి బలహీనంగా ఉన్న వారికి పదవులు ఇస్తే ప్రభుత్వం, పార్టీ కూడా నష్టపోతాయని పేర్కొన్నారు. ఇప్పటికే పార్టీ పదవుల్లో ఉండి.. కార్పొరేషన్ల చైర్మన్‌లో, ఇతర పదవులో పొందిన వారి స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించనున్నట్టు చంద్రబాబు వివరించారు.

బాధ్యతగా ఉండాలి..

పార్టీలో ప్రతి ఒక్కరూ చాలా బాధ్యతగా ఉండాలని చంద్రబాబు సూచించారు. పార్టీ, ప్రభుత్వ స్థాయిని పెంచేలా నేతల తీరు ఉండాలన్నారు. ఆరోపణలు రాకుండా చూసుకోవాలని, తప్పు చేస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించబోనని తేల్చి చెప్పారు. రెండో అవకాశం కూడా ఇవ్వబోనన్నారు. కార్యకర్త నుంచి ఎమ్మెల్యే, ఎంపీల వరకు ఎవ్వరిపైనా ఆరోపణలు రాకూడదనే లక్ష్యంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. "మీపైన ఆరోపణలు వస్తే వాటిలో మీ ప్రమేయం లేదని మీరే నిరూపించుకోండి. పార్టీ మీకు అండగా నిలుస్తుంది. మీ కారణంగా పార్టీకి, ప్రభుత్వానికి నష్టం జరగకూడదనే బాధ్యతతో పని చేయండి. ప్రజాప్రతినిధులు కార్యకర్తలకు సమయం ఇచ్చి సమస్యలు పరిష్కరించాలి. మిత్రపక్షాలను సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలి." అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

1 నుంచి క్యాడర్‌కు శిక్షణ

వచ్చే నెల 6న అనంతపురంలో 'సూపర్ సిక్స్.. సూపర్ హిట్' కార్యక్రమం నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. మరోవైపు, వచ్చే నెల 1 నుంచి పార్టీ క్యాడర్‌కు శిక్షణ తరగతులను నిర్వహించనున్నారు.

నెలాఖరులోగా కొలిక్కి!

పార్లమెంటరీ పార్టీ కమిటీల నియామకంపై చంద్రబాబు కసరత్తు మొదలుపెట్టారు. ఈ కమిటీల ఏర్పాటు కోసం నియమించిన త్రిసభ్య కమిటీలతో జరిగిన సమావేశంలో ఈ నెలాఖరులోగా సంస్థాగత ఎన్నికల కసరత్తు కొలిక్కి రావాలని దిశానిర్దేశం చేశారు. 24, 25, 26 తేదీల్లో పార్లమెంటు కమిటీలకు ప్రతిపాదనలు స్వీకరించేందుకు సమావేశాలు జరగనున్నాయి. ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి 34 మంది సభ్యులతో టీడీపీ పార్లమెంటు కమిటీని ఏర్పాటు చేస్తారు. ఈసారి కొత్తగా పార్టీ కార్యాలయ, సోషల్ మీడియా, మీడియా కార్యదర్శులకూ పార్లమెంటు కమిటీలో స్థానం కల్పించారు. టీడీపీ పార్లమెంటు కమిటీతోపాటు 28 మందితో అనుబంధ విభాగాల కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. వివిధ సామాజికవర్గాలకు సంబంధించి పార్లమెంటు పరిధిలో 54 సాధికార సమితులు ఏర్పాటు చేయనున్నారు. పార్లమెంటు పరిధిలోని పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యుల అభిప్రాయాలు తీసుకుని కమిటీలను భర్తీ చేస్తారు.

బిలియనీర్ చంద్రబాబు

అత్యంత సంపన్న సీఎంల జాబితాలో అగ్రస్థానం

న్యూఢిల్లీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): దేశంలోని అత్యంత సంపన్న ముఖ్యమంత్రుల జాబితాలో ఏపీ సీఎం చంద్రబాబు అగ్రస్థానంలో నిలిచారు. ఆయనకు రూ.931 కోట్లకుపైగా ఆస్తులు ఉన్నాయి. రూ.332 కోట్లకుపైగా ఆస్తులతో అరుణాచల్‌ప్రదేశ్ సీఎం పెమా ఖండు రెండో స్థానంలో, రూ.51 కోట్ల ఆస్తులతో కర్ణాటక సీఎం సిద్దరామయ్య మూడో స్థానంలో ఉన్నారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ రూ.15 లక్షలకుపైగా ఆస్తితో ఈ జాబితాలో చివరి స్థానంలో నిలిచారు. దేశంలోని 30 మంది ముఖ్యమంత్రులు ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ రూపొందించిన నివేదిక ఈ విషయాలను వెల్లడించింది. 30 మంది సీఎంల సగటు ఆస్తులు రూ.54.42 కోట్లు. వీరి ఆస్తుల మొత్తం రూ.1,632 కోట్లు. వీరిలో ఇద్దరు మాత్రమే బిలియనీర్లు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి రూ.30 కోట్ల ఆస్తి, రూ.కోటి అప్పు ఉంది. సంపన్న సీఎంల జాబితాలో ఆయన 7వ స్థానంలో ఉన్నారు. జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లాకు రూ.55 లక్షలు, కేరళ సీఎం పినరయి విజయన్‌కు రూ.కోటి ఆస్తి ఉన్నట్టు నివేదిక తెలిపింది. ఇక అప్పుల విషయానికి వస్తే పెమా ఖండుకు రూ.180 కోట్లు, సిద్దరామయ్యకు రూ.23 కోట్లు, చంద్రబాబుకు రూ.10 కోట్ల అప్పులు ఉన్నాయి.

బాబు యాజమాన్య స్ఫూర్తిని వెల్లడించిన నివేదిక

చంద్రబాబు 5 దశాబ్దాలుగా చేసిన రాజకీయ ప్రస్థానం ఒకవైపు అయితే, వ్యాపార రంగంలో ఆయన సాధించిన విజయాలు మరో వైపు. 33 ఏళ్ల క్రితం ఎలాంటి ప్రభుత్వ మద్దతు లేకుండా చంద్రబాబు స్థాపించిన డెయిరీ సంస్థలో ఆయన కుటుంబ సభ్యుల వాటా మూలంగా ఆయన సంపద పెరిగింది. ఎన్నికలలో పోటీ చేసే సమయంలో సమర్పించిన అఫిడవిట్‌లలో ఆ వివరాలను పేర్కొన్నారని ఏడీఆర్ తెలిపింది. హెరిటేజ్ సంస్థలో జీవిత కాలం వాటాదారులు 1,81,907 వరకు ఉన్నారు. ఈ సంస్థ పూర్తిగా డెయిరీ ఉత్పత్తులతో వ్యాపారం చేస్తోందని, మౌలిక సదుపాయాల వంటి ఎలాంటి క్రోనీ క్యాపిటల్ వ్యాపారం చేయలేదని హెరిటేజ్ ఫుడ్స్ అధికారులు తెలిపారు. ఈ సంస్థ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో స్థానం సంపాదించిన ఎన్నో ఏళ్లకు చంద్రబాబు సీఎం అయ్యారని చెప్పారు. పాల వ్యాపారులకు మార్కెట్ సమస్యలు తీవ్రంగా ఉన్న తరుణంలో ఆయన ఈ వ్యాపారాన్ని చెపట్టారని తెలిపారు. హెరిటేజ్ తన ఉత్పత్తిని 1993లో ప్రారంభించగా, 1994లో ఐపీఓలు విడుదల చేసిందని, 54 రెట్లపైగా వాటాదారులు చేరడంతో దాని వాటాలను బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్టింగ్ చేశారన్నారు. తొలి ఏడాదే హెరిటేజ్ ఫుడ్స్ రూ.1.60 కోట్లతో తొలి పాల చిల్లింగ్ యూనిట్‌ను చిత్తూరులో ప్రారంభించిందన్నారు. 1994లో చంద్రబాబు మంత్రిగా బాధ్యతలు చేపట్టాల్సి రావడంతో కంపెనీకి రాజీనామా చేశారని, తర్వాత ఆయన సతీమణి భువనేశ్వరి బాధ్యతలు చేపట్టారని తెలిపారు. ప్రస్తుతం ఆ సంస్థకు ఆమె ఎండీ కాగా, చంద్రబాబు కోడలు, నారా లోకేశ్ సతీమణి బ్రాహ్మణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నారు. కోవిడ్ తర్వాత అప్పు నుంచి పూర్తిగా బయటపడింది.



హెరిటేజ్ వాటాలే!

చంద్రబాబుకు హెరిటేజ్ ఫుడ్స్‌లో ఎలాంటి షేర్లూ లేనప్పటికీ, 1992లో రూ.7,000 పెయిడప్ పెట్టుబడి, రూ.కోటి అధీకృత పెట్టుబడితో స్థాపించిన ఈ సంస్థలో ఆయన భార్య భువనేశ్వరికి 24.37 శాతం వాటా ఉంది. ఈ వాటాను ఏపీ సీఎం సంపదగా పరిగణించారు. నారా కుటుంబానికి(ప్రమోటర్లు) హెరిటేజ్ ఫుడ్స్‌లో మొత్తం 41.3 శాతం వాటా ఉంది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ 1995లో రూ.25 కోట్ల నుంచి తాజాగా రూ.4,381 కోట్లకు(శుక్రవారం షేర్ల ముగింపు ధర ప్రకారం) పెరిగింది.

నేడు సురవరం అంతిమ యాత్ర

మధ్యాహ్నం 3 గంటలకు అంతిమయాత్ర

డి.రాజా, కూనంనేని నివాళులు

- సీఎం చంద్రబాబు సహా ప్రముఖుల సంతాపం
- కమ్యూనిస్టు అత్యున్నత నాయకుల్లో ఒకరు : సీపీఐ

న్యూఢిల్లీ, హైదరాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో జరగనున్నాయి. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఈమేరకు అధికారులను శనివారం ఆదేశించారు. సురవరం అంతిమయాత్రను ఆదివారం నిర్వహిస్తున్నామని సీపీఐ పార్టీ ప్రకటించింది. సురవరం భౌతికకాయాన్ని ఆదివారం ఉదయం 9 గంటలకు గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రి నుంచి హిమాయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయం(మగ్దూం భవన్)కి తరలిస్తారు. 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భౌతికకాయాన్ని ప్రజల సందర్శనకు ఉంచుతారు. అనంతరం గాంధీ వైద్య కళాశాల వరకు అంతిమయాత్ర నిర్వహిస్తారు. భౌతికకాయాన్ని వైద్యకళాశాలకు అప్పగించనున్నారు. కాగా, పార్టీ శ్రేణులు ఎర్ర వస్త్రాలు ధరించి అంతిమయాత్రలో పాల్గొనాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు.

జీవితం ప్రజాపోరాటలకు అంకితం: దేశంలోని అణగారిన వర్గాల ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) కొనియాడింది. భారత కమ్యూనిస్టు అత్యున్నత నాయకుల్లో ఒకరిగా సురవరం ఎప్పటికీ గుర్తుండిపోతారని పేర్కొంది. ఈ మేరకు ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సురవ రం చిత్రపటానికి సీపీఐ నేతలు నివాళులర్పించారు. సురవరం మరణానికి సంతాపంగా పార్టీ జెండా అవనతం చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) ప్రధాన కార్యదర్శిగా, అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) అధ్యక్షుడిగా సురవరం చేసిన ప్రజాపోరాటాలను గుర్తు చేసుకున్నారు. నల్లగొండ లో ఫ్లోరైడ్ కాలుష్యం, రైతుల సమస్యలు, నల్లధనం, 2జీ కుంభకోణం వంటి అంశాలపై పార్లమెంటులో చేసిన ప్రసంగాలతో సురవరం అన్ని పార్టీల గౌరవ మర్యాదలు చూరగొన్నారని స్మరించుకున్నారు. ఇక, హైదరాబాద్ కేర్ ఆస్పత్రిలో ఉన్న సురవరం భౌతికకాయాన్ని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని పలువురు నేతలు శనివారం సందర్శించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో సురవరం చిత్రపటానికి నివాళి అర్పించారు. సురవరం ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు పని చేస్తామన్నారు. తెలు గు రాష్ట్రాలకు ఇష్టమైన అతికొద్ది మందిలో సురవరం ఒకరని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

ప్రముఖుల సంతాపం

సురవరం సుధాకర్‌రెడ్డి మరణం పట్ల ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం స్టాలిన్, కేరళ సీఎం పినరయి విజయన్ సహా పలువురు ప్రముఖులు సంతాపం తెలియజేశారు. అనునిత్యం ప్రజల కోసమే పని చేసే సురవరం ఇక లేరంటే నమ్మలేకపోతున్నానని చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సురవరం కుటుంబసభ్యులకు తన సానుభూతి తెలియజేశారు. న్యాయం కోసం, ఆత్మగౌరవం కోసం సురవరం సాగించిన ఉద్యమ జీవితం స్ఫూర్తిదాయకమని తమిళనాడు సీఎం స్టాలిన్ పేర్కొన్నారు. సురవరం కమ్యూనిస్టు నాయకుడే కాక గొప్ప పార్లమెంటేరియన్ అని కేరళ సీఎం పినరయి కొనియాడారు. ఏపీ మంత్రి నారా లోకేశ్ కూడా సురవరం మృతికి సంతాపం తెలియజేశారు. ఇక, విద్యార్థి దశ నుంచే ప్రజాపోరాటాల్లో భాగస్వామిగా ఉంటూ అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితం దారబోసిన వ్యక్తి సురవం సుధాకర్ రెడ్డి అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. పీడిత ప్రజల కోసం జీవితాన్ని అర్పించి అనేక ప్రజాపోరాటాలు చేసిన ఉద్యమనేత సురవరం సుధాకర్ రెడ్డి అని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న పేర్కొన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల సీపీఐ(ఎం) సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే పాటూరి రామయ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కౌన్సిల్ అధ్యక్షులు అనిల్ సంతాపం వ్యక్తం చేశారు.



సుధాకర్‌రెడ్డి భౌతిక కాయం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా తదితరులు

నాటి సీఎం కోట్లపై పోటీ

సురవరం సుధాకర్‌రెడ్డి సీపీఐ తరపున 1980 నుంచి ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగారు. 1994లో కర్నూల్ జిల్లాలోని డోన్ నియోజకవర్గంలో అప్పటి సీఎం కోట్ల విజయభాస్కర్‌రెడ్డిపై పోటీ చేసి ఓడిపోయారు. అంతకుముందు 1980, 1985నాటి ఎన్నికల్లో మహబూబ్‌నగర్ జిల్లాలోని కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత మళ్లీ 1998, 2004లో నల్లగొండ ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. ఉమ్మడి ఏపీలో జరిగిన విద్యుత్ ఉద్యమంలో సురవరం కీలకంగా వ్యవహరించారు. ఆ ఉద్యమానికి సంబంధించిన ఓ ఫొటో ఇది. ఈ ఫొటోను చూసి సీపీఐ వర్గాలు నాటి ఉద్యమంలో సురవరం పాత్రను గుర్తు చేసుకుంటున్నాయి.

ఏడాదికి 50 రాకెట్లు ప్రయోగించగలమా?

» అంతరిక్ష శాస్త్రవేత్తలను ప్రశ్నించిన ప్రధాని మోదీ

» ప్రైవేటు రంగం ముందుకొచ్చి సహకరించాలని పిలుపు



న్యూఢిల్లీ, ఆగస్టు 23: అంతరిక్ష రంగంలో భారత్ వరుస విజయాలతో దూసుకెళ్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రైవేటు రంగం ముందుకొచ్చి సహకరించాలని పిలుపునిచ్చారు. ఏటా 5 నుంచి 6 ప్రధాన రాకెట్లను ప్రయోగిస్తున్నామని.. ప్రతి ఏడాది 50 రాకెట్లను ప్రయోగించే స్థాయికి మనం చేరుకోగలమా..? అంటూ అంతరిక్ష శాస్త్రవేత్తలు, ఇంజనీర్లను ప్రశ్నించారు. శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధాని మాట్లాడారు. భవిష్యత్తులో చేపట్టే మిషన్ల కోసం భారత్ వ్యోమగాముల సమూహాన్ని ఏర్పాటు చేయబోతోందని.. ఇందులో యువత కూడా పాలుపంచుకోవాలని కోరారు. 'మనం చంద్రుడు, అంగారక గ్రహాన్ని ఇప్పటికే చేరుకున్నాం. ఇప్పుడు ఇంకా లోతైన అంతరిక్షంలోకి తొంగి చూడాలి.. అక్కడే మానవాళి భవిష్యత్తుకు ప్రయోజనం చేకూర్చే అనేక రహస్యాలు దాగి ఉన్నాయి. త్వరలోనే గగన్‌యాన్ మిషన్‌ను ప్రారంభించబోతున్నాం. అలాగే సొంత స్పేస్ స్టేషన్‌ను కూడా నిర్మించుకోబోతున్నాం' అని చెప్పారు.

శబరిమలలో భక్తుల భద్రతకు సాంకేతిక కమిటీ

» కేఎస్ఈబీ, టీడీబీ కలిసి ఏర్పాటు చేయాలన్న కేరళ హైకోర్టు

కోచి, ఆగస్టు 23: శబరిమలకు వచ్చే భక్తుల భద్రత ముఖ్యమని కేరళ హైకోర్టు స్పష్టం చేసింది. రెండు వేర్వేరు తీర్పుల్లో.. విద్యుదాఘాతం వంటి ఘటనలు జరగకుండా సాంకేతిక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విభాగాలు, ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ)లను ఆదేశించింది. గత నెల ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన ఓ భక్తురాలు శబరిమల దర్శనానికి వచ్చి, తాగునీటి కియోస్క్ వద్ద నీళ్లు తాగుతుండగా.. విద్యుదాఘాతంతో మరణించిన విషయం తెలిసిందే..! ఈ అంశాన్ని కేరళ హైకోర్టు సుమోటోగా తీసుకుంది. దీనిపై కోర్టు శుక్రవారం తీర్పును వెలువరిస్తూ.. యాత్రికుల భద్రత కోసం కేరళ వాటర్ అథారిటీ(కేడబ్ల్యూఏ), కేరళ రాష్ట్ర విద్యుత్తు బోర్డు(కేఎస్ఈబీ), ఇతర శాఖలు సంయుక్తంగా సాంకేతిక కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. కాగా.. తెలుగు రాష్ట్రాలకు చెందిన అఖిల భారత అయ్యప్ప సేవాసంఘం దాఖలు చేసిన మాండమస్ రిట్ పిటిషన్‌లో ఇదే ధర్మాసనం ఇటీవల తీర్పునిస్తూ.. ఎరుమేళి, పంపా, శబరిమల సన్నిధానంలోని హోటళ్లు, అన్నదాన కేంద్రాల్లో వారానికి ఓ సారి తప్పనిసరిగా తనిఖీలు చేయాలని టీడీబీని ఆదేశించింది.

పాక్‌కు మద్దతుతో తుర్కియే పర్యాటకం ఢమాల్

అంకారా, ఆగస్టు 23: తుర్కియేకు వెళ్లే భారత పర్యాటకుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు తుర్కియే బహిరంగంగా మద్దతు ఇచ్చిన ఫలితం ఇది. భారత్‌పైకి పాకిస్థాన్ ప్రయోగించిన సొంగర్ అసిస్‌గార్డ్ డ్రోన్లు తుర్కియేలో తయారైనవేనని వెల్లడవడమే దీనికి కారణం. గత మూడు నెలల్లోనే తుర్కియేకు భారత పర్యాటకుల సంఖ్య 50% తగ్గినట్టు తుర్కియే విడుదల చేసిన అధికారిక గణాంకాలే తెలియజేస్తున్నాయి. ఈ ఏడాది మేలో 31,659 మంది భారతీయులు తుర్కియేలో పర్యటించగా, జూన్‌లో ఆ సంఖ్య 24,250కి, జూలైలో 16,244కి తగ్గిపోయింది. కాగా, 2024 జూలైలో 28,875 మంది భారతీయులు తుర్కియేలో పర్యటించారు. ఇది ఈ ఏడాది జూలైలో పర్యటించినవారి కంటే 44 శాతం అధికం. అంతర్జాతీయ వేదికలపై చైనా, అజర్‌బైజాన్ దేశాలతో కలిసి తుర్కియే బహిరంగంగా పాకిస్థాన్‌కు మద్దతు ప్రకటించడమే పర్యాటకుల సంఖ్య తగ్గడానికి కారణం. ఐక్యరాజ్యసమితిలోనూ ఆ మూడు దేశాలే పాక్‌కు మద్దతు తెలిపాయి. దీంతో భారత్‌లో 'బాయ్‌కాట్ తుర్కియే' ప్రచారం ఊపందుకుంది.

శ్రీనివాసరావుకు గంగాశరణ్ సింహ్ పురస్కారం

» ప్రదానం చేసిన బిహార్ సీఎం నితీశ్ కుమార్



న్యూఢిల్లీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావుకు శనివారం బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రతిష్ఠాత్మకమైన గంగాశరణ్ సింహ్ పురస్కారాన్ని ప్రదానం చే శారు. దేశంలో హిందీ సాహిత్యం, భాషాభివృద్ధికి కేంద్ర సాహిత్య అకడామీ కార్యదర్శిగా అందిస్తున్న సేవలకుగాను ఆయనకు ఈ పురస్కారం లభించింది. పట్నాలో సచివాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో శ్రీనివాసరావును ఈ పురస్కారంతో పాటు లక్ష రూపాయల నగదు, దుశ్శాలువాతో నితీశ్ కుమార్ సత్కరించారు.

ఆ జడ్జిలంతా నక్సలైట్లేనా?

'సల్వాజుడుం' తీర్పులో నాతో పాటు మరో జడ్జి ఉన్నారు.. రివ్యూ పిటిషన్‌ను మరో ఇద్దరు కొట్టేశారు

» తీర్పును చదివి ఉంటే అమిత్‌షా అలా మాట్లాడేవారు కాదు

» జస్టిస్ సుదర్శన్‌రెడ్డి



"దేశంలోని అత్యున్నత స్థాయి నాయకుల్లో ఏపీ సీఎం చంద్రబాబు ఒకరు.. దార్శనికత కలిగిన నేత ఆయన.. దేశ హితాన్ని దృష్టిలో పెట్టుకొని ఆయన సరైన నిర్ణయాన్ని తీసుకుంటారని నమ్ముతున్నా.. ఇదివరకు అనేక సందర్భాల్లో ఆయన ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నారు. దేశ రాజకీయ రంగాన్ని ఎన్నో మలుపులు తిప్పారు."

న్యూఢిల్లీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో సల్వాజుడుం పేరిట ప్రజలే ప్రజల్ని చంపుకొనేలా చేయడం రాజ్యాంగ వ్యతిరేకమంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర హోంమంత్రి అమిత్ షా చదివి ఉంటే.. తనపై నక్సల్స్ మద్దతుదారు అన్న ఆరోపణలు చేసి ఉండేవారు కాదేమోనని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆ 40 పేజీల తీర్పు వ్యక్తిగతంగా తనది కాదని, సుప్రీంకోర్టుదని, తనతో పాటు బెంచ్‌లో మరో న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఎస్ నిజ్జార్ కూడా ఉన్నారని గుర్తుచేశారు. ఆ తీర్పును వ్యతిరేకిస్తూ దాఖలైన రివ్యూ పిటిషన్‌ను జస్టిస్ నాగరత్నమ్మ, జస్టిస్ సతీష్‌చంద్ర శర్మ కొట్టివేసారని.. దేశ అత్యున్నత న్యాయస్థానానికి చెందిన ఈ న్యాయమూర్తులందర్నీ నక్సలైట్లు అనే అంటారా అని సూటిగా ప్రశ్నించారు. వాస్తవానికి, సుప్రీంకోర్టు తీర్పుపై బయట చర్చించడం గౌరవం కాదని హితవు పలికారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలో విపక్ష కూటమి ఇండియా తరపున పోటీ చేస్తున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నక్సల్స్ మద్దతుదారు అని, అందుకనే సల్వాజుడుంను నిషేధించారని అమిత్‌షా తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై శనివారం జస్టిస్ సుదర్శన్‌రెడ్డి.. పీటీఐ, ఏఎన్ఐ, హిందుస్థాన్‌టైమ్స్, ఆజ్‌తక్ వంటి పలు మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పందించారు. గౌరవనీయ భారతదేశ హోంమంత్రిగా ఎలాంటి సైద్ధాంతిక వ్యత్యాసాలు చూపకుండా ప్రజల ప్రాణాలను, స్వేచ్ఛను, ఆస్తిని రక్షించే రాజ్యాంగ విధి, కర్తవ్యం అమిత్‌షాకు ఉందని, ఆయనతో నేరుగా వాగ్వాదానికి దిగాలని తాను అనుకోవటం లేదని జస్టిస్ సుదర్శన్ రెడ్డి చెప్పారు. చర్చలో హుందాతనం ఉండాలని, ఈ విషయాన్ని ఇక్కడితో వదిలేస్తున్నానన్నారు.

ఇది సైద్ధాంతిక పోరు

ఉపరాష్ట్రపతి పదవికి జరుగుతున్న పోటీ తనకు, ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు మధ్య జరుగుతున్న వ్యక్తిగత పోటీ కాదని, ఇది తాము ప్రాతినిధ్యం వహిస్తున్న రెండు భిన్న సిద్ధాంతాల మధ్య పోటీ అని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వివరించారు. రాధాకృష్ణన్ ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చారని, ఆ సిద్ధాంతాన్ని తాను ఆమోదించకపోవటమే కాదు.. దానికి చాలా దూరంగా ఉంటానని తెలిపారు. తాను ప్రధానంగా ఉదార భావాలున్న రాజ్యాంగ ప్రజాస్వామ్యవాదినన్నారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షాల నిరసనపై అడిగిన ప్రశ్నకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సమాధానమిస్తూ.. విపక్షాలు సభను భగ్నం చేయడం కూడా నిరసనలో భాగమని, మాట్లాడటానికి అనుమతించనప్పుడు నిరసన తెలుపడమే మాట్లాడటమని అభివర్ణించారు. బీజేపీ ప్రతిపక్షంగా ఉన్న సమయంలో.. 'సభను ఆటంకపర్చటం కూడా రాజకీయ కార్యాచరణే. అది ఒక పార్లమెంటరీ సంప్రదాయం' అంటూ నాడు ఆ పార్టీ నేత అరుణ్‌జైట్లీ చేసిన వ్యాఖ్యను గుర్తుచేశారు. కులగణన అవసరాన్ని నొక్కిచెబుతూ.. సమాజంలో ఏయే వర్గాలకు ప్రభుత్వ చేయూత అవసరమో తెలుసుకునేందుకే అది అవసరమని పేర్కొన్నారు. 'రాజ్యాంగం కులం గురించి మాట్లాడదు. ఏ సమూహ ప్రజానీకాన్నైనా వెనుకబాటు వర్గంగా పేర్కొనాలంటే ఆ ప్రజల కులం, వారి సామాజిక ఆర్థిక స్థితిగతులు, అధికారంలో వారి భాగస్వామ్యం, సమాజంలో వారి గుర్తింపు తదితర అంశాలు తెలుసుకోవటం అవసరం. దీనికోసమే కులగణన చేపట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం కేంద్రప్రభుత్వం కూడా జనగణనలో దీనిని చేర్చుతామని ప్రకటించింది' అని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.

ప్రవేశిక సవరణకు జనసంఘ్ సమర్థన

సోషలిస్టు, సెక్యులర్ పదాలపై అలుముకున్న చర్చను ఉద్దేశించి మాట్లాడుతూ.. రాజ్యాంగంలో తొలి నుంచీ ఇవి లేకున్నా, రాజ్యాంగంలో అవి అంతర్భాగమేనన్నారు. ఎమర్జెన్సీ సమయంలో వాటిని రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశికలో చేర్చినప్పటికీ, ఆ తర్వాత జనసంఘ్ (బీజేపీ పూర్వరూపం)తో కూడిన జనతా పార్టీ ప్రభుత్వం వచ్చినప్పుడు.. ఆ సవరణను ఏకగ్రీవంగా ఆమోదించిందని తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్యం తీరుతెన్నులపై స్పందిస్తూ.. గతంలో ఆర్థిక వ్యవస్థకు సంబంధించి 'ద్రవ్యలోటు' అనే పదాన్ని ఉపయోగించేవారని, ఇప్పుడు 'ప్రజాస్వామ్య లోటు' గురించి మాట్లాడాల్సి వస్తోందని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.దేశం నేటికీ రాజ్యాంగ ప్రజాస్వామ్యంగా కొనసాగుతున్నప్పటికీ.. ప్రజాస్వామ్యం ఒత్తిడిలో ఉండటం మాత్రం వాస్తవమన్నారు. దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందా అన్న చర్చ మంచిదేనని, దాంట్లో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఏ పార్టీతో నాకు సంబంధం లేదు

తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని, చంద్రబాబు, కేసీఆర్‌తోసహా అన్ని రాజకీయ పార్టీలనూ, నేతలనూ తనకు ఓటు వేయాల్సిందిగా అభ్యర్థిస్తున్నానని తెలిపారు. తెలుగు ఆత్మగౌరవం పేరుతో ఓటు వేయమని తాను మాట్లాడలేదని, తెలుగుదేశం ఆ ప్రాతిపదికగా అధికారంలోకి వచ్చిందని చెప్పారు. తాను ఒక భారతీయ పౌరుడిగా అందర్నీ ఓట్లు అడుగుతున్నానని చెప్పారు. ఇండియా కూటమి తనను ఏకగ్రీవంగా ఎంపిక చేయటంపై స్పందిస్తూ.. దేశ ప్రజానీకంలో 63-64 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీలు తనకు మద్దతునివ్వటం తనకు గర్వకారణమన్నారు. కాగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆదివారం తమిళనాడు వెళ్లి డీఎంకే అధినేత, ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకోనున్నారు. డీఎంకే ఎంపీలతో ఆయన భేటీ అవుతారు.

బెట్టింగ్ కేసులో కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర అరెస్ట్

బెంగళూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్ కేసులో కర్ణాటకలోని చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే కేసీ వీరేంద్ర పప్పీని మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. క్యాసినో లీజు వ్యవహారంపై మాట్లాడేందుకు తన అనుచరులతో కలిసి సిక్కిం రాజధాని గ్యాంగ్‌టక్‌కు వెళ్లిన ఆయనను శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్టు ఈడీ అధికారులు వెల్లడించారు. పలు రాష్ట్రాల్లో దాడులు చేసి విదేశీ కరెన్సీ సహా 12 కోట్ల రూపాయల నగదు, రూ.6 కోట్ల విలువైన బంగారం, 10 కిలోల వెండితో పాటు నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. గ్యాంగ్‌టక్‌లో స్థానిక మేజిస్ట్రేట్ ముందు ఆయన్ను హాజరుపరిచి, ట్రాన్సిట్ రిమాండ్‌తో కర్ణాటకకు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరెలోని వీరేంద్రతో పాటు ఆయన సోదరులు కేసీ తిప్పేస్వామి, కేసీ నాగరాజ్ నివాసాలపైనా ఈడీ దాడులు చేశారు. బెంగళూరు, హుబ్బళ్లి, జోధ్‌పూర్ (రాజస్థాన్), ముంబై, సిక్కిం, గోవాలోని ఐదు క్యాసినోలతో కలిపి 31 చోట్ల దాడులు జరిగాయి. ఈడీ దాడులు, ఎమ్మెల్యే అరెస్టు గురించి సీఎం సహా కాంగ్రెస్ నాయకులు ఎవరూ స్పందించలేదు.

రూ.2929 కోట్ల మోసం కేసు.. అనిల్ అంబానీ ఇంట్లో సీబీఐ సోదాలు

న్యూఢిల్లీ/ముంబై, ఆగస్టు 23: రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్) డైరెక్టర్ అనిల్ అంబానీ ఇంట్లో సీబీఐ సోదాలు జరిపింది. ఎస్బీఐని రూ.2929.05 కోట్ల మేర మోసగించిన కేసులో భాగంగా ముంబైలోని ఆయన నివాసంలో శనివారం సోదాలు చేసినట్లు అధికారులు తెలిపారు. ముంబైలోని ఆర్‌కామ్ కార్యాలయంతో పాటు అనిల్ నివాసంలో తనిఖీలు చేసినట్లు ఓ ప్రకటనలో వెల్లడించారు. ఎస్బీఐ ఫిర్యాదు మేరకు ఆర్‌కామ్, సంస్థ డైరెక్టర్ అనిల్ అంబానీ, గుర్తుతెలియని ప్రభుత్వ అధికారులపై సీబీఐ గురువారం ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సంగతి తెలిసిందే. నేరపూరిత కుట్ర, మోసం తదితర ఆరోపణలపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే సోదాలు నిర్వహించినట్లు సీబీఐ అధికార ప్రతినిధి తెలిపారు. నిందితులు కుట్రపూరితంగా తప్పుడు ప్రతిపాదనలతో ఆర్‌కామ్‌కు రుణాలను మంజూరు చేయించుకున్నారన్నారు. ఎస్బీఐ ఫిర్యాదు మేరకు 2018 లెక్కల ప్రకారం.. ఆర్‌కామ్ వేర్వేరు బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు రూ.40 వేల కోట్లకు పైగా బకాయిలు ఉంది. ఈ సంస్థ వల్ల ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన ఎస్బీఐ ఒక్కదానికే రూ.2929.05 కోట్ల నష్టం వాటిల్లింది.

భారత్‌లో అమెరికా నూతన రాయబారిగా సెర్జియో గోర్

» ట్రంప్‌నకు అత్యంత నమ్మకస్తుడు



వాషింగ్టన్, ఆగస్టు 23: అమెరికా అధ్యక్షుడి పాలనా కేంద్రం శ్వేత సౌధం సిబ్బంది వ్యవహారాల డైరెక్టర్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు అత్యంత నమ్మకస్తుడు అయిన సెర్జియో గోర్ భారత్‌లో అమెరికా నూతన రాయబారిగా నియమితులయ్యారు. అమెరికా భారత వస్తువులపై అధిక సుంకాలు విధించినప్పటి నుంచి రెండు దేశాల మధ్య విభేదాలు నెలకొన్న తరుణంలో ఈ నిర్ణయం వెలువడడం గమనార్హం. కీలకమైన ఈ పదవికి గోర్(38) నియామకాన్ని ప్రకటిస్తూ అధ్యక్షుడు ట్రంప్.. గోర్ దక్షిణ, మధ్య ఆసియా వ్యవహారాల ప్రత్యేక రాయబారిగానూ వ్యవహరిస్తారని ప్రకటించారు. "ప్రపంచంలోనే అత్యధిక జన సాంద్రత గల ప్రాంతంలో నా ఎజెండా అమలుకు అత్యంత నమ్మకస్తుడైన వ్యక్తి అవసరం. అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా తీర్చిదిద్దడంలోనూ గోర్ సహకరించాల్సి ఉంది" అని ట్రంప్ అన్నారు. 2024లో ట్రంప్ ఎన్నికల ప్రచారం సందర్భంగా గోర్ ఆయన రాజకీయ కార్యాచరణ కమిటీలో కీలక పాత్ర పోషించారు.

మా చమురు కొనకపోతే పోండి

మేం ఎవరినీ ఒత్తిడి చేయడం లేదు.. మా రైతులు, వ్యాపారులే మాకు ముఖ్యం

» అమెరికా, యూరప్ బయ్యర్లకు తేల్చిచెప్పిన విదేశాంగ మంత్రి జైశంకర్

» రష్యా చమురు అంశంపై స్పష్టత

న్యూఢిల్లీ, ఆగస్టు 23 : "మీకు నచ్చకపోతే మా దగ్గర చమురు తీసుకోకండి" అంటూ అమెరికా, యూరప్ చమురు బయ్యర్లకు విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ తేల్చిచెప్పారు. రష్యానుంచి చమురు కొంటున్నదన్న కారణంగా భారత ఉత్పత్తులపై ట్రంప్ 50% సుంకం విధించిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తమకు రైతులు, చిన్న వ్యాపారుల ప్రయోజనాలే ముఖ్యమని జైశంకర్ స్పష్టం చేశారు. శనివారమిక్కడ జరిగిన ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరమ్ - 2025 సదస్సులో జైశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రష్యా చమురు కేంద్రంగా అమెరికా, ఇతర దేశాలు చేస్తున్న విమర్శలకు ఆయన గట్టిగా సమాధానమిచ్చారు. "శుద్ధిచేసిన చమురు లేక పెట్రో ఉత్పత్తులను మా వద్దే తీసుకోవాలని ఎవరినీ మేం బలవంతం పెట్టడం లేదు. అమెరికా యంత్రాంగం వ్యాపారం చేయడాన్ని సమర్థించే కొంతమంది ఇతరులను మాత్రం వ్యాపారం చేయొద్దని అనడం హాస్యాస్పదం. ఇందులో ఒత్తిడి ఏమీ లేదు. నచ్చకపోతే మా ఉత్పత్తులు కొనొద్దు" అన్నారు. భారత్ కంటే చైనానే రష్యా చమురును అధికంగా తీసుకుంటున్నా, ఆ దేశంపై ప్రతీకార సుంకాలు వేయరని, ఇంతకుమించి వివక్ష, అన్యాయం ఉంటాయా అని ప్రశ్నించారు. పాకిస్థాన్- అమెరికా సంబంధాలు ఇటీవల పెరగడంపై జైశంకర్ స్పందిస్తూ.. అల్‌కాయిదా ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్‌ను పాకిస్థాన్‌లో అమెరికా అంతం చేసిన విషయం గుర్తుచేశారు. "అమెరికా.. పాక్.. లాడెన్' అంటూ వ్యాఖ్యానించారు. ఆగస్టులో భారత్‌కు రావాల్సిన అమెరికా ప్రభుత్వ బృందం పర్యటన రద్దు కావడంపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. వాషింగ్టన్, న్యూఢిల్లీల మధ్య వాణిజ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయని తెలిపారు. దేశ ప్రజల ప్రయోజనాల రీత్యా కొన్ని పరిమితులు తమకు తాము విధించుకున్నామని, దీని అర్థం కటీఫ్ (తెగదెంపులు) చెప్పినట్టు కాదని జైశంకర్ సరదాగా వ్యాఖ్యానించారు.



గురువారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయిన జైశంకర్(ఫైల్)

అమెరికాకు తపాలా పార్సిళ్లు బంద్

సుంకాల నిబంధనల్లో అమెరికా మార్పులు తెచ్చిన నేపథ్యంలో తపాలా శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇక్కడ నుంచి అమెరికాకు పంపే పార్సిళ్లను అనుమతించరాదని నిర్ణయం తీసుకుంది. అయితే, ఉత్తరాలు, పత్రాలు, బహుమతులను మాత్రం ఎప్పటిలాగానే అమెరికాకు పంపవచ్చునని పేర్కొంది. అయితే, వాటి విలువ వంద డాలర్ల లోపు ఉండాలని స్పష్టంచేసింది. 800 అమెరికా డాలర్ల కంటే తక్కువ విలువ ఉండే పార్సిళ్లు, ఇతర కవర్లపై గతంలో అమెరికాలో సుంకం లేదు. కొత్త డ్యూటీ నిబంధనల ప్రకారం.. విలువతో సంబంధం లేకుండా అన్నిరకాల సర్వీసులను సుంకాల పరిధి లోకి తెచ్చారు.

ధర్మస్థలపై తొలగిన ముసుగు!

» శవాల ఖననంపై తను చెప్పివన్నీ అబద్ధాలేనన్న మాజీ కార్మికుడు

» 10 రోజుల సిట్ కస్టడీ చన్నయ్య





తవ్వకాల సమయంలో ముసుగులో మాజీ పారిశుధ్య కార్మికుడు చన్నయ్య (ఫైల్)

బెంగళూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ధర్మస్థల వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కర్ణాటకలోని ఆ ప్రసిద్ధ ఆలయ పరిసరాల్లో వందలాది మృతదేహాలను పాతిపెట్టానంటూ ఫిర్యాదు చేసి, దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మాజీ పారిశుధ్య కార్మికుడు చన్నయ్యను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు అరెస్టు చేశారు. తాను చెప్పినవన్నీ అబద్ధాలేనని, తనపై కొంత మంది ఒత్తిడి చేసి ఆ విధంగా చెప్పించారని, అసలు అలాంటిదేమీ లేదని ఒప్పుకోవడంతో.. ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం శనివారం బెళ్తంగడి కోర్టులో ప్రవేశపెట్టగా.. తదుపరి దర్యాప్తు కోసం చన్నయ్యను న్యాయాధికారి 10 రోజుల పాటు సిట్ కస్టడీకి అప్పగించారు. కుట్రకు స్పష్టమైన ఆధారాలు లభించడంతో సిట్ అధికారులు చన్నయ్య మాస్క్‌ను శనివారం తొలగించి, అరెస్టు చేసినట్లు ప్రకటించారు. చన్నయ్య చూపిన 17 ప్రదేశాల్లో సిట్ అధికారులు మృతదేహాల ఆనవాళ్ల కోసం 20 రోజులకు పైగా తవ్వకాలు చేపట్టిన విషయం తెలిసిందే. అయినా ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈ నేపథ్యంలో తవ్వకాలను గతవారం నిలిపివేసిన అధికారులు.. ఆయన్ను విచారించడం ప్రారంభించారు. తాను తమిళనాడులో నివసిస్తుండగా, ఏడాదిన్నర క్రితం అదే ప్రాంతానికి చెందిన కొంత మంది తనను సంప్రదించినట్లు చన్నయ్య సిట్ విచారణలో చెప్పారు. ధర్మస్థలలో మృతదేహాలను పాతిపెట్టినట్లు ప్రచారం చేయమన్నారని, అలాంటి ఘటనలు ధర్మస్థలలో జరగలేదని తెలిపినా.. వారు వదిలిపెట్టలేదని పేర్కొన్నట్లు తెలిసింది. 'నెలల తరబడి తనను వెంబడించి ఒత్తిడి చేసి ఒప్పించారు. ఓ పుర్రెను తీసుకొచ్చి ఇచ్చారు. వారి సలహాలకు అనుగుణంగానే ఫిర్యాదు చేశాను' అని చన్నయ్య సిట్ అధికారులకు వివరించాడు.

అనన్య నా కూతురు కాదు: సుజాత

మరోవైపు ధర్మస్థల వివాదంలో సుజాత భట్ 'ముసుగు' కూడా తొలగింది. అనన్య భట్ తన కూతురు కాదని ఆమె ఒప్పుకున్నారు. 'నా కూతురు మంగళూరు కస్తూర్బా మెడికల్ కళాశాలలో చదువుతుండేది. స్నేహితులతోపాటు ధర్మస్థలకు వెళ్లి మాయమైంది' అంటూ సుజాత గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే సుజాత భట్‌కు అసలు పిల్లలే లేరని వారం క్రితమే ఆమె బంధువులు స్పష్టం చేశారు. ఆమె చూపిన ఫొటో అనన్య భట్‌ది కాదన్నారు.

ఇంటెల్‌లో అమెరికాకు 10% వాటా

వాషింగ్టన్: అమెరికాకు చెందిన అంతర్జాతీయ సెమీకండక్టర్ల (చిప్) తయారీ దిగ్గజం ఇంటెల్ కార్ప్‌లో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం 10% వాటా చేజిక్కించుకుంది. ఇంటెల్‌కు గతంలో ప్రకటించిన గ్రాంట్లను ఈక్విటీ వాటాగా మార్చుకుంది. యూఎస్ చిప్స్ అండ్ సైన్స్ చట్టంలో భాగంగా 570 కోట్ల డాలర్లు, భద్రమైన చిప్‌ల తయారీ కోసం ఏర్పాటు చేసిన సెక్యూర్ ఎన్‌క్లేవ్ ప్రోగ్రామ్‌లో భాగంగా 320 కోట్ల డాలర్లు కలిపి మొత్తం 890 కోట్ల డాలర్ల (రూ.77,875 కోట్లు)ను అమెరికా ప్రభుత్వం ఇంటెల్‌కు మంజూరు చేసింది. ఇంకా విడుదల చేయాల్సి ఉన్న ఈ నిధులకు బదులుగా కంపెనీలోని 9.9 శాతం వాటాకు సమానమైన 43.33 కోట్ల షేర్లను ఒక్కొక్కటీ 20.47 డాలర్ల చొప్పున కేటాయించినట్లు ఇంటెల్ వెల్లడించింది. అయితే, కంపెనీలో ప్రభుత్వానికి బోర్డు సభ్యత్వం లేదా నియంత్రణ హక్కులు లభించవని ఇంటెల్ స్పష్టం చేసింది. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి యూఎస్ కార్పొరేట్ రంగంపై నియంత్రణ కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే ఇంటెల్‌లో వాటాను దక్కించుకున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.